

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



ఆదివారం | 31-8-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 136 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం; తిథి: అష్టమి రా.12:58 తదుపరి నవమి; నక్షత్రం: అనూరాధ సా.5:27 తదుపరి జ్యేష్ఠ; వర్జ్యం: రా.11:37-1:23; దుర్ముహూర్తం: సా.4:47-5:36; అమృతఘడియలు: శేషం ఉ.7:36; రాహుకాలం: సా.4:30-6:00; సూర్యోదయం: 6:04; సూర్యాస్తమయం: 6:26 | హైదరాబాద్ సిటీ

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఎమ్మెల్యేలు.. వసూల్ రాజాలు

యూరియాలోనూ పిండుకోవాలనుకున్న ఓ ఎమ్మెల్యే

ఇటు తెలంగాణ, అటు ఆంధ్రప్రదేశ్‌లో కొంత మంది శాసనసభ్యులు లేని అధికారాలను సంక్రమింప జేసుకొని ఆయా నియోజకవర్గాలలో ప్రజలు గాలి పీల్చుకోవాలన్నా తమ అనుమతి తప్పనిసరి అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు.

ఇప్పుడు ఎమ్మెల్యేలు ఆయా నియోజకవర్గాలకు సామంత రాజులుగా, దండ నాయకులుగా తయారయ్యారు. తెలంగాణలో యూరియా కొరత ఇప్పుడు ప్రధాన సమస్యగా ఉంది. రైతులు ప్రభుత్వాన్ని నిందిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన రామగుండం ఎరువుల కంపెనీ తెలంగాణలో ఉన్నప్పటికీ సాంకేతిక సమస్యలు తలెత్తి ఉత్పత్తి నిలిచిపోయింది. దీంతో యూరియా కొరత మరింత తీవ్రమైంది. ఈ పరిస్థితుల్లో ఎవరైనా ఏమి చేస్తారు? ఎరువుల ఫ్యాక్టరీలో మరమ్మతులను వేగంగా పూర్తిచేయించి ఉత్పత్తి తిరిగి ప్రారంభమయ్యేలా చేస్తారు. కానీ అధికార పార్టీకి చెందిన ఒక ఎమ్మెల్యే ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. మరమ్మతుల కాంట్రాక్టు పొందిన సంస్థ ప్రతినిధులు తనను కలసి తన సంగతి ఏమిటో తేల్చకపోతే ఎలా అని భీష్మించుకొని కూర్చున్నారు.

కేసీఆర్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యేలకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు సంబంధించిన సమస్యల పరిష్కారం చేయాలన్నా ఎమ్మెల్యేల అనుమతి తప్పనిసరి చేశారు. పోలీస్ స్టేషన్లో ఎఫ్ఐఆర్ కట్టాలన్నా శాసనసభ్యుడి అనుమతి ఉండాలని నిర్దేశించారు. దీంతో యావత్ అధికార యంత్రాంగం రాజకీయ నాయకుల గుప్పిట్లోకి వెళ్లిపోయింది. ఒకవైపు లేని అధికారాలను అనుభవిస్తూ, మరోవైపు భూ కబ్జాలు, దందాలలో ఎమ్మెల్యేలు మునిగితేలారు. ఫలితంగా 2023 ఎన్నికలకు ముందు భారత రాష్ట్ర సమితికి చెందిన శాసనసభ్యులపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది.



సీఎంలు సైతం ఎమ్మెల్యేలను అదుపు చేయలేని పరిస్థితి ఏర్పడింది. ఉమ్మడి రాష్ట్రంలో 2004 తర్వాత పైస్థాయిలో అవినీతి వ్యవస్థీకృతం అయింది. అదే సమయంలో మీరు కూడా సంపాదించుకోండి అన్నట్టుగా ఎమ్మెల్యేలకు స్వేచ్ఛ ఇచ్చారు. ఎన్నికల్లో విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు చేయడం, గెలిచిన వారు తిరిగి ఆ డబ్బు రాబట్టుకోవడానికి తెగబడటం అనేది ఒక విష వలయంగా మారింది. ఏపీలో పరిస్థితి మరింత వికటిస్తోంది. జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యేలకు పట్టపగ్గాలు లేకుండాపోయాయి. వ్యవస్థలంటే భయం లేకుండా పోయింది. మీరు అందిన కాడికి దోచుకోండి, నన్ను మాత్రం ఏమీ అడగకండి అంటూ ఎమ్మెల్యేలకు జగన్ రెడ్డి లైసెన్స్ ఇచ్చేశారు. 4

విచిత్రం ఏమిటంటే, ఏపీలో శాసనసభకు తొలిసారిగా ఎన్నికైన వారు, కొత్తగా రాజకీయ అరంగేట్రం చేసిన రాజకీయ కుటుంబాల వారసులు ఇలాంటి అరాచకాలకు అధికంగా పాల్పడుతున్నారు. శాసనసభ్యులు కట్టు తప్పుతున్నారని తెలిసినా సీఎం చంద్రబాబు మెతక వైఖరి ఎందుకు ప్రదర్శిస్తున్నారన్నదే ఇప్పుడు ప్రశ్న. కూటమి ప్రభుత్వానికి శాసనసభలో తిరుగులేని మెజారిటీ ఉంది. పాతిక మంది ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకున్నా వచ్చే నష్టం ఏమీ లేదు.

గతంలో నక్సలైట్ల ప్రభావం అధికంగా ఉన్నప్పుడు శాసనసభ్యులు బాధ్యతగా ఉండేవారు. వారిలో భయం ఉండేది. ఇప్పుడు నక్సలైట్ల భయం లేకపోవడంతో బరితెగిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు మరో ధృతరాష్ట్రుడిగా మిగిలిపోకూడదు. శాసనసభ్యుల పోకడలను అదుపుచేయని పక్షంలో వచ్చే ఎన్నికల్లో కౌరవులకు పట్టిన గతే కూటమి సభ్యులకు పట్టదా? దారి తప్పిన శాసనసభ్యులను వెంటనే దారిలో పెట్టడానికి చంద్రబాబు కొరడా ఝుళిపించాలి. మంచితనం, మెతక వైఖరి అన్ని వేళలా మంచివి కావు.



డాక్టర్ గ్రాడ్లిన్ రాయ్ (ఫైల్)

ఆస్పత్రి రౌండ్స్‌లో డాక్టర్‌కు గుండెపోటు

యువ కార్డియాక్ సర్జన్ మృతి 12

చెన్నైలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఘటన

ప్రాణాలు పోస్తూనే ఆగుతున్న ఊపిరి! 3

విధుల్లో ఒత్తిడితో కుప్పకూలుతున్న వైద్యులు



హాయ్! నేను షియావో!

ఎస్‌సీవో సదస్సులో అత్యాధునిక ఏఐ హ్యూమనాయిడ్ రోబో సేవలు

ఇంటర్వ్యూ చేసిన ఏఎన్ఐ వార్తాసంస్థ

భావోద్వేగాలను గుర్తించే అల్గారిథమ్స్

తక్షణ సమాచారం ఇచ్చే డేటాబేస్‌లు 12

సాంస్కృతిక తటస్థత, కచ్చితమైన సమాచారం, పనితీరులో మెరుగుదల.. ఇవే నా ప్రమాణాలు: షియావో హీ

లోపాల పుట్టలుగా ఫర్టిలిటీ కేంద్రాలు

ఆస్పత్రి జాబితాలో కనిపించే డాక్టర్లు వేరు.. అక్కడ పనిచేసేవాళ్లు వేరు 2

ఎంబ్రియాలజిస్టులు లేకుండానే నిర్వహణ

నిబంధనలకు విరుద్ధంగా 55 సెంటర్లు

వాటికి రేపు నోటీసులు.. తర్వాత చర్యలు

381 కేంద్రాల్లో తనిఖీలు పూర్తి

ఎఫ్-1 వీసా నిబంధనల్లో త్వరలో మార్పులు 12

అమల్లోకి వస్తే వర్సిటీ, కోర్సుల మార్పు కష్టమే

కోర్సులు చేస్తూ ఉండిపోవడం కుదరదు

ఆలయాల నిధులు దేవుళ్లకు మాత్రమే..

ఇతర కార్యక్రమాలకు మళ్లించరాదు

మతపరమైన విధులకే వినియోగించాలి

మద్రాస్ హైకోర్టు స్పష్టీకరణ 12

సభకు బీసీ బిల్లులు

నేడు ఆమోదం పొందిన వెంటనే జీవో

- పంచాయతీరాజ్, పురపాలక చట్టాలకు సవరణ
- రెండు ఆర్డినెన్స్‌ల స్థానంలో ప్రవేశపెట్టాలని నిర్ణయం
- 50 శాతం పరిమితిని తొలగించడానికే సవరణలు
- గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా కోదండరాం, అజార్
- వరద నష్టంపై రేపు కలెక్టర్లతో ముఖ్యమంత్రి సమీక్ష
- తెలంగాణ రాష్ట్ర గోశాలల సంక్షేమ బోర్డు ఏర్పాటు
- 2022-23 ధాన్యం బాకీలున్న మిల్లర్లపై పీడీ చట్టం
- 3రోజుల్లో చెల్లించకుంటే చర్యలే.. క్యాబినెట్ నిర్ణయాలు



క్యాబినెట్ నిర్ణయాలను మీడియాకు వెల్లడిస్తున్న మంత్రులు పొన్నం, పొంగులేటి

హైదరాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను ప్రభుత్వపరంగానే ఇచ్చేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. శాసనసభ ఆమోదించిన రెండు బీసీ రిజర్వేషన్ల బిల్లులు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉండడం, గవర్నర్‌కు పంపిన రెండు ఆర్డినెన్స్‌లు కూడా రాష్ట్రపతి వద్దకే వెళ్లిన నేపథ్యంలో ఇప్పుడా ఆర్డినెన్స్‌ల స్థానంలో రెండు బిల్లులను తిరిగి ఆదివారం శాసనసభలో ప్రవేశపెట్టి వెంటనే ఆమోదించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. సెప్టెంబరు 30 లోపు స్థానిక సంస్థల ఎన్నికలను పూర్తి చేయాలంటూ హైకోర్టు విధించిన గడువు దగ్గర పడుతుండడం, పాలకవర్గాలు లేక స్థానిక సంస్థలకు కేంద్రం నుంచి రావాల్సిన ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోవడం వంటి పరిస్థితుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదన్న క్యాప్‌ను తొలగిస్తూ పంచాయతీరాజ్ చట్టం-2018, పురపాలక చట్టం-2019 సవరణల బిల్లులను ఆదివారం శాసనసభలో ప్రవేశపెట్టి ఆమోదం పొందుతారు. దాంతోపాటు బీసీలకు 42 రిజర్వేషన్లను వర్తింపజేస్తూ ప్రత్యేక జీఓను జారీ చేస్తారు. గవర్నర్ కోటాలో ప్రొఫెసర్ కోదండరామ్, మహమ్మద్ అజారుద్దీన్‌లను ఎమ్మెల్సీలుగా ప్రతిపాదిస్తూ రాష్ట్ర మంత్రివర్గం

మిగతా 13వ పేజీలో...

కాళేశ్వరం నివేదిక నేడు బహిర్గతం

శాసనసభలో ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం.. బ్యారేజీల వైఫల్యానికి కారకులు, కారణాల్ని వివరించనున్న సర్కారు

తదుపరి చర్యలపై విధాన ప్రకటన.. సిట్ ఏర్పాటుకు అవకాశం?

మాగంటి గోపీనాథ్ మృతికి సభ సంతాపం 13

ఉదయం బిల్లులు, సాయంత్రం నివేదికపై చర్చ

శాసనసభ బీఏసీ సమావేశంలో నిర్ణయం

వర్షాలు, యూరియాపై చర్చకు బీఆర్ఎస్ పట్టు.. వాకౌట్ 13

సభ 15 రోజులు జరపాలన్న ప్రతిపక్షం.. నేడు నిర్ణయం



సెప్టెంబరు రెండో వారంలో స్థానిక నోటిఫికేషన్!

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సర్కారు సన్నద్ధం

రేపో ఎల్లుండో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల జీవో

బీసీ స్థానాలు తేల్చేందుకు వారం గడువు అడిగిన ఈసీ

10 నాటికి ఎంపీటీసీ, జడ్పీటీసీల తుది ఓటర్ల జాబితా

హైదరాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సెప్టెంబరు రెండో వారంలో నోటిఫికేషన్ రానుంది. మొదట ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకే ఎన్నికలు నిర్వహిస్తారు. గ్రామ పంచాయతీలకు ఆ తర్వాత నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో బిల్లులను ఆమోదించి, తరువాత దానికి సంబంధించిన జీవోను ప్రభుత్వం విడుదల చేయనుంది. ఆదివారం రెండు బిల్లులు ఆమోదం పొందితే సోమ లేదా మంగళవారాల్లో జీవో ఇస్తారని తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లు తేల్చితే బీసీల స్థానాల కేటాయింపునకు మరో వారం రోజుల గడువు కావాలని ఎన్నికల సంఘం చెప్పినట్లు తెలిసింది. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల తుది జాబితాను సెప్టెంబరు 10 నాటికి ప్రకటించాలని ఎన్నికల సంఘం శనివారం నోటిఫికేషన్ ఇచ్చింది. ఇవన్నీ చూస్తే సెప్టెంబరు రెండో వారంలో స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉంది. జూలై 25 వరకు రాష్ట్రంలో రిజర్వేషన్లను ఖరారు చేసి, సెప్టెంబరు 30 లోపు స్థానిక

మిగతా 13వ పేజీలో...



చైనాలోని తియాన్‌జిన్ విమానాశ్రయంలో ప్రధాని మోదీకి స్వాగతం పలుకుతున్న కళాకారులు

ట్రంప్ సుంకాలు చట్టవిరుద్ధం

'ఐఈఈపీఏ' చట్టం అడ్డగోలు టారిఫ్‌లు విధించేలా అధ్యక్షుడికి అధికారాలు ఇవ్వలేదు

అమెరికా ఫెడరల్ అప్పీల్స్ కోర్టు తీర్పు

సుప్రీంకోర్టులో అప్పీలుకు వీలుగా

అక్టోబరు 14 వరకు తీర్పు అమలు నిలిపివేత

తీర్పు ఏకపక్షం.. టారిఫ్‌లు కొనసాగుతాయి

సుంకాలు తొలగిస్తే అమెరికా సర్వనాశనం

ఉత్పత్తిదారులు, రైతులకు తీవ్ర నష్టం: ట్రంప్

న్యూయార్క్, ఆగస్టు 30: ప్రపంచ దేశాలపై, ముఖ్యంగా భారత్‌పై అడ్డగోలు సుంకాలతో విరుచుకుపడుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు అక్కడి ఫెడరల్ అప్పీల్స్ కోర్టు షాకిచ్చింది. వివిధ దేశాలపై ట్రంప్ వేసిన భారీ సుంకాలు చట్టవిరుద్ధమని స్పష్టం చేసింది. ఈ సుంకాల విధింపు కోసం ట్రంప్ 'అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం (ఐఈఈపీఏ)'ను అడ్డుపెట్టుకున్నారని.. నిజానికి ఆ చట్టం అధ్యక్షుడికి

మిగతా 12వ పేజీలో...

ప్రపంచం దృష్టంతా ఆ ముగ్గురిపైనే!

ఎస్‌సీవో కోసం చైనాకు చేరిన మోదీ.. నేడు జిన్‌పింగ్‌తో భేటీ

రేపు పుతిన్‌తో సమావేశం 12

జపాన్ బుల్లెట్ రైలులో మోదీ

ప్రధాని షిగేరుతో కలిసి ప్రయాణం

నోబెల్‌కు మోదీ సిఫార్సు చేయలేదనే భారత్‌పై ట్రంప్ అక్కసు!: ఎన్‌వై టైమ్స్

ఉద్యోగుల పెండింగ్ బిల్లులకు 700 కోట్లు విడుదల

ఆగస్టు నెలకు సంబంధించిన నిధులిచ్చిన ప్రభుత్వం

ఉద్యోగుల జేఏసీ హర్షం

మిగిలిన డిమాండ్లను ఇలానే పరిష్కరించాలని వినతి

హైదరాబాద్, ఆగస్టు30(ఆంధ్రజ్యోతి): పెండింగ్ బిల్లుల అంశంలో ఉద్యోగులకు ఇచ్చిన హామీ ప్రకారం ఆగస్టు నెలకు సంబంధించిన రూ.700 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. జీతాల సప్లమెంటరీ బిల్లులకు సంబంధించిన బకాయిలు రూ.392 కోట్లు, 2024 సెప్టెంబరు వరకు ఉన్న జీపీఎఫ్ బకాయిలు రూ.308కోట్లు కలిపి రూ.700 కోట్లు చెల్లించింది. ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం నిధులు విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్,

మిగతా 3వ పేజీలో...

ఆరోగ్యశ్రీ బంద్?

నేటి అర్ధరాత్రి నుంచి నిలిపివేతకు ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులు సిద్ధం

బకాయిలపై సర్కారు నుంచి స్పందన లేనందునే.. 14



సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభలో ఆయన చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో డి.రాజా, నారాయణ

ఈసీతో బీజేపీ పొత్తు!

అనుబంధ విభాగాలుగా ఈడీ, సీబీఐ, ఐటీ

'వన్ పర్సన్.. వన్ పార్టీ' కోసమే 'వన్ నేషన్ వన్ ఎలక్షన్'.. శాశ్వతంగా అధికారం కోసమే..

ప్రజాస్వామ్యాన్ని ఐక్యంగా పరిరక్షించుకోవాలి

రాహుల్‌గాంధీ పోరాటానికి మద్దతుగా నిలవాలి

సురవరం సంస్మరణ సభలో సీఎం రేవంత్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ.. తమ రాజకీయ పొత్తులో ఎన్నికల కమిషన్‌ను సైతం భాగం చేసుకుంటోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. 75 ఏళ్లు నిండిన ప్రజాస్వామ్య దేశంలో ప్రజల ప్రాథమిక హక్కు అయిన ఓటును తొలగిస్తున్న

మిగతా 14వ పేజీలో...

అసెంబ్లీలో చర్చించినా మాపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దు

కాళేశ్వరం పేరుతో రాజకీయ కక్ష తీర్చుకొనే కుట్ర

ఈ అంశంపై న్యాయస్థానం తేల్చే వరకు కాళేశ్వరం నివేదికను సస్పెండ్ చేయండి

హైకోర్టులో కేసీఆర్, హరీశ్ మధ్యంతర దరఖాస్తులు



హైదరాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం కమిషన్ నివేదికపై అసెంబ్లీలో చర్చించినా తక్షణం ఎలాంటి చర్యలు తీసుకోకుండా రాష్ట్ర ప్రభుత్వాన్ని అడ్డుకోవాలని విజ్ఞప్తి చేస్తూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన హయాంలో నీటి పారుదల శాఖ మంత్రిగా పనిచేసిన హరీశ్‌రావు శనివారం మరోసారి హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టులో ఇప్పటికే రిట్ పిటిషన్లు పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో వాటిపై తుది తీర్పు

మిగతా 13వ పేజీలో...

డ్రగ్స్ కట్టడికి ప్రజా ఉద్యమం రావాలి: కిషన్‌రెడ్డి

2 డ్రగ్స్ నియంత్రణపై ఓయూలో అవగాహన సదస్సు

డ్రగ్స్ కట్టడికి ప్రజా ఉద్యమం రావాలి

» ప్రతి ఇంటి నుంచి ఒకరు కదలాలి: కిషన్‌రెడ్డి

» ఓయూలో డ్రగ్స్ నియంత్రణపై అవగాహన సదస్సు



ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల కట్టడికి ప్రజా ఉద్యమం అవసరమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ప్రతి ఇంటి నుంచి ఒకరు స్వచ్ఛందంగా ముందుకొచ్చి మత్తు పదార్థాల వ్యతిరేక ఉద్యమంలో పాల్గొనకపోతే ఈ సమస్య నుంచి బయటపడలేమని చెప్పారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ లా విభాగం, విజన్-2047 ప్రొఫెషనల్ ఫౌండేషన్ సంయుక్తంగా ఓయూ దూర విద్య కేంద్రం ఆడిటోరియంలో "భారత్‌లో డ్రగ్స్‌పై పోరాటం-న్యాయ, విధాన దృక్పథం" అనే అంశంపై శనివారం నిర్వహించిన సెమినార్‌లో కిషన్‌రెడ్డి మాట్లాడారు. ప్రపంచంలోనే అత్యధిక యువత కలిగిన దేశంగా ఉన్న మనం మాదక ద్రవ్యాల వినియోగం పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. యువతకు చట్టాలపై అవగాహన ఉన్నా మత్తు పదార్థాలకు బానిసలై నేరాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ప్రస్తుతం ఆధునిక సాంకేతికతతో ఏదైనా సాధించే దశకు చేరుకున్నామని, అయితే మాదక ద్రవ్యాలకు బానిసలైతే, ఏ సాంకేతికత, అభివృద్ధి మనల్ని కాపాడలేవని కిషన్‌రెడ్డి హెచ్చరించారు. మాదక ద్రవ్యాల కట్టడికి.. పౌర సమాజాన్ని భాగస్వామ్యం చేస్తూ ప్రభుత్వాలు సమగ్ర ప్రణాళికతో పని చేయాలని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ సూచించారు. మాదకద్రవ్యాలు, మద్యపానం, అవినీతి ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉంటాయని.. వీటన్నింటి కట్టడిపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. మత్తు పదార్థాలకు బానిసలైన యువత వల్ల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని విజన్ 2047 ప్రొఫెషనల్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ హరిచరణ్ అన్నారు. యువత మాదక ద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉంటామని శపథం చేయాలని కోరారు. డ్రగ్స్ వినియోగం, పర్యవసానాలపై ఓయూ అనేక కార్యక్రమాలు చేపడుతోందని ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేష్‌రెడ్డి అన్నారు. మన దేశం ఎదుర్కొంటున్న సమస్యల్లో మత్తు పదార్థాల వినియోగం అత్యంత ప్రమాదకరమైనదని తెలిపారు.

5 తులాల బంగారు గొలుసుతో

విగ్రహ నిమజ్జనం!

» తర్వాత విషయం తెలిసి కంగారుపడ్డ కుటుంబసభ్యులు

» తుర్కయాంజాల్‌లో ఘటన.. రంగంలోకి మునిసిపల్ సిబ్బంది

» గణేశ్ విగ్రహాన్ని వెలికి తీసి మెడలోని గొలుసు అందజేత

హయత్‌నగర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించుకొని, మెడలో 5 తులాల బంగారు గొలుసు వేసి పూజలు చేసిన ఆ కుటుంబసభ్యులు.. ఆ గొలుసు సహా విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. తర్వాత విషయం తెలిసి గగ్గోలు పెట్టారు. తుర్కయంజాల్‌లోని మాసబ్ చెరువు వద్ద శనివారం ఈ ఘటన జరిగింది. వనస్థలిపురం హస్తినాపురం హెచ్‌పీ పెట్రోల్ బంకు వెనుక ఉన్న హోం ప్రసాద్ అపార్టుమెంటు ప్లాటు నంబర్ 302లో ఉంటున్న గిరిజ, ఆమె కుటుంబసభ్యులు పండుగ రోజు ఇంట్లో వినాయకుడిని ప్రతిష్ఠించుకున్నారు. ఆ సమయంలో ఇంట్లోని 5 తులాల బంగారు గొలుసును వినాయకుడి మెడలో వేశారు. మూడు రోజుల పాటు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శనివారం విగ్రహాన్ని తుర్కయాంజాల్ మాసబ్ చెరువులో నిమజ్జనం చేశారు. తర్వాత చేతులు కడుక్కొని చెరువు కట్టపైకొచ్చారు. అంతలో కుటుంబంలో ఒకరు బంగారు గొలుసు సంగతి గుర్తుచేయడంతో ఆందోళన చెందిన బాధితులు తుర్కయంజాల్ మునిసిపాలిటీ సిబ్బందికి విషయం చెప్పారు. వెంటనే సిబ్బంది ఎక్స్‌కవేటర్ తీసుకొచ్చి విగ్రహాన్ని బయటకు తీసి.. మెడలో ఉన్న గొలుసును బాధిత కుటుంబానికి అందజేశారు. తమ సొత్తును మళ్లీ తమకు వినాయకుడే ఇప్పించాడని ఆ కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.



బాధిత కుటుంబసభ్యులకు బంగారు గొలుసును అప్పగిస్తున్న మునిసిపల్ సిబ్బంది

లోపాలపుట్టలుగా ఫర్టిలిటీ కేంద్రాలు

» నిబంధనలకు విరుద్ధంగా 55 సెంటర్లు

» ఆ కేంద్రాలకు రేపు నోటీసులు



హైదరాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సంతాన సాఫల్య కేంద్రాల్లో 55 సెంటర్లు నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నట్లు సర్కారు గుర్తించింది. ఈ కేంద్రాలకు సోమవారం షోకాజ్ నోటీసులు ఇవ్వనున్నారు. ఈ మేరకు వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ ఉన్నతాధికారులు వెల్లడించారు. ఇటీవల సృష్టి ఫర్టిలిటీ కేంద్రం సరోగసి పేరుతో చేసిన మోసం, శిశు అక్రమ రవాణా వెలుగులోకి రావడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఫర్టిలిటీ కేంద్రాల్లో తనిఖీలు చేసి, నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించిన సంగతి తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా 381 సంతాన సాఫల్య కేంద్రాలున్నాయి. తొలుత గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో ఉన్న 271 కేంద్రాలను 35 బృందాలు తనిఖీలు చేశాయి. ఆ తర్వాత జిల్లాల్లోని 110 కేంద్రాల్లో జాయింట్ డైరెక్టర్ స్థాయి హోదా ఉన్న అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలకు సంబంధించిన నివేదికలను అధికారులు వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ డాక్టర్ సంగీతా సత్యనారాయణకు అందజేశారు. నివేదికలను పరిశీలించి, మొత్తం 55 కేంద్రాల్లో లోపాలున్నట్లు గుర్తించారు. వాటికి షోకాజ్ నోటీసులు ఇచ్చి, అనంతరం వాటిపై చర్యలు తీసుకునే అవకాశం ఉందని వైద్య వర్గాలు పేర్కొన్నాయి.

ఏమేం లోపాలు గుర్తించారు?

రాష్ట్రంలో కొన్ని ఫర్టిలిటీ కేంద్రాలు నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నట్లు తనిఖీల ద్వారా సర్కారు గుర్తించింది. ఫర్టిలిటీ కేంద్రం రిజిస్ట్రేషన్‌లో పేర్కొన్న సిబ్బంది సంఖ్యకు, అక్కడ పనిచేస్తున్న వారి సంఖ్యకు పొంతన లేదని తేల్చారు. అక్కడ పనిజేసే డాక్టర్ల పేర్లకు, రికార్డుల్లో ఉన్న వైద్యుల పేర్లకు సంబంధం లేదని తనిఖీ బృందాలు తేల్చాయి. రేడియాలజిస్టులు, ఎంబ్రియాలజిస్టులు లేకుండానే కొన్ని కేంద్రాలు నడుస్తున్నాయని బృందాలు గుర్తించాయి. రికార్డుల్లో చూపిన అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రాలకు, అక్కడున్న సంఖ్యకు సరిపోలడం లేదు. కాగా ప్రీ-కాన్సెప్షన్, ప్రీ-నేటల్ డయాగ్నస్టిక్ టెక్నిక్స్ (పీసీపీఎన్‌డీటీ) యాక్ట్ ప్రకారం ఫర్టిలిటీ కేంద్రాల్లో నిర్వహించే ప్రతి అల్ట్రాసౌండ్ స్కానింగ్‌ను ఆన్‌లైన్ చేయాలి. అయితే మెజారిటీ కేంద్రాలు.. తాము జరిపే అల్ట్రాసౌండ్ స్కానింగ్స్‌కు, ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న స్కానింగ్స్ సంఖ్యకు సగానికి సగం తేడా ఉన్నట్లు తనిఖీల్లో గుర్తించారు. గర్భిణులకు నిర్వహించే స్కానింగ్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం లేదంటే అనుమానించాల్సి ఉంటుందని అధికార వర్గాలు అంటున్నాయి. గర్భవిచ్ఛిత్తి కేసుల విషయం బయట పడుతుందనే స్కానింగ్‌ల వివరాలను పూర్తిగా ఆన్‌లైన్ చేయడం లేదని తనిఖీ బృందాలు సందేహం వ్యక్తం చేస్తున్నాయి. ఇదే విషయాన్ని సర్కారుకిచ్చిన నివేదికల్లో పేర్కొన్నాయి. ఇక 80 శాతం కేంద్రాల్లో ధరల పట్టిక ప్రదర్శించడం లేదని గుర్తించారు. అక్కడ పనిజేసే వైద్యుల వివరాలను కూడా ప్రదర్శించాల్సివుండగా ఆ పట్టికా లేదని తేల్చారు.

100 మీటర్ల వెడల్పుతో ఆర్‌ఆర్‌ఆర్

8 జిల్లాలు.. 33 మండలాలు.. 163 గ్రామ పంచాయతీల పరిధిలో ఖరారు

» పలు సర్వే నంబర్లతో.. అలైన్‌మెంట్‌కు హెచ్‌ఎండీఏ నోటిఫికేషన్

» వచ్చే నెల 15 వరకు అభ్యంతరాల స్వీకరణ

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మెట్రోపాలిటన్ రీజియన్ (హెచ్‌ఎంఆర్) పరిధిలో.. వంద మీటర్ల వెడల్పుతో రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్‌ఆర్‌ఆర్) అలైన్‌మెంట్‌ను ఖరారు చేస్తూ హెచ్‌ఎండీఏ ప్రాథమిక నోటిఫికేషన్ ఇచ్చింది. ఇందులో డిజిటల్ మ్యాప్‌తోసహా.. ఔటర్ రింగ్ రోడ్డు అవల.. ఎనిమిది జిల్లాలు, 33 మండలాలు, 163 రెవెన్యూ గ్రామ పంచాయతీలలోని ఏయే సర్వే నంబర్ల వెంట ఆర్‌ఆర్‌ఆర్ వెళ్తుందనే వివరాలను ప్రకటించింది. దీనిపై ప్రజల నుంచి అభ్యంతరాలు, సూచనలను స్వీకరిస్తామని తెలిపింది. వ్యక్తులు కానీ, సంస్థలు తమ అభ్యంతరాలను వచ్చే నెల 15లోగా రాతపూర్వకంగా హెచ్‌ఎండీఏ కమిషనర్ పేరుతో అందజేయాలని సూచించింది. ఆ తర్వాత తుది నోటిఫికేషన్‌ను విడుదల చేయనుంది. ప్రాథమిక నోటిఫికేషన్, డిజిటల్ మ్యాప్, ఇతర వివరాలను శనివారం హెచ్‌ఎండీఏ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసింది. దీని ప్రకారం.. రంగారెడ్డి, మహబూబ్‌నగర్, వికారాబాద్, నల్లగొండ, సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్, యాదాద్రి-భువనగిరి జిల్లాల మీదుగా ఆర్‌ఆర్‌ఆర్ వెళ్తుంది.

ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంట్ ఖరారైన గ్రామాలివే..

1. రంగారెడ్డి జిల్లా

- అమన్‌గల్ మండలంలోని అమన్‌గల్, చెన్నంపల్లె, పోలేంపల్లె, సింగంపల్లె
- ఫరూఖ్‌నగర్ మండలంలోని బీమారం, చించోడు
- కేశంపేట మండలంలోని నిర్దవల్లీ, తొమ్మిడికుల
- కొందుర్గు మండలంలోని అగిర్యాల, చెరుకుపల్లె, కొందుర్గు(ఈస్ట్), కొందుర్గు(వెస్ట్), తంగెళ్లపల్లె, వనంపల్లె
- మాడ్గుల్ మండలంలోని అన్నబోయినిపల్లి, బ్రహ్మణపల్లె, ఇర్విన్, కలకొండ, మాడ్గుల్
- తలకొండపల్లె మండలంలోని చంద్రదన, గర్విపల్లె, జులపల్లె, ఖానాపూర్, మెదకపల్లె, రాంపూర్, వెంకట్రావుపేట్

2. వికారాబాద్ జిల్లా

- మోమిన్‌పేట మండలంలో దేవరంపల్లి, టేకులపల్లి
- నవాబ్‌పేట మండలంలో చించల్‌పేట, చిట్టిగిద్ద, దాతాపూర్, వట్టిమీనపల్లి, యావాపూర్
- పూడూరు మండలంలో గొంగుపల్లి, గట్‌పల్లి, కెరవెల్లి, మంచన్‌పల్లి, మన్నెగూడ, పెద్ద ఉమ్మెంతాల్, పూడూరు, రాకంచర్ల, సిరిగాయపల్లి, తుర్క ఎన్కేపల్లి, ఎన్కేపల్లి
- వికారాబాద్ మండలంలో బురాన్‌పల్లి, పాతూరు, పీరంపల్లి, పులుసుమామిడి

3. నల్లగొండ జిల్లా

- చండూర్ మండలంలోని గట్టుప్పల్, తేరట్‌పల్లి
- చింతపల్లి మండలంలోని కుర్మేదు, కురంపల్లి, మల్లెపల్లె, వింజమూర్
- మర్రిగూడ మండలంలోని భట్లపల్లె, దమెరభీమనపల్లె, మర్రిగూడ, మెటిచందాపూర్, నమ్మపూర్, సారంపేట్, వట్టిపల్లె
- మునుగోడు మండలంలోని వెల్మకన్నె

4. సంగారెడ్డి జిల్లా

- హత్నూర మండలంలోని దౌల్తాబాద్, దేవులపల్లి, కాసాల , సికంద్లాపూర్
- కొండాపూర్ మండలంలోని అలియాబాద్, గంగారం, గిర్మాపూర్, మారేపల్లి, తొగర్‌పల్లి
- సదాశివపేట మండలంలోని పెద్దపూర్
- సంగారెడ్డి మండలంలోని చింతల్‌పల్లి, ఇరిగిపల్లె, కలబ్గుర్, నాగపూర్, సంగారెడ్డి, తాళ్లపల్లి

5. సిద్దిపేట జిల్లా

- గజ్వేల్ మండలంలోని బంగ్లా వెంకటాపూర్, ముక్తామాసాన్‌పల్లి, ముట్రాజ్‌పల్లి, ప్రజ్ఞాపూర్, సంగాపూర్
- జగదేవ్‌పూర్ మండలంలోని అలిరాజ్‌పేట్, ఇటిక్యాల్, పీర్లపల్లి
- మార్కుక్ మండలంలోని అంగడి కిష్టాపూర్, చేబర్తి, ఎర్రవల్లి, పాములపర్తి
- రాయిపోల్ మండలంలోని బేగంపేట్, ఎల్కల్
- వర్గల్ మండలంలోని జబ్బాపూర్, నెంటూర్, మక్తా మైలారం

6. మెదక్ జిల్లా

- నర్సాపూర్ మండలంలోని చిన్నచింతకుంట, ఖాజీపేట్, మూసాపేట్, జానకంపేట్, నాగుల్‌పల్లి, పెద్దచింతకుంట, రెడ్డిపల్లి, తిర్మలాపూర్, తుల్జాపూర్
- శివంపేట్ మండలంలోని గుండ్లపల్లె, కొంతాన్‌పల్లె, కొత్తపేట్, లింగోజిగూడ, పాంబండ, పోతులబొగూడ, రత్నాపూర్, ఉసిరికపల్లె
- తూప్రాన్ మండలంలోని దటర్‌పల్లె, గుండరెడ్డిపల్లె, ఇస్లాపూర్, కిష్టాపూర్, నాగులపల్లె, నర్సంపల్లె, వట్టూర్, వెంకటాయిపల్లె

7. యాదాద్రి-భువనగిరి జిల్లా

- చౌటుప్పల్ మండలంలోని తంగడ్‌పల్లి, చిన్నకొండూర్, నేలపట్ల, తాళ్లసింగారం
- నారాయణపూర్ మండలంలోని చీమిర్యాల, గుడ్డిమల్కాపూర్, కంకణగూడెం, కోతులాపురం, పుట్టపాక, సర్వేల్
- భువనగిరి మండలంలోని గౌస్‌నగర్, కేసారం, పెంచికల్‌పహడ్, రాయిగిరి, తుక్కాపురం, యెర్రంబల్లె
- తుర్కపల్లి మండలంలోని వెల్పుపల్లె, దత్తయిపల్లి, ఇబ్రహీంపురం, కొనపురం, వీరరెడ్డిపల్లి
- వలిగొండ మండలంలోని పహిల్వాన్‌పూర్, పొద్దుటూర్, రెడ్లరేపాక, వర్కట్‌పల్లి
- యాదగిరిగుట్ట మండలంలోని మల్లాపూర్, దత్తార్‌పల్లి

8. మహబూబ్‌నగర్ జిల్లా

- బాలానగర్ మండలంలోని అప్పాజిపల్లె, బోడజానంపేట, చిన్నరెవల్లి, గౌతపూర్, గుండెడ్, మాచారం, పెద్దరివల్లె, పెద్దయపల్లె, సూరారం, ఉడిత్యాల్, వనమవాణిగూడ

లోకం తీరు



రేబిస్‌తో బాలుడి మృతి

కుక్కకాటును నిర్లక్ష్యం చేసిన తల్లిదండ్రులు



రక్షిత్(ఫైల్)

బీర్‌పూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వీధి కుక్క కరవడంతో రేబిస్ వ్యాధి సోకి ఓ బాలుడు మృతిచెందాడు. ఈ ఘటన జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలం తుంగూర్ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రక్షిత్ (4) రెండు నెలల క్రితం ఇంటి బయట ఆడుకుంటుండగా వీధి కుక్క అతడిపై దాడి చేసింది. ఆ దాడిలో బాలుడు డ్రైనేజీలో పడిపోయాడు. డ్రైనేజీలో పడడం వల్లనే గాయాలయ్యాయి అని భావించిన తల్లిదండ్రులు కుక్క కాటును నిర్లక్ష్యం చేసి, స్థానికంగా చికిత్స చేయించారు. రేబిస్ నివారణ కోసం టీకాలు వేయించలేదు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం రక్షిత్‌లో రేబిస్ వ్యాధి లక్షణాలు కనిపించడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు అతడిని జగిత్యాల ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స చేసినా మెరుగుపడకపోవడంతో, వైద్యుల సూచన మేరకు హైదరాబాద్ తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే రక్షిత్ మరణించాడు.

ఓటరు తుది జాబితా కోసం కసరత్తు

» ముగిసిన అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియ

» రంగారెడ్డి 'గ్రామీణం'లో 3,624 అభ్యంతరాలు

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లాలోని 21 గ్రామీణ మండలాల్లో అభ్యంతరాల స్వీకరణకు గడువు ముగియడంతో పంచాయతీ ఓటర్ల తుది జాబితాను రూపొందించేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఓటరు ముసాయిదా జాబితాలను ఈనెల 28న గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో నోటీసు బోర్డులో ప్రదర్శించగా, మూడు రోజుల పాటు వాటిపై అభ్యంతరాలను స్వీకరించారు. ఈ నెల 30 వరకు పంచాయతీల వారీగా స్వీకరించిన అభ్యంతరాలను ఎంపీడీవోలకు అందించారు. దీంతో అధికారులు తుది జాబితాలను రూపొందించే ప్రక్రియలో నిమగ్నమయ్యారు. రంగారెడ్డి జిల్లాలోని 21 గ్రామీణ మండలాల్లో మొత్తం 3,624 అభ్యంతరాలు స్వీకరించారు.

వంతెనకు మరమ్మతులు చేయించాలి

» మంత్రికి సినీ రచయిత విజయేంద్రప్రసాద్ లేఖ

హైదరాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మక్తల్ మండలం కర్ని గ్రామంలోని చెరువుకట్ట వద్ద ఉన్న వంతెనకు, దాని అప్రోచ్ రోడ్లకు తక్షణమే మరమ్మతులు చేయించాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డికి రాజ్యసభ సభ్యుడు, సినీ రచయిత విజయేంద్రప్రసాద్ ఓ లేఖ రాశారు. ఆ చెరువు అలుగు పారుతుండడంతో చుట్టుపక్కల ఉన్న 20 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా విద్యార్థులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని లేఖలో పేర్కొన్నారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా వంతెనకు వెంటనే మరమ్మతులు చేయించాలని విజయేంద్రప్రసాద్ కోరారు.

ఆంధ్రజ్యోతి తలంబ్రాలు

వరుడు కావలెను



వధువు కావలెను



కళ్యాణ వేదిక

★ లక్ష్మీ మ్యారేజ్ బ్యూరో / కేవలం చౌదరి కులస్తులకు మాత్రమే. పెళ్ళి సంబంధాలు చూడబడును. ప్రొ. జ్యోతి సైదాబాద్. ఫోన్ : 9182731506 / 9705588313 AJH-003240

గమనిక
ఆంధ్రజ్యోతి తలంబ్రాలు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయంగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. మీరు జరిపే లావాదేవీలకు ఆంధ్రజ్యోతి పత్రిక బాధ్యత వహించదు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

తలంబ్రాలు ప్రకటనల కొరకు ఈ క్రింది నంబర్లను సంప్రదించగలరు.
9703618806,
9985921380,
9985921386.

V.I.P MATRIMONY
ONLY FOR KAMMA'S
కమ్మ వారి వివాహ సంబంధాలకై ప్రత్యేకముగా నడుపబడుచున్న సంస్థ
8143538383

వధువు కావలెను


★ కమ్మ (US): 26 / 5'10"/ BS / MBA(Wharton) $ 400K / 35 Cr / Seeks USA Bride From Good Family. Ph: 8143538383
★ కమ్మ (US): 28 / 5'8"/ MS TESLA / $ 250K / 100 Cr. / Seeks INDIA / USA / Very Fair Girl. Ph: 8143538383
★ కమ్మ (Doctor): 26 / 6'/ MS (GS) / 300 CR / HYD / Seeks Only Doctor Brides. Ph: 8143538383
★ కమ్మ (Doctor): 27 / 5'11"/ MD (Radiology) / 150 Cr / Seeks Doctor / Engineer Brides. Ph: 8143538383
★ కమ్మ (INDIA): 26 / 5'9"/ BE(IIT) / 80L PA / 25 Cr Seeks IIT, NIT, BITS, Bride only. Ph: 8143538383
★ కమ్మ (INDIA): 26 / 5'8"/ B.Tech (IIT), 62L PA / Hyd / 40 Cr. Seeks Educated Girl with Good Looking Ph: 8143538383
★ కమ్మ (INDIA): 26 / 6'1"/ MBA (IIM), 45L PA / B'lore / 75 Cr / Seeks V. Fair Girl From Good Family Ph: 8143538383
★ కమ్మ (Divorce): 30 / 5'10"/ BE (BITS) / MS / 40L PA / 25 Cr / Seeks Good Looking Bride. Ph: 8143538383
★ కమ్మ (Divorce): 31 / 6'1"/ MBA (IIM) / 35L PA / 40 Cr / Seeks V.Fair Bride. Ph: 8143538383
★ కమ్మ (Divorce): 38 / 5'10"/ BE / 60L PA / HYD / 15 Cr / పిల్లలు లేని వధువు కావలెను. ★ Ph: 8143538383

వరుడు కావలెను

★ కమ్మ (US): 22 / 5'6" / Beautiful US / Citizen / BS. MBA $ 190k / Seeks Doctor / Engineer. Ph: 8143538383
★ కమ్మ (US): 25 / 5'6" / V.FAIR / BE (NIT) / MS / #200K / 20 Cr /Seeks Well Settled Boy in USA Ph: 8143538383
★ కమ్మ (Doctor-US): 25 / 5'7" /Beautiful / Residency (IM) / Well to do Seeks Settled Doctor / Engineer in US Ph: 8143538383
★ కమ్మ (Doctor): 25 / 5'5" / V.FAIR / M.D.(Radiology) 100 Cr / Seeks Merit Doctor / Business Groom Ph: 8143538383
★ కమ్మ (Doctor): 25 / 5'6" / V.FAIR / MS(Gynic) / 50 Cr / Hyd. / 26 / 5'5" / V.FAIR / MD (GM) 60 Cr / Hyd. Ph: 8143538383
★ కమ్మ (INDIA): 23 / 5'3" / V.FAIR / MBA / BUSINESS / 300 Cr. / Seeks well settled CIVILS / BUSINESS GROOM Ph: 8143538383
★ కమ్మ (INDIA): 22 / V.FAIR / BE / 40L PA / 50 Cr / Hyd / Seeks Job / Business Boy From Hyd Based Ph: 8143538383
★ కమ్మ (INDIA): 23 / 5'8" / Beautiful / IIT / 30L PA / 100 Cr. / Seeks well settled job / Business Groom Ph: 8143538383
★ కమ్మ (INDIA): 24 / 5'7" / V.FAIR / MBA(IIM) / 50L PA / HYD 50 Cr. వధువుకు IIT, IIM, Bits (or) BUSINESS Boy కావలెను. Ph: 8143538383
★ కమ్మ (Divorce): 25 / 5'6" / V.FAIR / BE(IIT) / MS / $150k, H1B, 25 Cr. / Seeks 1st / 2nd Groom in USA Boy. Ph: 8143538383

ప్రాణాలు పోస్తూనే.. ఆగుతున్న ఊపిరి!

విధుల్లో తీవ్ర ఒత్తిడితో కుప్పకూలిపోతున్న వైద్యులు



- రాత్రీ, పగలూ తీరికలేని పనివేళలు
- పూర్తిస్థాయిలో నిద్ర కూడా కరువే!
- యువ వైద్యులకూ గుండెపోటు
- కొన్నిరోజుల క్రితం భోజనం చేస్తూనే కన్నుమూసిన హైదరాబాద్ వైద్యుడు
- తాజాగా చెన్నైలో రోగులను చూస్తూనే గుండెపోటుతో కార్డియాక్ సర్జన్ మృతి
- వైద్యుల సగటు జీవితకాలం 59 ఏళ్లే
- ప్రజల సగటు ఆయుర్దాయం 69 నుంచి 72 ఏళ్లు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రాణాలు పోసే వైద్యులు వారు.. రాత్రిపగలు తేడా లేకుండా.. నిద్రాహారాలనూ సరిగా పట్టించుకోకుండా.. రోగుల బాగోగులు చూసే ప్రాణదాతలు వారు.. కానీ అలా ప్రాణం పోస్తూనే ఊపిరి వదులుతున్నారు. తీవ్ర ఒత్తిళ్ల మధ్య అకస్మాత్తుగా కుప్పకూలిపోతున్నారు. గుండెపోటు వంటివాటితో ప్రాణాలు వదులుతున్నారు. ఇటీవల హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి చెందిన సీనియర్ వైద్యుడు.. డ్యూటీ చేసి వెళ్లాక ఇంట్లో భోజనం చేస్తూనే కుప్పకూలిపోయారు. అంతకు రెండుమూడు రోజుల ముందే ఆయన ఆరోగ్య పరీక్షలు చేయించుకోగా అంతా సాధారణంగానే ఉన్నట్టు తేలింది. కానీ తీవ్ర ఒత్తిడితో గుండెపోటుతో కన్నుమూశారు. తాజాగా తమిళనాడులోని చెన్నైలో కార్డియాక్ సర్జన్‌గా పనిచేస్తున్న డాక్టర్ గ్రాడ్లిన్ రాయ్.. ఆస్పత్రి వార్డులో రోగులను పరిశీలిస్తూనే గుండె పోటుతో ప్రాణాలు వదిలారు. మన దేశంలో ప్రజల సగటు ఆయుర్దాయం 69 ఏళ్ల నుంచి 72 ఏళ్లుకాగా.. వైద్యుల సగటు జీవితకాలం 59 ఏళ్లలోపేనని భారత వైద్య అసోసియేషన్ (ఐఎంఏ) అధ్యయనంలో వెల్లడికావడం ఆందోళనకరం.

తీవ్రమైన ఒత్తిడితో కూడిన జీవితం

వైద్యులు తీవ్ర ఒత్తిడితో నలిగిపోతున్నారు. ఉదయం 8 గంటలకు ఆస్పత్రికి వస్తే రాత్రి 10 గంటల వరకు సేవల్లోనే ఉంటున్నారు. ఉదయం, సాయంత్రం ఔట్ పేషెంట్లను చూడటం, వార్డుల్లో రోగులతో మాట్లాడటం, వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించడంతోనే గడిచిపోతుంది. ఏవైనా శస్త్రచికిత్సలు చేయాల్సి ఉంటే తెల్లవారుజాము నుంచే ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంటుంది. ఇంటికి వచ్చినా.. రోగుల పరిస్థితిపై నర్సులు, ఆస్పత్రి సిబ్బంది నుంచి వచ్చే ఫోన్లు మాట్లాడటం, తగిన సూచనలు చేయడం తప్పదు. ఇక ఏదైనా ఎమర్జెన్సీ కేసు వచ్చినా, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నవారి పరిస్థితితో తేడా వచ్చినా రాత్రిపగలు తేడా లేకుండా పరుగెత్తుకు రావాల్సిందే. ఈ క్రమంలో తీవ్ర ఒత్తిళ్లకు లోనవుతున్నారు. సరైన సమయంలో నిద్రాహారాలు లేక నీరసించిపోతున్నారు. ఇక కొన్ని ఆస్పత్రుల యాజమాన్యాలు ఓపీ రోగుల సంఖ్య, ఆపరేషన్లు, ల్యాబ్ పరీక్షలపై వైద్యులకు టార్గెట్లు పెడుతుంటాయని.. పైగా ప్రతినెలా దీనిపై రిపోర్టు ఇవ్వాల్సి ఉంటుందని వైద్య వర్గాలు చెబుతున్నాయి. ఇది వైద్యుల్లో ఆందోళనకు దారితీస్తోందని అంటున్నాయి. మరోవైపు సొంతంగా ఆస్పత్రులు ఉన్నవారి పరిస్థితీ ఇంతే. కేవలం రోగుల వ్యవహారాలే కాకుండా ఆస్పత్రుల నిర్వహణ పనులూ చూసుకోవాలి. దానికితోడు మంచి వైద్యులుగా గుర్తింపు పొందాలన్న ఉద్దేశంతోనూ ఒత్తిడికి లోనవుతున్నారు.

ప్రజల కంటే పదేళ్లు తక్కువ బతుకుతున్నాం..



ప్రజల సగటు జీవితకాలం 69-72 ఏళ్లు ఉంటే.. వైద్యులు సగటున 59ఏళ్లకే కన్నుమూస్తున్నారు. సాధారణ ప్రజల జీవితకాలంతో పోలిస్తే పదేళ్లు తక్కువ జీవిస్తున్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యయనం ప్రకారం.. చాలా మంది వైద్యులు 50-55 ఏళ్ల వయసులోనే చనిపోతున్నారు. అమెరికాలో వైద్యులు రోజుకు 8 గంటలే పనిచేస్తారు. యూకేలో వారమంతా కలిపి 36 పని గంటలే ఉంటాయి. కానీ మన వద్ద రాత్రి పగలు పరుగులు పెట్టాల్సిందే. రోగులు మాపై భరోసాతో, నమ్మకంతో వస్తారు. ఎవరినీ కాదనలేం. సాయంత్రం నాలుగు గంటల వరకు కూడా భోజనం చేయలేని పరిస్థితి ఉంటుంది.

- డాక్టర్ రమేష్ గూడపాటి, సీనియర్ కార్డియాలజిస్టు, జాయింట్ ఎండీ, స్టార్ ఆస్పత్రి

ఒత్తిడి మధ్యే జీవితం గడుపుతున్నాం



వైద్య వృత్తి తీవ్ర ఒత్తిడితో కూడికుని ఉంటుంది. ఉదయం నుంచి అర్ధరాత్రి దాకా తీరిక ఉండదు. ఇంటికి వచ్చినా రోగుల ఫాలో అప్ తప్పదు. ఎవరైన రోగి పరిస్థితి సీరియస్‌గా ఉంటే ఆస్పత్రిలోనే ఉండాలి. చాలా మంది యువ వైద్యులు తమ ఆరోగ్యం గురించి పట్టించుకోకుండా వృత్తిపై ఎక్కువ ధ్యాస పెడుతున్నారు. మంచి పేరు తెచ్చుకోవాలనే తపనతో తెలియకుండానే ఒత్తిళ్లకు లోనవుతున్నారు. వారిలో కొందరు జన్యుపరమైన కారణాలతో ఒత్తిడి తట్టుకోలేక చిన్న వయసులోనే గుండెపోటుకు గురవుతున్నారు. ఆస్పత్రుల్లో కూడా ఒకరోజు వైద్యుల కోసమే కేటాయించి ఆరోగ్య పరీక్షలు చేయాల్సిన అవసరముంది.

- డాక్టర్ హయగ్రీవరావు, సీనియర్ కార్డియాలజిస్టు, కిమ్స్ ఆస్పత్రి

ఆరోగ్యంపై దృష్టిపెట్టాల్సి ఉంది



విదేశాల్లో అయితే వైద్యులు వారానికి ఐదు రోజులే పనిచేస్తారు. మిగతా రెండు రోజులు విశ్రాంతి, కుటుంబ సభ్యులతో గడపడంతో ఒత్తిడి తగ్గుతుంది. మన దగ్గర ఆరు రోజులు, అదీ ఎక్కువ పనిగంటలు విధులు తప్పవు. కొన్నిసార్లు ఆదివారం కూడా ఆస్పత్రికి రావాల్సి ఉంటుంది. ఈ క్రమంలో చాలా మంది వైద్యులు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేసుకుంటున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వైద్యులు తమ ఆరోగ్యంపై దృష్టి పెట్టాల్సి ఉంది.

- డాక్టర్ సుధీర్ కోగంటి, సీనియర్ కార్డియాలజిస్టు, సిటిజన్ ఆస్పత్రి

వరద ముంపులోనే బాసర

రైళ్ల రాకపోకలపై కొనసాగుతున్న ఆంక్షలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



బాసర ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారి ద్వారం వద్దకు వచ్చిన వరద

నిర్మల్ జిల్లాలోని బాసర పుణ్యక్షేత్రంలో గోదావరి వరద పోటెత్తుతోంది. శుక్రవారం మొదలైన ప్రవాహం శనివారం అదే స్థాయిలో కొనసాగింది. అమ్మవారి ఆలయ ప్రధాన రహదారులు, ప్రైవేటు సత్రాలు, హోటళ్లు, దుకాణాల్లోకి నీరు చేరింది. ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారుల్లో పది అడుగుల వరకు నీరు నిలిచి చెరువులను తలపించాయి. టీటీడీ అతిథి గృహం, వ్యాస మహర్షి ఆలయం వరకు వరద చేరింది. శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టుకు శనివారం 4లక్షల క్యూసెక్కులకు పైగా ఇన్‌ఫ్లో రాగా, 5లక్షల క్యూసెక్కులకు పైగా నీటిని దిగువకు వదిలారు. అయినా బాసర వద్ద వరద తగ్గలేదు. భక్తులను బాసర గ్రామం నుంచి కొండల మధ్య ఉన్న రహదారి వెంబడి అనుమతించారు. బాసరబ్రిడ్జి మీదుగా రైళ్ల రాకపోకలపై ఆంక్షలు కొనసాగుతున్నాయి. పెద్దపల్లి జిల్లాలోని ఎల్లంపల్లి ప్రాజెక్టుకు 7,27,223 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంవద్ద 12.5 మీటర్ల ఎత్తులో గోదావరి ప్రవహిస్తోంది. మేడిగడ్డ బ్యారేజీకి 10,25,600 క్యూసెక్కుల వరద వస్తోంది. భద్రాచలం వద్ద గోదావరి 47.6అడుగుల ఎత్తులో ప్రవహిస్తోంది. నిజామాబాద్ జిల్లాలో 48,200ఎకరాల్లో పంటనష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమిక నివేదిక సిద్ధం చేశారు. 11 మండలాల్లో 3వేల ఎకరాల్లో ఇసుక మేటలు వేసినట్లు నిర్ధారించారు. ఒక్కోబాధిత కుటుంబానికి రూ.11,500 ఆర్థిక సాయం అందిస్తామని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. కాగా, జూరాలకు 2.10లక్షలు, శ్రీశైలానికి 2.52లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది.

నేడు 3 జిల్లాలకు భారీ వర్ష సూచన

రాష్ట్రంలో ఆదివారం కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ జిల్లాలకు ఎల్లోఅలెర్ట్ జారీ చేసింది. అలాగే, సెప్టెంబరు 3 వరకు అన్నిజిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

ఉద్యోగుల పెండింగ్ బిల్లులకు రూ. 700 కోట్లు విడుదల


(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాస్‌రావు కూడా శనివారం ఓ ప్రకటన చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పింఛనుదారులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అన్ని డిమాండ్లను ఇదే తరహాలో పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నిజానికి, ఉద్యోగుల పెండింగ్ బిల్లులకు సంబంధించిన నిధులను ఒకేసారి విడుదల చేయలేమని, నెలకు రూ.700 కోట్ల చొప్పున విడుదల చేసి ఏడాదిలోపు బకాయిలు లేకుండా చేస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రభుత్వం తరఫున గతంలో హామీ ఇచ్చారు. కానీ, గత మూడు నెలల్లో పూర్తిస్థాయిలో నిధులు విడుదల కాకపోవడంతో ఉద్యోగ సంఘాలు గుర్రుగా ఉన్నాయి. ఉద్యోగుల సమస్యలపై స్పందించని ప్రభుత్వంపై ఇక సమరమే అంటూ ఆగస్టు 19న నిర్వహించిన ఐకాస విస్తృత స్థాయి సమావేశంలో ఉద్యమ కార్యాచరణను కూడా ప్రకటించారు. సెప్టెంబరు 8వ తేదీ నుంచి ఉమ్మడి 10 జిల్లాల్లో బస్సు యాత్ర, అక్టోబరు 12న చలో హైదరాబాద్ నిర్వహిస్తామని వెల్లడించారు. దీంతో ఉద్యోగులకు, ప్రభుత్వానికి మధ్య దూరం పెరుగుతుందని గుర్తించిన ప్రభుత్వం అప్రమత్తమైంది. ఐకాస ప్రతినిధులతో గత వారం చర్చలు జరిపింది. అనంతరం ఉద్యోగుల సమస్యల మీద ఏర్పాటు చేసిన మంత్రి వర్గ ఉపసంఘానికి చైర్మన్ అయిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆగస్టు 22న సీఎం రేవంత్ రెడ్డితో సమావేశమయ్యారు. ఉద్యోగులు ఉద్యమానికి సిద్ధమవ్వడానికి దారి తీసిన పరిస్థితులను ముఖ్యమంత్రికి వివరించారు. ఆ మరుసటి రోజే ఐకాస నేతలో మంత్రి భట్టి సమావేశమయ్యారు. అనంతరం సెప్టెంబరు 2న చర్చలకు రావాలని ఉద్యోగ ఐకాసను ప్రభుత్వం ఆహ్వానించింది. అలాగే, ఆగస్టు నెలకు సంబంధించి చెల్లించాల్సిన రూ.700 కోట్లను ఒకేసారి చెల్లిస్తామని ప్రభుత్వం సానుకూల సంకేతాలు పంపింది. అయితే, ప్రభుత్వం ఇచ్చిన ప్రకారం గత మూడు నెలల్లో ఉద్యోగుల బకాయిలకు సంబంధించి రూ.2100 కోట్లు ఇవ్వాల్సి ఉంటే.. కేవలం రూ.1000 కోట్లు చెల్లించారని ఐకాస ఆరోపించింది. ఈ ఆరోపణల నేపథ్యంలో ఆగస్టు నెలకు సంబంధించిన రూ.700కోట్లను ప్రభుత్వం ఒకేసారి విడుదల చేయడంతో ఉద్యోగ సంఘాలు శాంతించాయి.

టైటాన్స్ స్పేస్ మిషన్-2029 వ్యోమగామి అభ్యర్థిగా మోహన్‌సాయి

సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ వాసికి గుర్తింపు

అంతర్జాతీయ శాస్త్రవేత్తలతో కలిసి పనిచేసే చాన్స్



ఆకుల మోహన్‌సాయి

హుజూర్‌నగర్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన ఆకుల మోహన్‌సాయి టైటాన్స్ స్పేస్ మిషన్-2029 వ్యోమగామి అభ్యర్థిగా ఎంపికయ్యారు. టైటాన్స్ స్పేస్ ఇండస్ట్రీస్ (టీఎస్ఐ) రెండు రోజుల క్రితం ప్రకటించిన 2029 వ్యోమగామి అభ్యర్థుల బృందంలో ఆయనకు చోటు దక్కింది. భారత్ నుంచి 'ఆస్ట్రోబయోలజీ అండ్ స్పేస్ సైన్స్'లో పట్టభద్రులైన తొలి తరానికి చెందిన ఆయన ఈ ప్రతిష్ఠాత్మకమైన అంతర్జాతీయ బృందంలో తెలుగు రాష్ట్రాల ప్రతినిధిగా నిలిచారు. ఆయన బెంగుళూరులోని 'ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఏరోస్పేస్ మెడిసిన్'లో శాస్త్రవేత్తగా పనిచేస్తున్నారు. చంద్రుడిపై మట్టిని అనుకరించే 'లునార్ సాయిల్ సిమ్యులెంట్స్'లో మొక్కల పెంపకం (సీడ్-టు-సీడ్ సైకిల్)పై పరిశోధనలు నిర్వహిస్తున్నారు. మోహన్ సాయి పోలండ్ (యూరప్), అరిజోనా (అమెరికా), లద్దాఖ్, రాజస్థాన్‌లో జరిగిన అంతర్జాతీయ, జాతీయ అనలాగ్ వ్యోమగామి మిషన్‌లలో భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించారు. గగన్‌యాన్ అనలాగ్ ప్రయోగాల్లో సేవలందించారు.

'బతుకమ్మ'కు బ్రాండ్ అంబాసిడర్.!

హైదరాబాద్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): బతుకమ్మకు బ్రాండ్ అంబాసిడర్‌ను నియమించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది. ఎవరిని నియమించాలనే అంశంపై సమాలోచనలు జరుగుతున్నాయని, త్వరలో ఒక స్పష్టత రానుందని సమాచారం. సెప్టెంబరు చివరి వారం నుంచి బతుకమ్మ పండుగ ప్రారంభం కానున్న నేపథ్యంలో త్వరలోనే దీనిపై ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

ఏవో, ఏఈవో పదోన్నతులు కల్పించాలి

హైదరాబాద్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ అధికారులు(ఏవో), వ్యవసాయ విస్తరణ అధికారుల(ఏఈవో) పదోన్నతుల్లో ప్రస్తుత నియమ నిబంధనలను మార్చేందుకు అధికారులు యత్నిస్తున్నారని తెలంగాణ వ్యవసాయ విస్తరణ అధికారుల కేంద్ర సంఘం ఆరోపించింది. పదోన్నతులకు సీనియారిటీనే ప్రాతిపదికగా తీసుకోవాలని డిమాండ్ చేసింది. విద్యార్హతల ప్రకారం నిష్పత్తి కేటాయించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపింది.

దక్షిణ మధ్య రైల్వే
మమ్మల్ని @ SCRailwayindia అనుసరించండి. ద.మ.రైల్వేలోని టెండరు ప్రకటన వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై చూడగలరు.

ఆసక్తి వ్యక్తీకరణ (EOI)

రైల్వే లబ్ధిదారుల కొరకు HU/VKB, HU/PARLI, HU/RDM, HU/BPA, PC/KZJ, HU/DKJ మరియు HU/BDCR అధికార పరిధి సికింద్రాబాద్ డివిజన్‌లోని బీదర్, తాండూరు, పర్లి, కరీంనగర్, మంచిర్యాల, కాజీపేట/ హనుమకొండ / వరంగల్, ఖమ్మం, జగ్గయ్యపేట మరియు అన్ని ఇతర నగరాలు/ పట్టణాల వద్ద ఎమర్జెన్సీ కేర్ కోసం రిఫరల్ హాస్పిటల్స్‌గా ప్రైవేట్ హాస్పిటల్స్ ఎంప్యానెల్‌మెంట్ కొరకు చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్, సికింద్రాబాద్ డివిజన్, దక్షిణ మధ్య రైల్వే వారు ఆసక్తి వ్యక్తీకరణ (EOI) కోరుచున్నారు.
ఆసక్తిగల పార్టీలు చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్, సికింద్రాబాద్ డివిజన్, దక్షిణ మధ్య రైల్వే, రైల్వే హెల్త్ యూనిట్ కాంపౌండ్, చిలకలగూడ, సికింద్రాబాద్ - 500025, తెలంగాణ రాష్ట్రం వారికి cmssc1500@gmail.comకు ఇమెయిల్ ద్వారా లేదా సమీపంలోని రైల్వే హెల్త్ యూనిట్ ద్వారా ఈ ప్రకటన తేదీ నుండి 15 పనిరోజులలోగా దరఖాస్తు చేయవలెను. తదుపరి వివరాలను ఏదేని పనిరోజున పనివేళలలో కార్యాలయం నుండి పొందవచ్చు. ఫోన్ నం.040-27786013, ఇమెయిల్: cmssc1500@gmail.com
చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్, సికింద్రాబాద్
A1322 PUB/1059

దక్షిణ మధ్య రైల్వే
మమ్మల్ని @ SCRailwayindia అనుసరించండి. ద.మ.రైల్వేలోని టెండరు ప్రకటన వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై చూడగలరు.

నం.G/C/e-Auction Leasing/2025-26/01, తేది:28.08.2025

భారత రాష్ట్రపతి తరఫున, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, గుంతకల్ డివిజన్, దక్షిణ మధ్య రైల్వే వారు పద్దెనిమిది సంవత్సరాలు వయస్సు పైబడిన భారత జాతీయులు/ భారతదేశంలో నమోదైనట్టి కంపెనీలు/ సంస్థల సంస్థల నుండి https://www.ireps.gov.in ద్వారా క్లోజ్డ్ ఎండ్‌లో ఇ-వేలం నిర్వహిస్తున్నారు.

క్ర. సం	కేటలాగ్ నం.	కేటగిరి	కేటలాగ్‌లో లోకేషన్లు	వేలం తేది	వేలం ప్రారంభ సమయం
1	GTLVPH-2526-B3	Leasing of VPH	01 Train 01VPH	12.09.25	12:15
2	GTLVPH-2526-B4	Leasing of VPH	01 Train 01VPH	15.09.25	10:00

ఆసక్తి కలిగిన పార్టీలు మరియు కాంట్రాక్టర్లు దీనిని గమనించగలరు మరియు ఇ-వేలం విధానాన్ని అర్థం చేసుకొనుటకు మరియు అందులో పాల్గొనుటకు IREPS హోమ్ పేజీలోని లెఫ్ట్ నావిగేషన్ బార్‌లోని లెర్నింగ్ సెంటర్ (యూజర్ మాన్యువల్స్) లింక్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకొనబడినట్టి యూజర్ మాన్యువల్‌ను చూడగలరు. మరియు తదుపరి స్పష్టీకరణల కొరకు బిడ్డర్లు సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, దక్షిణ మధ్య రైల్వే, గుంతకల్ వారిని సంప్రదించగలరు.
సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, గుంతకల్
A1319 PUB/1056

దక్షిణ మధ్య రైల్వే
మమ్మల్ని @ SCRailwayindia అనుసరించండి. ద.మ.రైల్వేలోని టెండరు ప్రకటన వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై చూడగలరు.

నం. Y/C.432/ E-Auction/HYB/2025-26, తేది:28.08.2025

భారత రాష్ట్రపతి తరఫున సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, దక్షిణ మధ్య రైల్వే, హైదరాబాద్ డివిజన్ వారు దిగువ వాణిజ్య ఆర్జన కాంట్రాక్టుల కొరకు https://www.ireps.gov.in ద్వారా ఇ-వేలం నిర్వహించనున్నారు. ఇ-వేలం షెడ్యూల్ దిగువ ఇవ్వబడినది:

క్ర.సం	కేటగిరి	కేటలాగ్ నం	వివరాలు	వేలం తేదీ	వేలం ప్రారంభ సమయం	వేలం ముగింపు సమయం
1	PARKING-HYB-ATC-MX-110-25-1 (Parking - Mixed)	HYB-Prkg-ATC	ఆర్ట్స్ కాలేజ్ వద్ద మినీ బస్సులు మరియు బస్సులతో కలుపుకొని టు వీలర్, త్రీ వీలర్ మరియు ఫోర్ వీలర్ పార్కింగ్ లాట్	05.09.25	10:00	10:30
2	పార్శిల్	HYB-Mixed-045	ట్రైన్ నం. 1) 12794 (FSLR-1) 2) 17023 (FSLR-1)	09.09.25	12:00	12:40

సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, హైదరాబాద్
A1321 PUB/1058

भारतीय कपास निगम लिमिटेड
THE COTTON CORPORATION OF INDIA LTD
(भारत सरकार का उपक्रम/A Government of India Undertaking)
16-10-52, वेल्स हाइट्स, शिवनगर, साई कन्वेंशन के बगल में, वारंगल रेलवे स्टेशन प्लेटफार्म नंबर 3 गेट के पास, वारंगल : 506002 तेल 16-10-52,Yele's Heights, Shivanagar, Beside Sai Convention, Near Warangal Railway Station Gate, Platform No.3,Warangal : 506002 TS
मेल : warangal@cotcorp.com वेबसाइट: www.cotcorp.org.in Ministry Website : www.ministryoftextiles.gov.in
Ref.No.:CCI/WGL/HRD/Temp.Rectt/2025/ Date:30.08.2025

वाकइनइंटरव्यू / WALK - IN – INTERVIEW

पूर्णत:अस्थाईआधारपरअस्थाईफील्ड/कार्यालयकर्मचारीकीआवश्यकता
Requirement of Temporary Field/ Office staff graduates on Purely temporary basis

भारतीय कपास निगम लिमिटेड, (भारत सरकार का उपक्रम), शाखा कार्यालय वारंगलको 85 दिनों के लिए अधिसूचना में दर्शाये गए समेकित वेतन पर अस्थाई आधार पर स्नातक (बी.एससी. कृषि / बी.कॉम / किसी भी स्ट्रीम में कोई अन्य स्नातक) की आवश्यकता है। इच्छुक उम्मीदवार निर्धारित आवेदन प्रारूप और सभी मूल प्रमाण-पत्रों के साथ अधिसूचना में निर्दिष्ट अनुसूची के अनुसार उपरोक्त पते पर सुबह 10.30 बजे उपस्थित हों। विस्तृत जानकारी और आवेदनपत्र के लिए उम्मीदवार निगम की वेबसाइट www.cotcorp.org.in देख सकते हैं।

The Cotton Corporation of India Ltd., (A Government of India Undertaking) Branch Office - Warangal is looking for Graduates (B.Sc. Agriculture / B.Com / any other Graduate in any stream) for 85 days purely on temporary basis on consolidated wages as specified in the Notification. Interested candidates should appear at the above mentioned addressat10.30 am as per schedule specified in the notification along with prescribed application format and all original certificates. For detailed information and Application Form, candidate may check CCI website www.cotcorp.org.in.
Sd/- महाप्रबंधक / General Manager

ఫారం నం.17
(నిబంధన 33(2) చూడుము)
రికవరీ అధికారి-I/II కార్యాలయం
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ హైదరాబాద్ (DRT 2)
1వ అంతస్తు, త్రివేణి కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్ - 500001
రికవరీ ఆఫ్ డెట్స్ & బ్యాంక్‌రప్సీ యాక్ట్, 1993తో చదువబడు ఆదాయ పన్ను చట్టం, 1961కి రెండవ షెడ్యూల్‌లోని రూల్ 53 క్రింద పరిష్కారం కొరకు అమ్మకం ప్రకటన నోటీసు
RC/246/2024 25.08.2025
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
వెర్సస్
మెసర్స్ వైష్ణవి ఇన్‌ఫ్రాటెక్ లిమిటెడ్ మరియు ఇతరులు
To:
(CD 1) మెసర్స్ వైష్ణవి ఇన్‌ఫ్రాటెక్ లిమిటెడ్ (గతంలో TNR ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ లిమిటెడ్), ప్రాతినిధ్యం వహించు మేనేజింగ్ డైరెక్టర్, ఫ్లాట్ నం.9, 4వ అంతస్తు, ఐశ్వర్య నిలయం, సాయిబాబా దేవాలయం దగ్గర, ద్వారకాపురి కాలనీ, పంజాగుట్ట, హైదరాబాద్-500082
(CD 2) శ్రీ టి. గంగాధర్ రావు తండ్రి టి. నాగేశ్వర రావు, వయస్సు: 52 సంవత్సరాలు, వృత్తి: వ్యాపారం, ఫ్లాట్ నం.ఎ-2, నివాసం: నం.8-2-674/బి/2/23-ఎ, ల్యాండ్‌మార్క్ ఎన్‌క్లేవ్, రోడ్డు నం.13-ఎ, బంజారాహిల్స్, హైదరాబాద్-500033
(CD 3) శ్రీ వి.వి. సుబ్బారావు తండ్రి వీరరాఘవులు, వయస్సు: 56 సంవత్సరాలు, వృత్తి: వ్యాపారం, ఇ.నం.42/293/1, ప్లాట్ నం.29, ఫ్లాట్ నం.101, బాలాజీ నివాస్, మారుతీనగర్, మౌలాలి, ఈసీఐఎల్ పోస్ట్, హైదరాబాద్-500066
(CD 4) టి. కృష్ణకుమారి భర్త టి. గంగాధర్ రావు, వయస్సు: 45 సంవత్సరాలు, వృత్తి: వ్యాపారం, ఫ్లాట్ నం.ఎ-2, నివాసం: నం.8-2-674/బి/2/23-ఎ, ల్యాండ్‌మార్క్ ఎన్‌క్లేవ్, రోడ్డు నం.13-ఎ, బంజారాహిల్స్, హైదరాబాద్-500033
(CD 5) కె. విజయలక్ష్మి భర్త శ్రీ కె. రాంబాబు, వయస్సు: 49 సంవత్సరాలు, వృత్తి: ఉద్యోగి, 7-1-29/బి/13, లీలానగర్, అమీర్‌పేట, హైదరాబాద్-500016
(CD 6) వి.కె. శ్రీరామ నాయుడు తండ్రి ఆర్.వి.కె. రామస్వామి, వయస్సు: 47 సంవత్సరాలు, వృత్తి: వ్యాపారం, నివాసం: ఫ్లాట్ నం.బి-1, స్నేహ ఎన్‌క్లేవ్, రోడ్డు నం.5, బంజారాహిల్స్, హైదరాబాద్ - 500033
(CD 7) జి.ఎస్. ఉదయ్‌కుమార్ తండ్రి జి.కె. నందగోపాల్, వయస్సు: 43 సంవత్సరాలు, వృత్తి: వ్యాపారం, నివాసం: నం.22-16-27/5, ఫ్లాట్ నం.43, శ్రీకృష్ణనగర్ కాలనీ, సఫిల్‌గూడ, హైదరాబాద్ - 500056
(CD 8) కె. అజయ్‌కుమార్ తండ్రి శ్రీ కె. తిరుపతి రాజు, వయస్సు: 39 సంవత్సరాలు, వృత్తి: వ్యాపారం, నివాసం: నం.101, ఇందిరా హైట్స్, ఖైరతాబాద్, హైదరాబాద్ - 500004
మొత్తం రూ.59,72,15,329.68/- (రూపాయలు యాభైతొమ్మిది కోట్ల డెబ్బైరెండు లక్షల పదిహేను వేల మూడు వందల ఇరవై తొమ్మిది మరియు అరవైఎనిమిది పైసలు మాత్రమే)తో పాటు పెండెంట్‌లైట్ మరియు 20.10.2017 నుండి వర్తింపుతో రాబట్టుకొనే వరకు 12% వంతున భవిష్య వడ్డీ మరియు వ్యయాలు రూ.2,04,110 (రూపాయలు రెండు లక్షల నాలుగు వేల నూట పది మాత్రమే)లను దరఖాస్తుదారు బ్యాంక్(లు)/ ఆర్థిక సంస్థ(లు) దరఖాస్తుదారుకు చెల్లించాలని డెట్స్ రికవరీ ట్రిబ్యునల్, హైదరాబాద్ (DRT 2) ప్రిసైడింగ్ ఆఫీసర్ ఆదేశం మేరకు మెసర్స్ వైష్ణవి ఇన్‌ఫ్రాటెక్ లిమిటెడ్ మరియు ఇతరులకు OA/3710/2017లో 30/05/2024 తేదీగల రికవరీ సర్టిఫికెట్ జారీచేయబడింది, మరియు పైన తెలిపిన సదరు మొత్తం చెల్లించనందున, దిగువ పేర్కొన్న స్థిర/ చరాస్తి అమ్మకం కోసం దిగువ సంతకందారు ఆదేశించారు.
2. 15.09.2025న ఉ.10.30 గం.కు అమ్మకం ప్రకటన రూపొందించడం ఖరారు చేయడం జరిగింది మరియు పరిష్కరించుకోవాలని మీకు ఇందుమూలముగా తెలియజేయడమైనది. సదరు ఆస్తులకు లేదా అందులోని ఏదేని భాగానికి జతచేయబడిన ఏవేని తాకట్టు రుణభారాలు, చార్జీలు, క్లెయిములు లేదా లయబిలిటీలను దిగువ సంతకందారు దృష్టికి తీసుకురావలసిందిగా మిమ్మల్ని కోరడమైనది.

అస్తి స్పెసిఫికేషన్ :
అరెస్ట్ షెడ్యూల్ ఆస్తి-3:
సేల్ డీడ్ నం.:6299 ఆఫ్ 1995 ద్వారా కవర్ చేయబడిన శ్రీమతి కె. విజయలక్ష్మి ఆస్తి.
రంగారెడ్డి జిల్లా, కుత్బుల్లాపూర్ మండలం, బాచుపల్లి గ్రామం మరియు గ్రామ పంచాయతీ, వద్ద గల 770 చ.గ.లు లేదా 649.57 చ.మీ.ల విస్తీర్ణ సర్వే నం.311లో ప్లాట్ నం.లు : 35,36,37,38,39 మరియు 40 లో ఇంటి స్థలం యావత్తు. సరిహద్దులు : ఉత్తరం: ప్లాట్ నం.34, దక్షిణం: ఇతరుల భూమి, తూర్పు: ఇతరుల భూమి, పశ్చిమం: 30' వెడల్పు రోడ్.
అరెస్ట్ షెడ్యూల్ ఆస్తి-4:
సేల్ డీడ్ నం.:2341/2007 క్రింద కవర్ చేయబడిన శ్రీ టి. గంగాధర్ ఆస్తి.
హైదరాబాద్, పంజాగుట్ట, ద్వారకాపురి కాలనీవద్ద గల సర్వే నం.లు 136, 138 మరియు 140లలో మున్సిపల్ నం.6-3-347/22/2 గల ఆవరణలో 100 చ.అ. విస్తీర్ణ ఒక కార్ పార్కింగ్ ఏరియా, 702.45 చ.గ.లలో 63.85 చ.గ.ల విస్తీర్ణ భూమి. అవిభాజ్య వాటాతో పాటు కామన్ ఏరియాలు కలుపుకొని 2170 చ.అ.ల విస్తీర్ణ ఐశ్వర్య నిలయం పేరున గల భవనంలో నాలుగవ అంతస్తులో నివాసిత ఫ్లాట్ నం.9 యావత్తు. సరిహద్దులు: ఉత్తరం: ఖాళీ, దక్షిణం: ఖాళీ, తూర్పు: ఖాళీ, పశ్చిమం: కారిడార్ / లిఫ్ట్ / మెట్లు మరియు ఫ్లాట్ నం.10.
అరెస్ట్ షెడ్యూల్ ఆస్తి-5:
డాక్యుమెంట్ నం.:6326 ఆఫ్ 2011 ద్వారా కవర్ చేయబడిన శ్రీ వి.కె. శ్రీరాం నాయుడు ఆస్తి
రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్ మహానగర పాలక సంస్థ సర్కిల్ మరియు శేరిలింగంపల్లి మండలం, మాదాపూర్ గ్రామం వద్ద గల సర్వే నం.లు 31 నుండి 36లో ప్లాట్ నం.22 లో నం.1-89/2/1/22 గల ఇంటిలో 619 చ.గ.లలో 495.2 చ.గ.ల విస్తీర్ణ భూమి అవిభాజ్యవాటాతో స్టిల్ట్ లో 8 పార్కింగ్ స్లాట్లు కలుపుకొని 12,080 చ.అ.ల బిల్టప్ ఏరియా విస్తీర్ణం సాయిబాలాజీ రెసిడెన్సీగా పిలవబడే నివాసిత సముదాయంలో మొదటి అంతస్తుపై ఫ్లాట్ నం.101, మొదటి అంతస్తుపై ఫ్లాట్ నం.102, మూడవ అంతస్తుపై ఫ్లాట్ నం.301, మూడవ అంతస్తుపై ఫ్లాట్ నం.302, నాలుగవ అంతస్తుపై ఫ్లాట్ నం.401, నాలుగవ అంతస్తుపై ఫ్లాట్ నం.402, ఐదవ అంతస్తుపై ఫ్లాట్ నం.501 మరియు 5వ అంతస్తుపై ఫ్లాట్ నం.502 యావత్తు. సరిహద్దులు: 1507 చ.అ.ల విస్తీర్ణ ఫ్లాట్ నం.101: ఉత్తరం: ఖాళీ, దక్షిణం ఖాళీ, తూర్పు: ఖాళీ, పశ్చిమం: లిఫ్ట్, కారిడార్ మరియు ఫ్లాట్ నం.102. 1513 చ.అ.ల విస్తీర్ణ ఫ్లాట్ నం.102: ఉత్తరం: ఖాళీ, దక్షిణం ఖాళీ, తూర్పు: లిఫ్ట్, కారిడార్ మరియు ఫ్లాట్ నం.101, పశ్చిమం: ఖాళీ. 1507 చ.అ.ల విస్తీర్ణ ఫ్లాట్ నం.301: ఉత్తరం: ఖాళీ, దక్షిణం ఖాళీ, తూర్పు: ఖాళీ, పశ్చిమం: లిఫ్ట్, కారిడార్ మరియు ఫ్లాట్ నం.302. 1513 చ.అ.ల విస్తీర్ణ ఫ్లాట్ నం.302: ఉత్తరం: ఖాళీ, దక్షిణం ఖాళీ, తూర్పు: లిఫ్ట్, కారిడార్ మరియు ఫ్లాట్ నం.301, పశ్చిమం: ఖాళీ. 1507 చ.అ.ల విస్తీర్ణ ఫ్లాట్ నం.401: ఉత్తరం: ఖాళీ, దక్షిణం ఖాళీ, తూర్పు: ఖాళీ, పశ్చిమం: లిఫ్ట్, కారిడార్ మరియు ఫ్లాట్ నం.402. 1513 చ.అ.ల విస్తీర్ణ ఫ్లాట్ నం.402: ఉత్తరం: ఖాళీ, దక్షిణం ఖాళీ, తూర్పు: లిఫ్ట్, కారిడార్ మరియు ఫ్లాట్ నం.401, పశ్చిమం: ఖాళీ. 1507 చ.అ.ల విస్తీర్ణ ఫ్లాట్ నం.501: ఉత్తరం: ఖాళీ, దక్షిణం ఖాళీ, తూర్పు: ఖాళీ, పశ్చిమం: లిఫ్ట్, కారిడార్ మరియు ఫ్లాట్ నం.502. 1513 చ.అ.ల విస్తీర్ణ ఫ్లాట్ నం.502: ఉత్తరం: ఖాళీ, దక్షిణం ఖాళీ, తూర్పు: లిఫ్ట్, కారిడార్ మరియు ఫ్లాట్ నం.501, పశ్చిమం: ఖాళీ.
ట్రిబ్యునల్ సీల్‌తో తేది.25.08.2025న నాచే స్వయంగా ఇవ్వబడినది.
సం/- రికవరీ ఆఫీసర్
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్, హైదరాబాద్ (DRT 2)

నాగారం పురపాలక సంఘ కార్యాలయం
మేడ్చల్-మల్కాజ్‌గిరి
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
1. No.E1/09/2025-26, తేది:01.09.2025, 2. పనుల సంఖ్య: 13 (సివిల్), 3. అంచనా వ్యయం: రూ.458.50 లక్షలు, 4. బిడ్ దాఖలు ప్రారంభ తేది: 01.09.2025న ఉ.11.00 గం.లకు, 5. బిడ్ల దాఖలుకు ఆఖరి తేది: 08.09.2025న మ.3.00 గం.లకు, 6. బిడ్లు తెరుచుట: 08.09.2025న మ.3.10 గం.లకు, 7. తదుపరి వివరాలకు సంప్రదించండి: 7075596119, 8008066188 మరియు చూడండి: http://tender.eprocurement.gov.in
సం/- కమిషనర్, నాగారం పురపాలక సంఘం
DIPR RO. No.7401-PP/CL/ADVT/1/2025-26, తేది:30.08.2025

పురపాలక సంఘం కార్యాలయము తెల్లాపూర్:: సంగారెడ్డి జిల్లా
ఇ-ప్రొక్యూర్మెంట్ నోటీసు
నోటీసు నెం.ఇ1/23/2025-26, తేది:29.08.2025
1. తెల్లాపూర్ మున్సిపాలిటి సంగారెడ్డి జిల్లా ఇ-ప్రొక్యూర్మెంట్ నోటీస్ నం. ఇ1/23/2025-26, తేది: 29.08.2025, రూ.15.00 లక్షలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్ ఫారమ్ కింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండర్ దారులు ఇ-మార్కెట్ ప్లేస్ అనగా www.tender.telangana.gov.in నుండి టెండర్ షెడ్యూల్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చును మరియు తదుపరి వివరాలను పొందవచ్చును. టెండర్ల స్వీకరణకు చివరి తేది: 05.09.2025, సా.3.30 గం.ల వరకు.
సం/- మునిసిపల్ కమిషనర్ తెల్లాపూర్ మున్సిపాలిటి
DIPR RO No.7418-PP/CL/ADVT/1/2025-26, Dt.30.08.2025

గుండ్లపోచంపల్లి పురపాలక సంఘ కార్యాలయం, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా
mc.gundlapochampally@gmail.com
టెండరు కోరుతూ ప్రకటన
NIT నం. E1/37/NIT/MCG/2025-26, వివరణ: GPM లో కొన్ని పనులు చేపట్టుట (03), అంచనా మొత్తం: రూ.07.00 లక్షలు, బిడ్ల స్వీకరణకు ప్రారంభ తేది/ఆఖరి తేది & సమయం:- డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 30.08.2025న సా.04.00 గం.లకు. బిడ్ల స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 02.09.2025న సా.04.00 గం.లకు, తదుపరి వివరాల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్లాట్‌ఫారం అనగా https://tender.telangana.gov.in ను దర్శించగలరు లేదా గుండ్లపోచంపల్లి పురపాలక సంఘ కార్యాలయాన్ని సంప్రదించగలరు.
సం/- కమిషనర్, గుండ్లపోచంపల్లి పురపాలక సంఘం
DIPR R.O No.7391-PP/CL/ADVT/1/2025-26, Dt:30.08.2025

PROFESSOR JAYASHANKAR TELANGANA AGRICULTURAL UNIVERSITY
ADMN, OFFICE: RAJENDRANAGAR: HYDERABAD-500 030.
Short Tender Notice (e-Procurement platform)
NIT No.06/PJTAU/EO/TPA/2025-26, Dt. 29-08-2025
6 Nos. of works, ECV of Rs. 21.50 lakhs

Bid Submission Start Date & Time.	02/09/2025 04.30 P.M.
Bid Submission Closing Date & Time.	09/09/2025 05.00 P.M
Date of Opening of Price Bid	10/09/2025 10.30 A.M
Contacting Officer & Contact Details	Tech. P.A. to Estate Officer, 040-24015315 & 040-24015011 Extn:451
For further details please visit	https://tender.telangana.gov.in

DIPR RO No.7360-PP/CL/ADVT/1/2025-26,Dt.30.08.2025 Sd/- ESTATE OFFICER

హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
టెండరు ప్రకటన
NIT No.10/SE(P-WZ)/GHMC/2025-26 తేది: 30.08.2025
పని పేరు: GHMC, జూబ్లీహిల్స్, సర్కిల్-18లోని విరించి హాస్పిటల్ జంక్షన్ నుండి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ జంక్షన్ వరకు 100 అ./ 120 అ. RDP వరకు వెడల్పు చేయబడిన రోడ్డు భాగంలో BT రోడ్డు వేయుట. అంచనా మొత్తం: రూ.150.00 కోట్లు. బిడ్ల స్వీకరణకు ప్రారంభ తేది & సమయం: 02.09.2025 సా.04.00 గం. నుండి బిడ్ల స్వీకరణకు చివరి తేది & సమయం: 16.09.2025 మ.03.00 గం. వరకు. అధికారి పేరు, చిరునామా & సెల్ నం: సూపరింటెండింగ్ ఇంజినీర్ (ప్రాజెక్ట్స్-WZ) కార్యాలయం, GHMC, 7993360288. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ www.tender.telangana.gov.inలో చూడవచ్చును లేదా సూపరింటెండింగ్ ఇంజినీర్ (ప్రాజెక్ట్స్-WZ), GHMC వారి కార్యాలయంలో కార్యాలయ పనివేళలలో సంప్రదించవచ్చును.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్ (ప్రాజెక్ట్స్-WZ), GHMC
DIPR RO No.7407-PP/CL/ADVT/1/2025-26, Dt: 30.08.2025

TELANGANA CO-OPERATIVE MARKETING FEDERATION LTD.
Email: proc.tsmarkfed2018@gmail.com, Ph.No: 040-2460 7108, Fax: 040-2460 7100
Rc.No.P&M/Disposal of Sunflower/2024-25 Date: 30.08.2025
TENDER FOR SALE OF SUN FLOWER PROCURED BY TG MARKFED DURING YASANGI 2024-25
Tender notification for Godown wise online e-Auction on disposal of Sunflower 2024-25 procured by TG MARKFED for the quantity of 4447.51 MTs without base price.
Online e-auction starts on dated **11.09.2025, from 11:00 AM** to 02:00 PM through **e-procurement.telangana.gov.in** or **https://auction.telangana.gov.in/** i.e. Telangana e-procurement portal (Applications in e-procurement portal will be available from 01.09.2025 AN). **EMD submission end date:** 09.09.2025. For online registration and further technical support please contact Service providers Ph: 7337445546, 7337445545 & 6309339690, 9912756216. For further details please contact. Ph: 7288879806, and 7288879829
Sd/- MANAGING DIRECTOR
DIPR RO No.7404-PP/CL/ADVT/1/2025-26, Dt.30.08.2025

తెలంగాణ రాష్ట్రంలోని COE గాంధీ & ART సెంటర్, గాంధీ వద్ద ఖాళీగా ఉన్న ఉద్యోగాల కొరకు 15 సెప్టెంబర్, 2025న వాక్-ఇన్ ఇంటర్వ్యూ
తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ వద్దగల ART సెంటర్, గాంధీ జనరల్ హాస్పిటల్‌లో మెడికల్ ఆఫీసర్ (MO) - 1 ఉద్యోగం మరియు COE, గాంధీ జనరల్ హాస్పిటల్‌లో HIV రీసెర్చ్ ఫెలో (క్లినికల్) - 1 ఉద్యోగం కొరకు విద్యార్హత మరియు యోగ్యతగల అభ్యర్థులకు ఆహ్వానం. అన్ని ఉద్యోగాలు పూర్తిగా తాత్కాలికం / కాంట్రాక్చువల్ మరియు నెలవారీ ఏకమొత్తం చెల్లింపు ప్రాతిపదికన మాత్రమే. దిగువ తెలిపిన ఉద్యోగాల కోసం ఆసక్తిగల అభ్యర్థులు తమ విద్యార్హత మరియు అనుభవం సర్టిఫికెట్ల కాపీలతో తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (TGSACS) ప్రధాన కార్యాలయం, DM&HS క్యాంపస్, కోఠి, హైదరాబాద్ వద్ద 15 సెప్టెంబర్, 2025న వాక్-ఇన్ ఇంటర్వ్యూ కోసం హాజరుకావలెను.

క్ర.సం.	ఉద్యోగం పేరు	కావలసిన విద్యార్హత & అర్హత
1	మెడికల్ ఆఫీసర్ (MO) ART సెంటర్, గాంధీ జనరల్ హాస్పిటల్	MBBS (అతను/ఆమె 62 సంవత్సరాల వయస్సు పరిమితి దాటి ఉండకూడదు)
2	HIV రీసెర్చ్ ఫెలో (క్లినికల్) COE, గాంధీ జనరల్ హాస్పిటల్	MBBS తరువాత MD మెడిసిన్ లేదా ఏదేని ఇతర క్లినికల్ డిసిప్లిన్/ కమ్యూనిటీ మెడిసిన్/ మైక్రోబయాలజి / Ph.D లేదా ప్రత్యామ్నాయ విద్యార్హత: మెడికల్ స్పెషాలిటీస్, పబ్లిక్ హెల్త్‌లో డిప్లొమాతో MBBS లేదా 3 సంవత్సరాల అనుభవంతో HIVలో ఫెలోషిప్ ప్రోగ్రామ్ (అతను/ఆమె 62 సంవత్సరాల వయస్సు పరిమితి దాటి ఉండకూడదు)

సం/- ప్రాజెక్ట్ డైరెక్టర్, TGSACS
DIPR RO No.7384-PP/CL/ADVT/1/2025-26, తేది: 30.08.2025

Form No.14 [See Regulation 33(2)]
OFFICE OF THE RECOVERY OFFICER - I/II
DEBTS RECOVERY TRIBUNAL HYDERABAD (DRT 1)
3rd Floor, Triveni Complex, Abids, Hyderabad-500001.
DEMAND NOTICE
NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME TAX ACT, 1961.
RC/338/2018 12-08-2025
SYNDICATE BANK Versus MS SRI SAI WINES
To: **(CD 1) Ms Sri Sai Wines,** At 1 3 176 35 14, Kavadiguda, Hyderabad, Telangana. **(CD 4) Sri B Upender,** Ro 1 7 658 D 1, Shastri Nagar, Ramnagar, Hyderabad, Telangana. **(CD 7) Ms Sri Sai Wines,** At Shop No 12 1 630 3, Zeera Road, Asifnagar, Telangana. **(CD 8) Sri K Gopal Goud,** Ro 1 2 422 116, Surya Residency, Gudimallapur, Hyderabad, Telangana. **(CD 10) Sri N Mega Raj Goud,** Ro 12 1 1030, Old Mallepally, Hyderabad, Telangana. **(CD 11) Sri P Krishna Goud,** Ro 1 8 430 14 1, CHikkadpally, Hyderabad, Telangana. **(CD 12) MS Sunny Wines,** At 6 7 86, Bansilalpet, Secunderabad Hyderabad, Telangana. **(CD 16) Sri K Vinod,** Ro 2 126, Ghatkesar, RR Rangareddi, Telangana. **(CD 18) Sri MS Bhagheeradha,** Ro 1 3 179, Kawadiguda, Secunderabad, Hyderabad, Telangana. **(CD 21) Sri A Prabhakar Goud,** Ro 1 7 629 69 A, Achaiah Nagar, Ramnagar, Hyderabad, Telangana. **(CD 22) Sri S Shekhar Goud,** Ro 1 7 655 B, Shastrinagar, Ramnagar, Hyderabad Telangana. **(CD 23) Sri D Anjaneyulu Goud,** Ro 3 12 44, Balajinagar, L B Nagar, RR Rangareddi, Telangana. **(CD 27) Sri M Vishnu Goud,** Ro 3 5 928, Susheelawadi, Himayathnagar Hyderabad 29 Telangana. **(CD 28) Sri C Yadaiah Goud,** Ro 5 5 555, Malakunta, Hyderabad, Karimnagar, Telangana. **(CD 30) Sri T Gangadhar Goud,** Ro 21 96 1, Shardanagar, Dilsukhnagar Hyderabad Hyderabad, Telangana. **(CD 35) Sri N Raman Goud,** Ro H No. 11 3 111 1, Venkateshwara Colony Road No 6, Sroornagar, Hyderabad 35, Hyderabad, Telangana. **(CD 37) Sri C Sadanand Goud,** Ro Flat No 405, Lahari Apartment, Vegetable Market Road, Nallkunta Hyderabad, Telangana. **(CD 42) Sri C Anthaiah,** Ro Flat No 501, Lahari Apartment, Vegetable Road, Nallkunta,, Hyderabad 44, Hyderabad, Telangana. **(CD 44) Sri A Rajesh,** Ro H No 4 34, Hasmathpet, Manovikas Nagar RR, Hyderabad, Telangana. **(CD 47) Ms Sri Sai Wines,** Office Shop No 3 129 Shop No 1, Annojiguda Ghatkesar RR Hyderabad, Telangana. **(CD 49) Sri B Shivakumar Goud,** Ro H No 12 15 OU6 A 1 14, OU Campus, Manikeshwari Nagar, Hyderabad, Telangana. **(CD 50) Sri S Baswa Raj Goud,** Ro H No 11 1 851 2, Seetharambagh Afjalsagar, Hyderabad, Telangana. **(CD 51) Sri K Sreenivas Kumar Goud,** Ro H.No.1 1 261 13 1, Chikkadpally Hyderabad 2, Hyderabad, Telangana. **(CD 52) Ms Sri Sai Wines,** Office Shop In Sy No 138, Pothireddypally, Sangareddy, Medak Telangana. **(CD 53) Sri T Rajaiah Goud,** Ro H No 2 80 3, Old RC Puram, Ramchandrapuram, Medak Medak, Telangana. **(CD 56) Sri K Ashok Goud,** Ro H No 11 1 889 7 1 A, Afzal Sagar, Seetharambagh, Hyderabad Hyderabad, Telangana. **(CD 57) Ms New Sri Rajarajeshwari Wines,** At H No 3 5 58 A & B, Station Road, Kachiguda, Hyderabad Hyderabad, Telangana. **(CD 59) Sri M Raju Goud** Ro H No 1 8 82, Ambedkar College Road, Chikkadpally, Hyderabad Hyderabad, Telangana. **(CD 60) Ms Sri Sai Wines**, H No 25 97, Ashok Nagar, Ward No 3, RC Puram, Medak Medak, Telangana. **(CD 62) Sri R Ramulu Goud,** Ro H No 1 8 217 1, Chikkadapally, Hyderabad Hyderabad, Telangana. **(CD 63) Sri B Paramesh Goud,** Ro H No 11 2 852, Bazarghat, Nampally, Hyderabad Hyderabad, Telangana. **(CD 75) Ms Sri Sai Wines,** Office Shop No 1 7 1002 33 1 Ramnagar Hyderabad Hyderabad, Telangana. **(CD 77) Sri V Hanmanth Rao,** H. No 12 13 677 73, Street No 1, Tamaka Secunderabad Hyderabad, Telangana. **(CD 78) Sri S Srinivas Goud,** Ro H No 12 11 964, Warasiguda Secunderabad Hyderabad, Telangana. **(CD 82) Ms Sri Sai Bar &Amp; Restaurant** Office Shop No 5 5 556 to 558 and 560, Malakunta Hyderabad, Hyderabad, Telangana. **(CD 86) Sri Ch Balaraju,** Ro 3 79, Ismailkhanguda, Ghatkesar Mandal RR, Hyderabad, Telangana. **(CD 87) Ms Sri Sai Restautant &Amp; Bar,** Office Shop No 1 8 3 27 7 1, Chikkadpally, Hyderabad Hyderabad, Telangana. **(CD 88) Sri S Venkateshwarlu,** Ro 1 3 19, Kawadiguda, Hyderabad Hyderabad, Telangana. **(CD 90) Sri G Venkatesh Goud,** Ro H No. 9 63 1, Pothireddypally, Sangareddy, Medak, medak, Telangana. **(CD 94) Sri P Satyanarayana Goud,** Ro H.No.13 2 266 52 1, Shivlal Nagar, Rahimpura, Hyderabad, Telangana. **(CD 95) Ms N Srivani,** Ro H No 3 4 610 2, Flat No G1, Due Drops Apartment, Narayanguda, Hyderabad, Hyderabad, Telangana. **(CD 97) Ms Vaishnavi Restaurant & BAR,** Office Shop No 1 9 18 5, Ramnagar, Hyderabad, Telangana. **(CD 100) Sri P Veera Raghavulu,** Ro H No 1 8 3 27 A, Chikkadpally, Hyderabad Hyderabad, Telangana. **(CD 101) Sri A Ramesh,** Ro H No 1 3 3, Kawadiguda, Hyderabad Hyderabad, Telangana.
This is to notify that as per the Recovery Certificate issued in pursuance of orders passed by the Presiding Officer, **DEBTS RECOVERY TRIBUNAL HYDERABAD(DRT 1) in OA/384/2011** an amount of **Rs 374420047.81 (Rupees Thirty Seven Crores Forty Four Lakhs Twenty Thousands Forty Seven And Paise Eighty One Only)** along with pendentelite and future interest @17% w.e.f. // till realization and costs of **Rs. 0 (Only)** has become due against you (Jointly and severally/Fully/Limited).
2. You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordance with the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 and Rules there under.
3. You are hereby ordered to declare on an affidavit the particulars of yours assets on or before the next date of hearing.
4. You are hereby ordered to appear before the undersigned **on 17/09/2025 at 10:30 a.m.** for further proceedings.
5. In addition to the sum aforesaid, you will also be liable to pay:
(a) Such interests as is payable for the period commencing immediately after this notice of the certificate / execution proceedings.
(b) All costs, charges and expenses incurred in respect of the service of this notice and warrants and other processes and all other proceedings taken for recovering the amount due.
Given under my hand and the seal of the Tribunal, on this date: **12/08/2025**
Sd/- Recovery Officer
DEBTS RECOVERY TRIBUNAL HYDERABAD (DRT-1)

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

-ఆర్కే RK

తెలుగునాట ఇప్పుడు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఒక నియోజకవర్గంలో సగటున 30 కోట్లు ఖర్చు చేయాల్సిన పరిస్థితి. వచ్చే ఎన్నికల నాటికి ఈ మొత్తం ఇంకా పెరుగుతుంది. తెలుగు రాష్ట్రాలలో ఎన్నికలు ఖరీదైన వ్యవహారంగా మారాయి. 1985 ఎన్నికల్లో వెనుకబడిన శ్రీకాకుళంలోని ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి తెలుగు దేశం తరఫున పోటీ చేసిన ప్రతిభా భారతికి అయిన ఎన్నికల వ్యయం ఎంతో తెలుసా? కేవలం పది వేల రూపాయలు! అదే ఎన్నికల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని జగిత్యాల నుంచి తెలుగుదేశం పార్టీ తరఫున పోటీ చేసిన జీవన్ రెడ్డికి అయిన వ్యయం 15 వేల రూపాయలు మాత్రమే. తన వద్ద ఉన్న పది వేలు సరిపోవని, మరో ఐదు వేలు పార్టీ తరఫున ఇప్పిస్తే గెలిచి వస్తానని ఎన్నికల ప్రచారానికి వచ్చిన ఎన్టీఆర్‌ను జీవన్ రెడ్డి కోరగా, మరుసటి రోజు ఎన్టీఆర్ ఆ ఐదు వేలూ సర్దుబాటు చేయించారు. అప్పట్లో పదివేలు మాత్రమే ఖర్చు చేసిన నియోజకవర్గాలలో ఇప్పుడు పది కోట్లు కూడా సరిపోవడం లేదు. కొన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో ఖర్చు వంద కోట్లు దాటుతోంది. దీంతో ఎన్నికల్లో చేసిన ఖర్చును తిరిగి రాబట్టుకోవడం కోసం శాసనసభ్యులు బరితెగించాల్సి వస్తోంది.

ఎమ్మెల్యేలు.. వసూల్ రాజాలు!

తెలుగునాట.. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో పలువురు శాసనసభ్యులు వారి ముఖ్యమంత్రులకు కంట్లో నలుసుల్లా తయారవుతున్నారా? ఎం.ఎల్.ఎ. అంటే మెంబర్ ఆఫ్ లెజిస్లేటివ్ అసెంబ్లీ.. అంటే చట్టసభ సభ్యులు. చట్ట సభల్లో చట్టాలు చేస్తూ ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారం కోసం కృషి చేయాల్సిన శాసన సభ్యులే ఇప్పుడు ప్రజలపాలిట సమస్యగా మారుతున్నారు. ఇటు తెలంగాణ, అటు ఆంధ్రప్రదేశ్‌లో కొంత మంది శాసన సభ్యులు లేని అధికారాలను సంక్రమింప జేసుకొని ఆయా నియోజకవర్గాలలో ప్రజలు గాలి పీల్చుకోవాలన్నా తమ అనుమతి తప్పనిసరి అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. 2004 నుంచి ప్రారంభమైన ఈ ధోరణి ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో వెర్రి తలలు వేస్తోంది. జగన్మోహన్ రెడ్డి హయాంలో శాసనసభ్యు లకు అపరిమిత స్వేచ్ఛను ఇవ్వడంతో వారు ప్రభుత్వ కార్యా లయాలను తమ అజమాయిషీలోకి తెచ్చుకున్నారు. ఇప్పుడు కూటమి ఎమ్మెల్యేలకూ అదే ఆదర్శమైంది. గతానికి భిన్నంగా ఈ జాడ్యం ఇప్పుడు తెలంగాణకు కూడా విస్తరించింది. 2009లో ఎమ్మెల్యేగా ఎన్నికైన లోక్‌సత్తా అధినేత జయప్రకాష్ నారాయణ మంచినీటి సరఫరా, డ్రైనేజీ వంటి స్థానిక సమస్య లను తన దృష్టికి తీసుకువచ్చిన వారిని ఉద్దేశించి, వాటి గురించి స్థానిక ప్రజాప్రతినిధులైన కార్పొరేటర్లకు చెప్పాలని సూచించేవారు. ఇది ప్రజలకు రుచించలేదు. అది వేరే విషయం! 1983కు ముందు గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ ఉనికి ఉండేది కాదు. అక్కడి ప్రజా సమస్యలను స్థానిక సంస్థలే పరిష్కరించేవి. అప్పట్లో ఎమ్మెల్యేలు ప్రజలకు పెద్దగా అందుబాటులో ఉండేవారు కారు. ఎమ్మెల్యేలను కలుసుకో గలిగే పరిస్థితి జిల్లా స్థాయిలో కొద్దిమందికే ఉండేది. ఇక మంత్రులు, జిల్లా కలెక్టర్లను కలుసుకోవడం అరుదైన అవ కాశంగా ఉండేది. అలా కలుసుకోగలిగిన వారికి పలుకుబడి ఉన్నట్టు పరిగణించేవారు. ఆ తర్వాత ఎన్టీఆర్ హయాంలో ప్రభుత్వాన్ని ప్రజలకు చేరువ చేశారు. దీంతో ఎమ్మెల్యేలు ప్రజల్లో తిరగక తప్పలేదు. ఫలితంగా ప్రజలు తమ వ్యక్తిగత సమస్యలను, కుటుంబ పంచాయితీలను పరిష్కరించవల సిందిగా కూడా ఎమ్మెల్యేలను కోరేవారు. మొగుడూ పెళ్లాల పంచాయితీలు తామెందుకు పరిష్కరించాలని ఆ రోజుల్లో ఎమ్మెల్యేలు విసుక్కొనేవారు. హైదరాబాద్‌లో ఉండే తమ ఎమ్మెల్యేలను తెలంగాణ జిల్లాలకు చెందిన ప్రజలు వచ్చి కలుసుకొని బాధలు చెప్పుకొనేవారు. కొంతమందైతే తిరుగు ప్రయాణాలకు చార్జీలు ఇవ్వవలసిందిగా ఎమ్మెల్యేలను కోరే వారు. తమను కలవడానికి వచ్చిన వారికి కాఫీ, టీలు తాగిం చడంతో పాటు భోజనం, వసతి కూడా ఏర్పాటు చేయవలసి రావడంతో శాసనసభ్యులు ఆర్థికంగా నలిగిపోయేవారు. పెళ్లిళ్లు, చావులకు వెళ్లడం విధిగా మారింది. అదే సమ యంలో ఖర్చుల కోసం డబ్బు కూడా డిమాండ్ చేసేవారు. తెలంగాణలో ఇప్పటికీ ఈ పరిస్థితి ఉంది. కొంత కాలం క్రితం ఒక లారీ డ్రైవర్ తమ నియోజకవర్గ ఎమ్మెల్యేకు ఫోన్ చేసి తాను డ్యూటీ మీద దూరంగా ఉన్నాననీ, పురిటి నొప్పులతో బాధపడుతున్న తన భార్యను ఆస్పత్రిలో చేర్పించి ప్రసవం చేయించవలసిందిగా కోరారు. ఇలాంటి విచిత్రమైన అనుభవా లను శాసనసభ్యులు గతంలో పంచుకొనేవారు. ఇదంతా గతం. ఇప్పుడు ఎమ్మెల్యేలు ఆయా నియోజకవర్గాలకు సామంత రాజులుగా, దండ నాయకులుగా తయారయ్యారు. తెలంగాణలో కూడా ఈ పోకడలు మొదలయ్యాయి. తెలంగా ణలో యూరియా కొరత ఇప్పుడు ప్రధాన సమస్యగా ఉంది. రైతులు ప్రభుత్వాన్ని నిందిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన రామగుండం ఎరువుల కంపెనీ తెలంగాణలో ఉన్నప్ప టికీ సాంకేతిక సమస్యలు తలెత్తి ఉత్పత్తి నిలిచిపోయింది. దీంతో యూరియా కొరత మరింత తీవ్రమైంది. ఈ పరి స్థితుల్లో ఎవరైనా ఏమి చేస్తారు? ఎరువుల ఫాక్టరీలో మర మ్మతులను వేగంగా పూర్తిచేయించి ఉత్పత్తి తిరిగి ప్రారంభ మయ్యేలా చేస్తారు. కానీ అధికార పార్టీకి చెందిన ఒక ఎమ్మెల్యే ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. మర మ్మతుల కాంట్రాక్టు పొందిన సంస్థ ప్రతినిధులు తనను కలిసి తన సంగతి ఏమిటో తేల్చకపోతే ఎలా అని భీష్మించుకొని కూర్చున్నారు. ఈ వ్యవహారం మంత్రి, ముఖ్యమంత్రి వరకూ వెళ్లింది. దీంతో సంబంధిత శాఖ మంత్రి కల్పించుకొని సదరు ఎమ్మెల్యేను పిలిపించుకొని సర్దిచెప్పారు. ఈ ధోరణిని ఏమనాలి? ఇల్లు తగలబడుతుంటే బొగ్గులు ఏరుకోవడానికి ప్రయత్నించినట్టుగా లేదా? కేసీఆర్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యేలకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చారు. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన కూడా తమ పార్టీ ఎమ్మెల్యేలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. ఈ విషయంలో ఒకరికొకరు ఆదర్శం అయ్యారు. ఫలితంగా తెలంగాణలో గతంలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గాలలో ఎమ్మెల్యేల ఆధిపత్యం పెరిగి పోయింది. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు సంబంధించిన సమస్యల పరిష్కారం చేయాలన్నా ఎమ్మెల్యేల అనుమతి తప్పనిసరి చేశారు. పోలీస్ స్టేషన్లో ఎఫ్ఐఆర్ కట్టాలన్నా శాసనసభ్యుడి అనుమతి ఉండాలని నిర్దేశించారు. దీంతో యావత్ అధికార యంత్రాంగం రాజకీయ నాయకుల గుప్పిట్లోకి వెళ్లిపోయింది. ఒకవైపు లేని అధికారాలను అనుభ విస్తూ, మరోవైపు భూ కబ్జాలు, దందాలలో ఎమ్మెల్యేలు మునిగితేలారు. ఫలితంగా 2023 ఎన్నికలకు ముందు భారత రాష్ట్ర సమితికి చెందిన శాసనసభ్యులపై ప్రజల్లో తీవ్ర వ్యతి రేకత ఏర్పడింది. అయినప్పటికీ ఆ ఎన్నికల్లో కేసీఆర్ అభ్యర్థు లను మార్చకుండా పాతవాళ్లు అందరికీ టికెట్లు ఇచ్చారు. అప్రతిష్ఠపాలైన శాసనసభ్యులను మార్చి ఉంటే కేసీఆర్ అధికారం కోల్పోయి ఉండేవారు కాదన్న అభిప్రాయం భారత రాష్ట్ర సమితి ముఖ్యులలో ఇప్పటికీ ఉంది.

నాడు 10 వేలు.. నేడు 30 కోట్లు!

ప్రభుత్వ వ్యవహారాలలో శాసనసభ్యులు జోక్యం చేసుకొనే విధానం 2004 నుంచే మొదలైంది. దీంతో శాసనసభ్యులు అక్రమ సంపాదనకు అలవాటుపడ్డారు. ఇప్పుడు అదొక హక్కుగా మారింది. ముఖ్యమంత్రులు సైతం ఎమ్మెల్యేలను అదుపు చేయలేని పరిస్థితి ఏర్పడింది. ఉమ్మడి రాష్ట్రంలో 2004 తర్వాత పైస్థాయిలో అవినీతి వ్యవస్థీకృతం అయింది. అదే సమయంలో మీరు కూడా సంపాదించుకోండి అన్నట్టుగా ఎమ్మెల్యేలకు స్వేచ్ఛ ఇచ్చారు. దీంతో చట్టసభల సభ్యులు జనం మీద పడ్డారు. ఐదేళ్లపాటు సంపాదించిన డబ్బుతో ఎన్ని కల్లో మళ్లీ గెలవడానికి విచ్చలవిడిగా ఖర్చు చేయడం మొదలుపెట్టారు. దీంతో తెలుగునాట ఇప్పుడు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఒక నియోజకవర్గంలో సగటున 30 కోట్లు ఖర్చు చేయాల్సిన పరిస్థితి. వచ్చే ఎన్నికల నాటికి ఈ మొత్తం ఇంకా పెరుగుతుంది. తెలుగు రాష్ట్రాలలో ఎన్నికలు ఖరీదైన వ్యవహారంగా మారాయి. 1985 ఎన్నికల్లో వెనుకబడిన శ్రీకాకుళంలోని ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి తెలుగుదేశం తరఫున పోటీ చేసిన ప్రతిభా భారతికి అయిన ఎన్నికల వ్యయం ఎంతో తెలుసా? కేవలం పది వేల రూపాయలు! అదే ఎన్నికల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని జగిత్యాల నుంచి తెలుగుదేశం పార్టీ తరఫున పోటీ చేసిన జీవన్ రెడ్డికి అయిన వ్యయం 15 వేల రూపాయలు మాత్రమే. తన వద్ద ఉన్న పది వేలు సరిపోవని, మరో ఐదు వేలు పార్టీ తరఫున ఇప్పిస్తే గెలిచి వస్తానని ఎన్నికల ప్రచారానికి వచ్చిన ఎన్టీఆర్‌ను జీవన్ రెడ్డి కోరగా, మరుసటి రోజు ఎన్టీఆర్ ఆ ఐదు వేలూ సర్దుబాటు చేయించారు. అప్పట్లో పదివేలు మాత్రమే ఖర్చు చేసిన నియోజకవర్గాలలో ఇప్పుడు పది కోట్లు కూడా సరి పోవడం లేదు. కొన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో ఖర్చు వంద కోట్లు దాటుతోంది. దీంతో ఎన్నికల్లో చేసిన ఖర్చును తిరిగి రాబట్టుకోవడం కోసం శాసనసభ్యులు బరితెగించాల్సి వస్తోంది. విత్తు ముందా? చెట్టు ముందా? అన్నట్టుగా పరిస్థితి తయా రైంది. చివరికి ముఖ్యమంత్రులు కూడా ఎమ్మెల్యేలను అదుపు చేయలేని పరిస్థితులు దాపురించాయి. ఇక ప్రభుత్వానికి బొటాబొటీ మెజారిటీ ఉంటే ఎమ్మెల్యేలను సంతృప్తిపరచ డానికే ముఖ్యమంత్రి తన సమయాన్ని వెచ్చించాల్సి వస్తోంది. తెలంగాణలో అధికార పార్టీకి చెందిన ఒక ఎమ్మెల్యే అసం తృప్తితో ఉన్నట్టు తెలుసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్నిహితులు ఆయనతో మాట కలపగా 'ఎన్నికల్లో ఖర్చు

> **హద్దు మీరుతున్న ఎమ్మెల్యేలను బ్లాక్ లిస్టులో పెట్టి, వారిని ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకోకపోతే అందరూ దారిలోకి వస్తారు. తమది మంచి ప్రభుత్వమే కాదు– బలమైన, దృఢమైన ప్రభుత్వమని ప్రజల్లో నమ్మకం కలిగించాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి చంద్రబాబుదే!**

చేసిన పైసలు రాబట్టుకోవాలిగా! 25 కోట్ల రూపాయలు పంపండి!' అని కోరారట. దీంతో సదరు మధ్యవర్తులు వెను దిరగాల్సి వచ్చింది.

బాబు కృషి బూడిదపాలు!

ఎన్నికల్లో విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు చేయడం, గెలిచిన వారు తిరిగి ఆ డబ్బు రాబట్టుకోవడానికి తెగబడటం అనేది ఒక విషవలయంగా మారింది. ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి మరింత వికటిస్తోంది. జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక శాసనసభ్యులకు పట్టపగ్గాలు లేకుండా పోయాయి. వ్యవస్థ లంటే భయం లేకుండా పోయింది. మీరు అందిన కాడికి దోచుకోండి, నన్ను మాత్రం ఏమీ అడగకండి అంటూ శాసన సభ్యులకు జగన్‌రెడ్డి లైసెన్స్ ఇచ్చేశారు. ప్రభుత్వ యంత్రాం గాన్ని కూడా కళ్లు మూసుకోమన్నారు. ఎమ్మెల్యే చెప్పిన మాట వినాల్సిందే అని అధికార యంత్రాంగాన్ని ఆదే శించారు. ఫలితంగా రాష్ట్రంలో ఒక రకమైన అరాచక వాతా వరణం ఏర్పడింది. రూల్ ఆఫ్ లా గాలికి పోయింది. సహనం నశించిన ప్రజలు 2024 ఎన్నికల్లో అధికార వైసీపీని 11 సీట్లకే పరిమితం చేసి, కూటమికి అఖండ మెజారిటీని కట్టబెట్టారు. గాడి తప్పిన రాష్ట్రాన్ని దారిలోకి తేవడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా ముఖ్యమంత్రికి సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తున్నారు. కేంద్ర ప్రభు త్వంతో ఏర్పడిన సత్సంబంధాలను వాడుకుంటూ రాష్ట్రానికి ప్రాజెక్టులు, పథకాలు తీసుకురావడానికి చంద్రబాబు కృషి చేస్తున్నారు. ఆయన ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కూడా ముఖ్య మంత్రి కోరిన విధంగా రాష్ట్రానికి సహాయ సహకారాలు అంది స్తోంది. ఉదాహరణకు యూరియా కొరతనే తీసుకుందాం. తెలంగాణలో ఉన్నంత తీవ్రంగా ఆంధ్రప్రదేశ్‌లో యూరియా కొరత లేకపోయినా రాష్ట్ర ప్రభుత్వం కోరిందే తడవుగా కేంద్రం పది వేల టన్నుల యూరియాను సమకూర్చింది. త్వరలో మరో 30 వేల టన్నుల యూరియా సరఫరా కాబోతోంది. విశాఖను పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి కూడా కేంద్ర ప్రభుత్వం ఉదారంగా సహకరిస్తోంది. రాష్ట్రాభివృద్ధికి ఉన్నత స్థాయిలో కృషి జరుగుతున్న వేళ క్షేత్ర స్థాయిలో కొంత మంది ఎమ్మెల్యేలు వ్యవహరిస్తున్న తీరును ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. జగన్‌రెడ్డి హయాంలో శాసన సభ్యులు అనుసరించిన ధోరణినే కూటమి ఎమ్మెల్యేలు ఇప్పుడు ఆదర్శంగా తీసుకుంటున్నారు. ప్రభుత్వ కార్యాల యాల్లో ఫైలు కదలాలంటే స్థానిక శాసనసభ్యుడి అనుమతి తప్పనిసరి చేశారు. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి ఇటీవల ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఒక ఆస్తి రిజిస్ట్రేషన్ కోసం వెళ్లగా, స్థానిక ఎమ్మెల్యేతో ఒక మాట చెప్పించండి అని సబ్ రిజిస్ట్రార్ అడిగారట. ఆస్తుల క్రయ విక్రయాలతో ఎమ్మెల్యేలకు ఏం పని? అని ప్రశ్నిస్తే సమాధానం ఉండదు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు లే అవుట్లు వేయాలన్నా ఎమ్మెల్యేల అనుమతి తప్పనిసరి. భూ వినియోగ మార్పిడి జరగాలన్నా స్థానిక శాసనసభ్యుణ్ణి సంతృప్తిపరచాలి. చివరికి ఇళ్లు, కార్యాలయ భవనాల నిర్మాణం కోసం మునిసిపల్ అనుమతులు కావా లన్నా శాసనసభ్యుడి పర్మిషన్ ఉండాల్సిందే. జగన్‌రెడ్డి హయాంలో జరిగినట్టుగానే ఇప్పుడు కూడా జరగడం ఏమిటి? అని ప్రజలు చిరాకు పడుతున్నారు. విచిత్రం ఏమిటంటే, శాసనసభకు తొలిసారిగా ఎన్నికైన వారు, కొత్తగా రాజకీయ అరంగేట్రం చేసిన రాజకీయ కుటుంబాల వార సులు ఇలాంటి అరాచకాలకు అధికంగా పాల్పడుతున్నారు. గతంలో శాసనసభ్యులుగా పనిచేసిన వారు ఇలా అన్నింటిలో తల దూర్చడం లేదు. నియోజకవర్గాలను చెరబట్టిన ఎమ్మెల్యేల వల్ల పైస్థాయిలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన కృషి బూడిదలో పోసిన పన్నీరు అవుతోంది. కూటమి ఎమ్మెల్యేల పోకడల గురించిన సమాచారం ముఖ్యమంత్రి దృష్టికి కూడా వెళుతోంది. అయినా వారిని ఆయన కట్టడి చేయలేకపోతున్నారు. బరితెగించిన ఎమ్మెల్యేలను సందర్భం వచ్చినప్పుడల్లా చంద్రబాబు హెచ్చరిస్తూనే ఉన్నారు. అయినా వారి వైఖరిలో మార్పు లేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత అంటూ ఉంటే అది ఎమ్మెల్యేల వల్లేనని ముఖ్య మంత్రికి తెలియంది కాదు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి ఇటీవలే అటవీ శాఖ సిబ్బందిపై దాడి చేశారు. అటవీ సంరక్షణ చట్టం ప్రకారం ఇది తీవ్ర నేరం. అయినా సదరు

> **చంద్రబాబుపై నమ్మకంతో ఎంతో మంది పార్టీ ఫండ్ ఇచ్చారు. ఆయన కూడా పలువురిని ఒప్పించి, మెప్పించి నిధులు సేకరించి పార్టీ అభ్యర్థులకు అందించారు. అయినా ఎన్నికల్లో గెలవడానికి ఆస్తులు అమ్ముకున్న వారిలా కొంత మంది ఇలా బరితెగించడం ఎందుకు? శాసనసభ్యులకు అపరిమిత అధికారాలు కల్పిస్తూ రావడం వల్లనే ప్రస్తుత దుస్థితి. ప్రభుత్వ కార్యాలయాల రోజువారీ కార్యక్రమాలతో ఎమ్మెల్యేలకు ఏం పని? అధికారులు స్వేచ్ఛగా తమ విధులను నిర్వర్తించే వెసులుబాటు కల్పించాలి కదా? ప్రభుత్వం వేరు– ఎమ్మెల్యే వేరు. అధికార కూటమికి చెందిన వారైనంత మాత్రాన శాసనసభ్యులు చెప్పినంత మాత్రాన అధికారులు, పోలీసులు నడుచుకోవాలని ఏ చట్టంలో ఉంది? చట్టాలు, నిబంధనల అమలు బాధ్యత అధికారులదే! ఎమ్మెల్యే చెప్పారని తప్పు చేసిన అధికారికి మినహాయింపు ఉంటుందా? శాసనసభ్యులు కూడా తాము కేవలం ఐదేళ్ల కాలానికే ఎన్నికయ్యామన్న వాస్తవాన్ని విస్మరించి తమ అధికారం శాశ్వతమని ఎందుకు విర్రవీగుతున్నారో అర్థం కావడం లేదు. అధికారం శాశ్వతం కాదని తెలిసి కూడా వల్లమాలిన అధికారదర్పాన్ని ఒలకబోస్తే రేపటి పరిస్థితి ఏమిటి అన్నది తెలుసుకోవాలి కదా?**

ఎమ్మెల్యేపై కేసు నమోదు చేశారే కానీ అరెస్టు చేయలేదు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఒక ఎమ్మెల్యే భర్త ఆగడాలు శ్రుతి మించాయని నివేదికలు అందుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తరఫున చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు తమ నియోజకవర్గాల్లో అమలు కావాలన్నా కూడా తమను సంతృప్తిపరచాలని కొందరు ఎమ్మెల్యేలు మొరాయిస్తున్నారు. పై నుంచి ఫోన్ చేసి చెప్పినా వారు పట్టు వీడటం లేదు. పలు వురు శాసనసభ్యులు కట్టు తప్పుతున్నారని తెలిసినా ముఖ్య మంత్రి చంద్రబాబు మెతక వైఖరి ఎందుకు ప్రదర్శిస్తున్నా రన్నదే ఇప్పుడు ప్రశ్న. కూటమి ప్రభుత్వానికి శాసనసభలో తిరుగులేని మెజారిటీ ఉంది. పాతిక మంది ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకున్నా వచ్చే నష్టం ఏమీ లేదు. ఈ విషయంలో ప్రజల తప్పేమీ లేదు. వారు కూటమి ప్రభుత్వానికి అఖండ మెజారిటీ కట్టబెట్టి సుస్థిర ప్రభుత్వాన్ని అందివ్వాలని ఆశీర్వ దించారు. అయినా పరిస్థితిలో మార్పు రాకపోవడానికి కారణం ఏమిటి? మా వాళ్లను అదుపు చేయడానికి ఏం చేయాలో అర్థం కావడం లేదని కూటమికి చెందిన ఒక ఎమ్మెల్యే వాపోయారు. గతంలో నక్సలైట్ల ప్రభావం అధికంగా ఉన్నప్పుడు శాసనసభ్యులు బాధ్యతగా ఉండేవారు. వారిలో భయం ఉండేది. ఇప్పుడు నక్సలైట్ల భయం లేకపోవడంతో బరి తెగిస్తున్నారు. కొన్ని ఉదంతాలు వింటుంటే మళ్లీ నక్సలైట్లు బలపడాలనిపిస్తోందని మరో సీనియర్ ఎమ్మెల్యే చెప్పుకొచ్చా రంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. నిజానికి శాసనసభ్యు లను కట్టడి చేయడం అంత కష్టమేమీ కాదు. అధికారం అండ చూసుకొనే కదా వారు రెచ్చిపోతున్నారు? ఆ అధికారాన్ని వారికి దూరం చేస్తే దారిలోకి వస్తారు కదా? ఇటీవలి కాలంలో మరీ బరితెగించిన శాసనసభ్యులు ఎవరో ముఖ్య మంత్రికి సమాచారం లేకపోలేదు. అలాంటి వారిని అదుపు చేయడానికి ఒకటే మార్గం ఉంది. బరితెగించిన వారి జాబితా రూపొందించి జిల్లా కలెక్టర్, ఎస్పీలకు ఫోన్ చేసి ఫలానా ఎమ్మెల్యే ఆదేశాలను పట్టించుకోవద్దని చెబితే దారికి వస్తారు కదా? నియోజకవర్గాలలో ఎమ్మెల్యే మాట చెల్లుబాటు కాకపోతే వారి పరిస్థితి నీటిలో నుంచి బయటపడిన చేపలా తయారవదా? ఈ చిన్న లాజిక్‌ను చంద్రబాబు ఎందుకు పట్టించుకోవడం లేదో తెలియడం లేదు. ఇటు తెలంగాణలో, అటు ఆంధ్రప్రదేశ్‌లో ఎమ్మెల్యేలను కట్టడి చేయకుండా దోచు కోవడానికి అనుమతించిన కేసీఆర్, జగన్‌రెడ్డికి ఏ దుస్థితి పట్టిందో చూస్తున్నారు కదా!



దండోపాయమే మందు!

ఈ సందర్భంగా మహాభారతంలోని ధృతరాష్ట్రుడి పాత్ర గురించి చెప్పుకొందాం. ధృతరాష్ట్రుడికి పాండవుల మీద ప్రేమ ఉండేది. తమ్ముడి పిల్లలకు న్యాయం చేయాలని కోరుకొనే వారు. అయితే నిండు సభలో పాండవులకు అన్యాయం జరి గిన సందర్భాలలో కూడా కుమారులైన కౌరవులను కట్టడి చేయలేక మౌనంగా ఉండేవారు. ద్రౌపది వస్త్రాపహరణం సమయంలో కూడా ధృతరాష్ట్రుడు మౌనంగా ఉండిపోయారు. అన్యాయాన్ని నిలువరించే ప్రయత్నం చేయలేదు. ఫలితంగా మహాభారత సంగ్రామం జరిగి కౌరవులు అందరూ హత మయ్యారు. కురు సామ్రాజ్యం అంతరించి పోయింది. అలా అని ధృతరాష్ట్రుడు మంచివాడు కాదని చెప్పలేం. చెడును, అన్యాయాన్ని నిలువరించని వారు ఫలితం అనుభవిస్తారని చెప్పడానికి మహాభారతంలో ఈ ఉదంతాలను పేర్కొని ఉంటారు. వర్తమానంలోకి వస్తే, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు మరో ధృతరాష్ట్రుడిగా మిగిలిపోకూడదు. శాసన సభ్యుల పోకడలను అదుపుచేయని పక్షంలో వచ్చే ఎన్నికల్లో కౌరవులకు పట్టిన గతే కూటమి సభ్యులకు పట్టదా? మనం ప్రజాస్వామ్యంలో ఉన్నాం కనుక యుద్ధం బదులు ఎన్నికలు జరుగుతాయి. ప్రజాభిమానం కోల్పోయిన వారందరూ ఓడిపోతారు. రాష్ట్రాన్ని ఒడ్డున పడేయగలరని ఆయన మీద ప్రజలకు నమ్మకం ఉంది. ప్రజల్లో ఉన్న ఈ నమ్మకం కొనసాగాలంటే దారి తప్పిన శాసనసభ్యులను వెంటనే దారిలో పెట్టడానికి చంద్రబాబు కొరడా ఝుళిపించాలి. మంచి తనం, మెతక వైఖరి అన్ని వేళలా మంచివి కావు. నచ్చజెప్ప డానికి చేసిన ప్రయత్నాలు ఫలించనప్పుడు భయపెట్టడం ఒక్కటే మార్గం. నిజానికి కొద్ది మంది మినహా మెజారిటీ ఎమ్మెల్యేలకు ఎన్నికల సమయంలో పార్టీ పరంగానే ఆర్థిక సహాయం అందింది. చంద్రబాబుపై నమ్మకంతో ఎంతో మంది పార్టీ ఫండ్ ఇచ్చారు. ఆయన కూడా పలువురిని ఒప్పించి, మెప్పించి నిధులు సేకరించి పార్టీ అభ్యర్థులకు అందించారు. అయినా ఎన్నికల్లో గెలవడానికి ఆస్తులు అమ్ముకున్న వారిలా కొంత మంది ఇలా బరితెగించడం ఎందుకు? శాసనసభ్యులకు అపరిమిత అధికారాలు కల్పిస్తూ రావడం వల్లనే ప్రస్తుత దుస్థితి. ప్రభుత్వ కార్యాలయాల రోజు వారీ కార్యక్రమాలతో ఎమ్మెల్యేలకు ఏం పని? అధికారులు స్వేచ్ఛగా తమ విధులను నిర్వర్తించే వెసులుబాటు కల్పిం చాలి కదా? ప్రభుత్వం వేరు– ఎమ్మెల్యే వేరు. అధికార కూట మికి చెందిన వారైనంత మాత్రాన శాసనసభ్యులు చెప్పినంత మాత్రాన అధికారులు, పోలీసులు నడుచుకోవాలని ఏ చట్టంలో ఉంది? చట్టాలు, నిబంధనల అమలు బాధ్యత అధికారులదే! ఎమ్మెల్యే చెప్పారని తప్పు చేసిన అధికారికి మినహాయింపు ఉంటుందా? శాసనసభ్యులు కూడా తాము కేవలం ఐదేళ్ల కాలానికే ఎన్నికయ్యామన్న వాస్తవాన్ని విస్మరించి తమ అధికారం శాశ్వతమని ఎందుకు విర్రవీగు తున్నారో అర్థం కావడం లేదు. అధికారం శాశ్వతం కాదని తెలిసి కూడా వల్లమాలిన అధికారదర్పాన్ని ఒలకబోస్తే రేపటి పరిస్థితి ఏమిటి అన్నది తెలుసుకోవాలి కదా? తప్పు చేస్తున్న వారిని దారిలోకి తెచ్చుకోవడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నయానో భయానో చేసిన, చేస్తున్న ప్రయత్నాలు ఫలించ నందున ఇక మిగిలింది దండోపాయమే. హద్దు మీరుతున్న ఎమ్మెల్యేలను బ్లాక్ లిస్టులో పెట్టి వారిని ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకోకపోతే అందరూ దారిలోకి వస్తారు. తమది మంచి ప్రభుత్వమే కాదు– బలమైన, దృఢమైన ప్రభుత్వమని ప్రజల్లో నమ్మకం కలిగించాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి చంద్రబాబుదే!

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

అపూర్వ ఆధునిక దేవాలయం

తెలంగాణలో మొట్టమొదటి ప్రైవేటు తెలుగు గ్రంథాలయం – శ్రీకృష్ణదేవ రాయ తెలుగుభాషా నిలయం ఈ ఏడాది సెప్టెంబర్ 1వ తేదీతో 125వ సంవత్సరంలోకి ప్రవేశిస్తున్నది. ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకొని భాషానిలయం ఒకరోజు వేడుకలను ప్రాంగణంలో ఘనంగా నిర్వహించాలని నిలయం సంకల్పించింది. నిజానికి ఈ శ్రీకృష్ణదేవరాయ తెలుగుభాషా నిలయం తరతరాల తెలుగుజాతి వైభవానికి మచ్చుతునక. పేరుకు గ్రంథాలయం కానీ, తెలుగువారికి ఒక కూడలి స్థానంగా అవతరించిన ఒక అపూర్వ ఆధునిక దేవాలయం, ఒక సార్వత్రిక విశ్వవిద్యాలయమిది.

ఇప్పటికి 125 సంవత్సరాల క్రితం తెలుగువారిలో నూతన చైతన్యాన్ని తీసుకువస్తూ ఒకవంక జాతీయోద్యమానికి, మరోవంక గ్రంథాలయ ఉద్య మానికి నమూనాగా దీనిని ఆనాటి పెద్దలు తీర్చిదిద్దినారు. ఈ సంస్థను ఒక గ్రంథాలయంగా నడుపుతూ తెలుగు పుస్తకాలు చదివే అలవాటును జన సామాన్యంలో వృద్ధి చేశారు.


ఉత్తేజితులైన తెలుగువారు ఇక్కడే ప్రథమ నిజాం ఆంధ్రోద్యమానికి శ్రీకారం చుట్టారు. ఈ భాషా నిలయాన్ని కేంద్రస్థానంగా చేసుకొని ఆనాటి యువకులు ఇక్కడ ఎన్నో సంస్థలు నెలకొల్పారు, ఎన్నో ఉద్యమాలు నడిపారు. భాషా నిలయానికి అనుబంధంగా ఒక తెలుగు పాఠశాల కూడా నెలకొల్పి కొన్నాళ్లు జయప్రదంగా నడిపారు. తాను స్వయంగా సంస్కృతాంధ్ర భాషలలో పాండిత్యం కలిగి ఉండటమే కాకుండా తరతరాలకు కరదీపికలైన మహాకావ్యా లకు శ్రీకారం చుట్టిన అష్టదిగ్గజాలైన మహాకవులకు నెలవైన శ్రీకృష్ణదేవరాయల కాలాన్ని స్వర్ణయుగమని ముందుతరాలు మరచిపోకుండా ఉండాలనే తలం పుతో శ్రీకృష్ణదేవరాయల పేరున ఈ భాషా నిలయం స్థాపించినట్లు స్థాపకు లలో ముఖ్యులు, తొలి నలభై సంవత్సరాలు భాషా నిలయం అధ్యక్షులుగా సేవలందించిన పోషకులు రాజా నాయని వెంకటరంగారావు 1952లో భాషానిలయం స్వర్ణోత్సవాల సందర్భంగా తెలిపారు. స్వర్ణోత్సవ స్వాగత సమితి అధ్యక్షులుగా వారు చేసిన ప్రసంగంలో "అప్పుడే మార్కెట్‌లోకి తాజాగా వచ్చిన రాబర్ట్ స్టీవెల్ రాసిన 'ఫర్‌గాటన్ ఎంపైర్' గ్రంథంలో శ్రీకృష్ణ దేవరాయల శౌర్యప్రతాపాలు, రాజనీతి ధురంధ రత్వం తనను, తన మిత్రులు కొమర్రాజు వెంకట లక్ష్మణరావులను ఎంతగానో ఆకర్షించాయని, సంస్కృతాంధ్రభాషల వికాసానికి రాయలవారు చేసిన సేవలు తమను తన్మయులను చేసిన ఫలితంగా ఆ ఆంధ్రభోజుని అజరామరుణ్ణి చేయడా నికి, ఆంధ్రభాషకు తొంటివికాసము సాధించడానికి శ్రీకృష్ణదేవరాయ ఆంధ్రభాషా నిలయంను స్థాపించి" నట్లు వివరించారు.



ఈ భాషా నిలయం స్థాపించిన రాజా నాయని వెంకటరంగారావు, కొమర్రాజు వెంకట లక్ష్మణరావు, రావిచెట్టు రంగారావులకు తోడుగా ఆదిపూడి సోమనాథరావు, మైలవరపు నరసింహశాస్త్రి నిలిచారు. ఆ తరువాత కాలంలో హైదరాబాద్ రాష్ట్ర తొలి ప్రజా ముఖ్యమంత్రిగా పనిచేసిన సాహితీవేత్త బూర్గుల రామకృష్ణరావు చేయూత కూడా ఈ భాషా నిలయానికి లభించింది. వీరు భాషా నిలయానికి అధ్యక్షులుగా మూడుసార్లు, కార్యదర్శిగా ఒకసారి సేవలు అందించారు. పోలీసు యాక్షన్‌కు ముందు 1940 నుంచి కీలక సమయంలో హైదరాబాద్ నగర కొత్వాలుగా పనిచేసిన రాజా బహద్దూర్ వెంకటరామారెడ్డి ఈ భాషా నిలయానికి పదేళ్ల పాటు అధ్యక్షులుగా ఉన్నారు. ఆంధ్ర పితామహ మాడపాటి హనుమంతరావు, ఆదిరాజు వీరభద్ర రావు మొదలగువారు కార్యదర్శులుగా ఈ సంస్థ ప్రగతికి ఎంతగానో పాటుపడ్డారు. రావిచెట్టు రంగారావు 1901 నుంచి దాదాపు పదేళ్ల పాటు భాషా నిలయం కార్యదర్శిగా పనిచేసి 1910లో ఆకస్మికంగా పరమపదించారు. శ్రీకృష్ణదేవరాయ తెలుగుభాషా నిలయం కలకాలం నిలవాలని కాంక్షిస్తూ, నిలయానికి సొంతభవనం కోసం భూమి కొనుగోలుకు రావిచెట్టు రంగారావు ధర్మపత్ని శ్రీమతి లక్ష్మీనరసమ్మ తన భర్త స్మృత్యర్థం 1911లో రూ. 3,000 విరాళంగా ఇచ్చారు. ఆ సొమ్ముతోనే ఇప్పుడు భాషానిలయం ఉన్నచోట పెంకుటిల్లు కొని, కొన్ని మార్పులు చేసి గ్రంథాలయాన్ని నెలకొల్పారు. 1915లో మాడపాటి హనుమంతరావు భాషా నిలయం కార్యదర్శిగా ఉన్న తరుణంలో అంతకు ముందు గల భవనం తొలిదశకు విఖ్యాత ఆంధ్ర ప్రముఖుడు, విద్యావేత్త కట్టమంచి రామలింగారెడ్డి ప్రారంభోత్సవం చేశారు. ఆనాటి నుంచి దినదిన ప్రవర్ధమానమై నగరం నడిబొడ్డున ఉన్న ఈ భాషా నిలయం అనేకమంది సాహితీప్రియులను ఆకర్షిస్తూ తెలుగువారి సమగ్రతను కాపాడుతూ ఎంతో వైవిధ్యమైన, స్ఫూర్తిదాయకమైన కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. ఈ సంస్థను దర్శించని ఆంధ్రప్రముఖులు లేరనవచ్చును.

శ్రీకృష్ణదేవరాయ తెలుగుభాషా నిలయం "125వ స్థాపన దినోత్సవ సంద ర్భంగా భాషా నిలయం భవన నిర్మాణానికి నూట పదేళ్ల క్రితం భారీ విరాళం ఇచ్చిన ప్రథమదాత, భాషా నిలయం తొలి కార్యదర్శి రావిచెట్టు రంగారావు సతీమణి పేరున ప్రతి ఏటా ప్రదానం చేస్తున్న 'శ్రీమతి రావిచెట్టు లక్ష్మీనర సమ్మ స్మారక పురస్కారం – 2025' హైదరాబాద్ బుక్ ట్రస్ట్‌కు చెందిన శ్రీమతి గీతారామస్వామికి తెలంగాణ శాసనమండలి అధ్యక్షులు గుత్తా సుఖేందర్ రెడ్డి సెప్టెంబర్ 1న ప్రదానం చేస్తారు. సాయంత్రం 6:15 గం.లకు భాషా నిలయం లోని రావిచెట్టు రంగారావు సభా నిలయంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి భాషా నిలయం అధ్యక్షులు డా. కె.వి. రమణాచారి అధ్యక్షత వహిస్తారు. ఈ సందర్భంగా భాషానిలయం పురోభివృద్ధికి కృషిచేసిన కురువృద్ధులు, 90ఏళ్లు దాటిన ప్రముఖులు – నూతి శంకరరావు, కె. చంద్రప్రకాశరావు, ఎ.వి. జనార్ధన్‌రావులను శాసనమండలి అధ్యక్షులు సత్కరిస్తారు. 'భాగ్యనగరం భాషా నిలయం' సాహిత్యరూపకాన్ని 'భువనవిజయం' ఫక్కీలో ప్రయోగాత్మ కంగా ప్రదర్శించనున్నారు. 125వ స్థాపన దినోత్సవం సందర్భంగా "పౌర గ్రంథాలయాలు – నాడు, నేడు" అనే అంశంపై గ్రంథాలయ సదస్సును భాషానిలయం నిర్వహించనున్నది. 'తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్' అధ్యక్షులు డా. రియాజ్ ముఖ్య అతిథిగా విచ్చేసి ఈ సదస్సును ప్రారం భిస్తారు. ప్రొ. ఎస్. సుదర్శన్‌రావు కీలకోపన్యాసం చేస్తారు.

◆ **టి. ఉడయవర్లు**
గౌరవ కార్యదర్శి
శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం





డ్రగ్స్‌తో వీకెండ్ జల్సాలు

- పార్టీల పేరుతో చాటుగా విక్రయాలు
- సైబరాబాద్ ఐటీ కారిడార్ అడ్డాగా ఆశ్రయం
- ఆటకట్టిస్తున్న ఎక్సైజ్, నార్కోటిక్ పోలీసులు
- అయినా.. వరుసగా వెలుగులోకి డ్రగ్స్ పార్టీలు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఇతర రాష్ట్రాల నుంచి గుట్టుగా వస్తారు.. ఎవరికంటా పడకుండా మాదకద్రవ్యాలను వెంట తెస్తారు. వీకెండ్ పేరిట జల్సాలు చేస్తారు. కస్టమర్లకు చాటుగా మాదక ద్రవ్యాలను విక్రయించి వెళ్లిపోతారు. ఇదీ ప్రతీ వీకెండ్‌లో జరుగుతున్న తంతు. హైదరాబాద్ నగరాన్ని అడ్డాగా చేసుకుని వీరు చేస్తున్న అక్రమ దందాకు ఫుల్‌స్టాప్ పెట్టేందుకు పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నా వీరి ఆగడాలు ఇంకా వెలుగుచూస్తూనే ఉన్నాయి. ఒకవైపు తెలంగాణ పోలీసులు డ్రగ్స్, గంజాయి వంటి మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపుతుంటే.. మరోవైపు ఇతర రాష్ట్రాలకు చెందిన కొన్ని ముఠాలు నగరాన్ని డ్రగ్స్ పార్టీలకు కేరాఫ్ అడ్రస్‌గా మార్చుకుంటున్నాయి. కొంతమంది వీకెండ్ జల్సాలు, పుట్టినరోజు వేడుకల పేరుతో నగరానికి వస్తున్నారు. సైబరాబాద్ ఐటీ కారిడార్‌లో గుట్టుగా వసతి గృహాల్లో, అపార్టుమెంట్స్, హోటల్స్‌లో దిగుతూ పార్టీలు నిర్వహించి మాదక ద్రవ్యాల మత్తులో మునిగి తేలుతున్నారు. మరికొంతమంది గుట్టుగా తరలించిన డ్రగ్స్‌ను విక్రయించి సొమ్ము చేసుకొని ఉడాయిస్తున్నారు. వీటిపై గట్టి నిఘా పెట్టిన నగర పోలీసులు, ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేస్తూ వారిని కటకటాల వెనక్కు నెడుతున్నారు. ఇలాంటి రేవ్‌పార్టీలు, బర్త్‌డే పార్టీలు వరుసగా వెలుగులోకి వస్తుండడంతో హైదరాబాద్ నార్కోటిక్, ఎక్సైజ్, ఈగల్ టీమ్‌లు మరింత అప్రమత్తమయ్యాయి. ఇటీవల వెలుగులోకి వచ్చిన కొన్ని వరుస ఘటనలిలా ఉన్నాయి.

కళాశాలకు చేరిన డ్రగ్స్

రెండు రోజుల క్రితం దుండిగల్ పరిధిలోని ఓ యూనివర్సిటీలో డ్రగ్స్ కలకలం రేపింది. హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులు కొందరు కొరియర్ ద్వారా డ్రగ్స్ తెప్పించుకుని పార్టీలు చేసుకుంటున్నారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న ఈగల్ టీమ్ దాడిచేసి వారిపై ఉక్కుపాదం మోపింది. సుమారు 50 మందిని అదుపులోకి తీసుకుంది. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా

మిగతా 6వ పేజీలో..

నేరచరిత్ర తెలుసుకోవాలి



నగరంలో ఉన్న హాస్టళ్లు, ప్రైవేట్ వసతి గృహాలు, అపార్టుమెంట్స్‌లో చేరేందుకు వచ్చే వారి పూర్తి వివరాలు తెలుసుకున్నాకే ఆశ్రయమివ్వాలి. కొందరు నేరస్థులు మాదక ద్రవ్యాలను సరఫరా చేయడానికి, ఇతర ప్రాంతాల నుంచి వచ్చి పార్టీలు, జల్సాలు చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. మరికొందరు నేరాలకు పాల్పడుతూ ఉడాయిస్తున్నారు. ఆశ్రయం కల్పించే ముందు వారి వివరాలు, గుర్తింపు కార్డులు క్షుణ్ణంగా తెలుసుకున్నాకే ఆశ్రయమివ్వాలి.

- వినీత్, డీసీపీ, మాదాపూర్, సైబరాబాద్



భారీ గణపతి వద్ద కిక్కిరిసిన భక్తులు

బడా గణేశ్ దర్శనానికి పోటెత్తిన భక్తజనం

కిక్కిరిసిన ఖైరతాబాద్ పరిసరాలు.. భారీగా ట్రాఫిక్ జాం

ఖైరతాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్‌లోని విశ్వశాంతి మహాశక్తి గణపతిని దర్శించుకునేందుకు శనివారం భక్తజనం పోటెత్తారు. భారీగా భక్తులు రావడంతో ఖైరతాబాద్ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. తెల్లవారుజామునుంచే భక్తులు పెద్దసంఖ్యలో తరలి రావడంతో 3 క్యూలను బ్రేక్ చేసి శీఘ్ర దర్శనాలు చేయించారు. భక్తులను అదుపు చేయడంలో పోలీసులు ఇబ్బందులు పడ్డారు.

ట్రాఫిక్ జామ్..

బడా గణేశ్ వద్దకు పెద్ద ఎత్తున భక్తులు తరలి రావడంతో ఖైరతాబాద్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ చిక్కులు ఎదురయ్యాయి. ఎంఎంటీఎస్, మెట్రో రైళ్లలో ఎక్కేవారు, దిగేవారితో స్టేషన్లు కిటకిటలాడాయి. వాహనాలను రోడ్లపై పార్కుచేసి భక్తులు దర్శనాలకు వెళ్లడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోడ్లపైనే వేలాది మంది భక్తులు సంచరించడంతో వాహనదారులు ఎటు వెళ్లాలో తెలియక గందరగోళానికి గురవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయాలు కలిగాయి. దీని ప్రభావం ఖైరతాబాద్‌తో పాటు

మిగతా 6వ పేజీలో..

సీఆర్ఎంపీ రెండో దశకు చకచకా..

రూ. 2,828 కోట్ల వ్యయంతో 1142.54 కి.మీ. పనులకు ప్రతిపాదన

- చార్మినార్ పాత బస్టాండ్ వద్ద మల్టీ లెవెల్ పార్కింగ్
- ఆమోదం పలికిన జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ



స్టాండింగ్ కమిటీ సమావేశంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ ఆర్.వి.కర్ణన్, స్టాండింగ్ కమిటీ సభ్యులు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : కాంప్రెహెన్సివ్ రోడ్డు మొబిలిటీ ప్లాన్ (సీఆర్ఎంపీ) రెండో దశలో భాగంగా ఐదేళ్ల వరకు పాత నియమనిబంధనలతో జోన్ల వారీగా ప్యాకేజీని చేపట్టేందుకు జీహెచ్ఎంసీ చకాచకా పావులు కదుపుతోంది. ఈ మేరకు 1142.54 కిలోమీటర్లు రోడ్డు అభివృద్ధి పనులకు గాను రూ.2,828 కోట్ల వ్యయంతో (2025-2030 వరకు) పెండింగ్ అప్రూవల్‌తో ప్రభుత్వానికి సిఫారసు చేసేందుకు అంచనా వ్యయాన్ని రివైజ్డ్ చేశారు. దీనికి ప్రభుత్వ మంజూరు కోరుతూ శనివారం జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. అదేవిధంగా చార్మినార్ జోన్‌లోని చార్మినార్ పాతబస్టాండ్ వద్ద మల్టీ లెవల్ పార్కింగ్ నిర్మాణానికి జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఆమోదం పలికింది. డిజైన్, బిల్డ్, ఫైనాన్స్ ఆపరేషన్ అండ్ ట్రాన్స్‌ఫర్ (డీబీఎఫ్ఓటీ) బేసిస్ ప్రకారంగా 15 ఏళ్లు, ఆ తర్వాత మరో 5 ఏళ్లపాటు పెర్ఫార్మెన్స్ కండిషన్ ప్రకారంగా పెంచేందుకు అనుమతించింది. అలాగే ఎల్‌బీనగర్, హయత్‌నగర్ సర్కిల్ వార్డు నంబరు-11లో కుమ్మరికుంట చెరువునుంచి రాఘవేంద్ర కాలనీ బస్ డిపో వరకు రూ.6 కోట్లతో చేపట్టే బాక్స్ డ్రెయిన్ నిర్మాణానికి టెండర్ పిలిచేందుకు పరిపాలనా అనుమతికి కమిటీ ఆమోదం తెలిపింది. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన శనివారం స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో కమిషనర్ ఆర్వీ కర్ణన్, స్టాండింగ్ కమిటీ సభ్యులు బొంతు శ్రీదేవి, బానోతు సుజాత, సయ్యద్ మిన్హాజుద్దీన్, సమీనా బేగం, అబ్దుల్ వాహెబ్, పర్వీన్ సుల్తానా, ఆయేషా హుమేరా, మహ్మద్ సలీం, మహాలక్ష్మి రామన్‌గౌడ్, సీఎన్.రెడ్డి, మహమ్మద్ గౌస్ ఉద్దీన్, వి.జగదీశ్వర్‌గౌడ్, బూరగడ్డ పుష్ప పాల్గొన్నారు. కాగా, సమావేశంలో మొత్తం 9 అంశాలు, 4 టేబుల్ ఐటమ్‌లకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు.



హయత్‌నగర్/బోయినపల్లి/కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నగరంలో శనివారం వినాయక నిమజ్జనం సందడి నెలకొంది. భక్తులు వినాయక విగ్రహాలను కొలనుల్లో నిమజ్జనం చేశారు. వనస్థలిపురం, బీఎన్‌రెడ్డి నగర్, హస్తినాపురం తదితర ప్రాంతాల్లో శనివారం ఒక్కరోజే 600 విగ్రహాల వరకు నిమజ్జనం జరిగింది. బోయినపల్లి, కూకట్‌పల్లిల్లోనూ నిమజ్జనాలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు ఊరేగింపు నిర్వహించారు.

సాఫీగా జరగాలి: కర్ణన్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గణేశ్ నిమజ్జనాలు సురక్షితంగా, సాఫీగా జరిగేలా చూడాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ అధికారులకు సూచించారు. ప్రభుత్వ శాఖల అధికారులతో కలిసి శనివారం సనత్‌నగర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ వద్ద తవ్విన కుంట, నెక్లెస్‌రోడ్ పీపుల్స్‌ప్లాజా బేబీ పాండ్, అమీర్‌పేట్, నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన పోర్టబుల్ పాండ్లు, వాటి నాణ్యతను పరిశీలించారు. నిమజ్జనం సాఫీగా పూర్తి చేసేందుకు 134 స్టాటిక్ క్రేన్లు, అదనంగా 269 మొబైల్ క్రేన్లు వినియోగిస్తునట్లు పేర్కొన్నారు. నిమజ్జనాలు పూర్తయ్యేవరకు 160 గణేష్ అసిస్టెన్స్ టీంలు పనిచేస్తాయన్నారు.



ఆర్థిక ఇబ్బందులతో దంపతుల ఆత్మహత్యాయత్నం



రామకృష్ణారెడ్డి (ఫైల్)



రమ్యకృష్ణ

- భర్తను కత్తితో పొడిచిన భార్య
- భర్త మృతి.. తర్వాత ఆమె ఆత్మహత్యాయత్నం
- 24 గంటల తర్వాత వెలుగులోకి
- పోలీసులకు బంధువులు, ఇంటి యజమాని ఫిర్యాదు
- కత్తితో పొడిచి చంపడంపై అనుమానాలు

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో దంపతులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. మొదట భర్తను కత్తితో పొడిచిన భార్య తర్వాత తానూ పొడుచుకోవాలని పథకం పన్నారు. ఆ మేరకు అమలు చేశారు. అయితే, ఈ ఘటనలో భర్త చనిపోగా.. భార్య గాయాలతో బయటపడింది. 24గంటల తర్వాత వెలుగుచూసిన ఈ ఘటన కేపీహెచ్‌బీ కాలనీలో తీవ్ర కలకలం రేపింది. కేపీహెచ్‌బీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా ఈర్లపాలెంకు చెందిన రామకృష్ణారెడ్డి (45), రమ్యకృష్ణ (38) రెండేళ్లుగా కేపీహెచ్‌బీ ఆరోఫేజ్‌లోని హెచ్ఐజీ-193 ఏఎంఆర్

మిగతా 6వ పేజీలో..

సీఎస్‌సీలో అవినీతిపై దర్యాప్తు

ఫైళ్లను పరిశీలించిన అధికారులు

2009 నుంచి 2023 వరకు ఫైల్స్ మాయం



సీఎస్‌సీకి సంబంధించిన ఫైల్స్ ఇవే

చందానగర్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): చందానగర్ జీహెచ్ఎంసీ సిటిజన్ సర్వీస్‌లో జరిగిన అవినీతి దందాపై దర్యాప్తు కొనసాగుతోంది. ఇక్కడి పౌరసేవా కేంద్రంలో సూపర్ స్ట్రక్చర్ పన్ను పేరిట వసూలు చేసిన నగదును ఆపరేటర్ వాడుకున్న విషయం బయటపడింది. దీంతో అధికారులు రంగంలోకి దిగారు. శనివారం 2024-25కు చెందిన అకౌంట్‌ను గ్రేటర్ ప్రధాన కార్యాలయం నుంచి వచ్చిన అసిస్టెంట్ ఆఫ్ ఎగ్జామినర్ పరిశీలించారు. వాస్తవానికి గురువారమే ఎగ్జామినర్స్ పరిశీలనకు వచ్చారు. అయితే, ఆ రోజు సూపర్ స్ట్రక్చర్‌కు సంబంధించిన ఫైల్స్ అందుబాటులో లేవు. దీనికి తోడు సిటిజన్ సర్వీస్ సెంటర్ ఆపరేటర్ కార్యాలయానికి రాలేదు. దీంతో ఫైల్స్ ఎక్కడ ఉన్నాయో సిబ్బందికి తెలియలేదు. చివరకు గురువారం సాయంత్రం వాటి ఆచూకీ లభించింది. దీంతో ఆ ఫైల్స్‌ను ఎగ్జామినర్లకు అధికారులు అందజేశారు. వారు ఈ ఆర్థిక సంవత్సరంలో జరిగిన వ్యవహారాలకు సంబంధించి ఎంతమంది నగదు చెల్లించారు.? రాష్ట్ర ఖజానాకు చెక్కులు, డీడీ ద్వారా ఎంత చెల్లించారు అనే విషయాలను పరిశీలించారు. అదేవిధంగా గతంలో జీహెచ్ఎంసీలో ప్రతి మూడు, ఆరు నెలలు, సంవత్సరానికి ఒకసారి ఏజీ ఆడిట్ చేసిన ఫైల్స్‌ను కూడా జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం నుంచి వచ్చిన అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ వ్యవహారం కొలిక్కి వచ్చేందుకు రెండు, మూడు రోజులు పట్టే అవకాశముందని భావిస్తున్నారు. అయితే, 2009 నుంచి 2023 వరకున్న ఫైళ్లు కూడా మాయమైనట్టు సమాచారం.


వెరైటీ గణేశా..

బెలూన్ గణపతి



మణికొండ చిత్రపురి కాలనీలో సంక్షేమ సంఘం అధ్యక్షుడు అనిల్‌కుమార్ ఏర్పాటు చేసిన బెలూన్ గణపతి

లేజర్ లైట్ గణనాథుడు



వారాసిగూడలో నేతాజీ షాప్, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లేజర్ లైట్ గణనాథుడు

సింధూర అలంకరణలో..



సికింద్రాబాద్ గణేష్ టెంపుల్‌లో సింధూరాలంకారంలో స్వామివారి మూల విరాట్టు

కృష్ణావతార గణేశ్



దిల్‌సుఖ్‌నగర్‌లో విశేషంగా ఆకట్టుకుంటున్న శ్రీ గణేష్ వర్ధన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన శ్రీకృష్ణావతారం గణపతి

- ఫొటోలు : ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్


ఆరుద్ర శత జయంతి




(31 ఆగస్ట్ 1925 - 4 జూన్ 1998)

సాంప్రదాయ తెలుగు సాహిత్యాన్ని సామాన్య పాఠకునికి అందించిన వ్యక్తి.
ప్రజల సంస్కృతిని పునఃఆవిష్కరించి, తెలుగు సాహిత్య చరిత్రను లిఖించిన వ్యక్తి.
పద్యం, పాట, ఆలోచనల ద్వారా తరాలకు స్వరమిచ్చిన వ్యక్తి.
అభ్యుదయ కవి, గేయరచయిత, పరిశోధకుడు, సాహిత్య సంస్కర్త మరియు సాంస్కృతిక చిహ్నంగా నిలిచిన ఆరుద్ర గారిని స్మరిస్తూ.







స్టడీ టూర్‌కు టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ

● వారం పాటు నార్వే, నెదర్లాండ్స్ దేశాల్లో పర్యటన

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా, నేషనల్ రిసోర్సెస్ డిఫెన్స్ కౌన్సిల్ నేతృత్వంలో స్టడీ టూర్‌లో టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ విదేశాలకు వెళ్లనున్నారు. జీరో ట్రాన్స్మిషన్ వెహికల్ పాలసీ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఇన్నోవేషన్ స్టడీలో భాగంగా పర్యటించే భారత బృందంలో ముషారఫ్ ఫారూఖీ కూడా ఉన్నారు. ఇందులో భాగంగా నార్వే, నెదర్లాండ్ దేశాల్లో రేపటి నుంచి వారం రోజులపాటు పర్యటించనున్నారు. ఈ పర్యటనలో సీఎండీతోపాటు సంస్థ డైరెక్టర్ శివాజీ, అడ్మినిస్ట్రేషన్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా ప్రతినిధులు ఉంటారు.







గణేశ్ మండపాల ఏర్పాటుతో హిందువుల్లో ఐక్యత

● కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి

పహాడిషరీఫ్ ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): గణేశ్ మండపాల ఏర్పాటుతో హిందువుల్లో ఐక్యత పెరుగుతుందని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. శనివారం ఆయన బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, నాయకులతో కలిసి బాలాపూర్ గణేశుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



ప్రహ్లాద్ జోషి, రాంచందర్‌రావుకు ప్రసాదం అందజేస్తున్న బాలాపూర్ గణేశ్ మండప నిర్వాహకులు

నిర్వాహకులు వారిని సన్మానించి ప్రసాదం అందజేశారు. దేశంలోని సంఘ విద్రోహులు మన ఐక్యతను దెబ్బతీస్తున్నారని అన్నారు. ఈ కుట్రలపై ఐక్యంగా ధర్మ పోరాటం చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు కొలన్ శంకర్‌రెడ్డి, అందెల శ్రీరాములు, టి.వీరేందర్‌గౌడ్, బాలాపూర్ గణేశ్ ఉత్సవ సమితి అధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బడా గణేశ్ దర్శనానికి పోటెత్తిన భక్తజనం

(5వ పేజీ తరువాయి)

లక్డీకాపూల్, మాసబ్‌ట్యాంక్, సైఫాబాద్, ఎన్టీఆర్ మార్గం, లిబర్టీ, సోమాజిగూడ, పంజాగుట్ట తదితర ప్రాంతాల వరకు పడింది.

ప్రముఖుల సందర్శన

బడా గణేశ్‌ను శనివారం హైకోర్టు న్యాయమూర్తి ఈవీ వేణుగోపాల్, ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి శ్రీదేవి, ఎంపీ డీకే అరుణ తదితరులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వీరితో పాటు అమెరికా కాన్సులేట్ జనరల్ ఆఫ్ హైదరాబాద్ లూరా విలియమ్స్‌తో పాటు కార్యాలయంలోని అమెరికా ప్రతినిధులు గణపతి వద్ద పూజలు చేసి ప్రసాదాలు పంపిణీ చేశారు. వీరిని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ జ్ఞాపికతో సత్కరించారు. విద్యుత్ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్, ఐఅండ్‌పీఆర్ స్పెషల్ కమిషనర్ ప్రియాంక, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ దంపతులు తదితరులు గణపతిని దర్శించుకున్నారు.

రేపు హెచ్‌పీఎస్‌లో ప్రవేశాలకు ఫైనల్ లాటరీ

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరాన్ని పురస్కరించుకుని బేగంపేట్, రామంతపూర్‌లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (హెచ్‌పీఎస్)లో ఒకటో తరగతిలో ప్రవేశాల కోసం రాష్ట్రస్థాయిలో లాటరీ తీసి ఫైనల్ ఎంపిక చేయనున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కోటాజీ ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 1న మధ్యాహ్నం 2.30గంటలకు లక్డీకపూల్‌లోని కలెక్టరేట్‌లో డ్రా తీస్తామని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన విద్యార్థులు రాష్ట్రస్థాయి లాటరీ కార్యక్రమానికి తప్పకుండా హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు.





డ్రగ్స్‌తో వీకెండ్ జల్సాలు..

(5వ పేజీ తరువాయి)

విద్యాసంస్థల్లో కలకలం రేపింది.

● **వీకెండ్ పార్టీ..**

కొద్దిరోజుల క్రితం ఐటీ కారిడార్‌లో డ్రగ్స్ పార్టీ నిర్వహిస్తున్న ఓ ముఠా ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడింది. ఏపీకి చెందిన అశోక్ నాయుడు, డ్రగ్ పెడ్లర్లు రాహుల్, ఇమ్మాన్యుయేల్‌లతో పాటు సాయి కృష్ణ, లీలామణికంఠ, జోసఫ్, శ్రీదత్త, కుమారస్వామి, సుమంత్, తేజ కలిసి వారాంతంలో పార్టీల పేరుతో నగరానికి వచ్చేవారు. మాదక ద్రవ్యాలను వినియోగిస్తూ మత్తులో మునిగితేలేవారు. ఓ స్నేహితుడి ద్వారా కారుపై ఎంపీ స్టిక్కర్ వేసుకొని దుర్వినియోగానికి పాల్పడేవారు. వీకెండ్ పార్టీలపై నిఘాపెట్టిన ఎక్సైజ్ పోలీసులు వీరందరూ మాదకద్రవ్యాలను వినియోగించినట్లు గుర్తించి అరెస్ట్ చేశారు.

డ్రగ్స్ అలవాటు చేస్తూ..

స్నేహితులను తరచూ పార్టీలకు పిలిచి డ్రగ్స్ అలవాటు చేసిన ఓ ముఠాను తెలంగాణ నార్కోటిక్ బ్యూరో పోలీసులు పట్టుకున్నారు. డ్రగ్స్ సరఫరాదారులు, వినియోగదారులు సహా.. మొత్తం ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీరిని విచారించగా రాజమండ్రి రెవెన్యూలో మండల స్థాయి పదవిలో కొనసాగుతున్న మణిదీప్ తరచూ పార్టీలకు ఆహ్వానిస్తూ డ్రగ్స్ అలవాటు చేసినట్లుగా తేలింది. వారికి బెంగళూరు నుంచి రాహుల్ డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. నగరంతో పాటు బెంగళూరు, గోవాలోని డ్రగ్స్ పెడ్లర్స్‌తో ఉన్న పరిచయాలు, లింకులు, నెట్‌వర్క్‌పై పోలీసులు ఆరా తీస్తున్నారు.

నైజీరియన్స్ డ్రగ్స్ పార్టీ..

ఇటీవల సైబరాబాద్ పరిధిలోని ఓ ఫామ్‌హౌజ్‌లో జరుగుతున్న డ్రగ్స్ బర్త్‌డే పార్టీపై పోలీసులు దాడి చేశారు. సుమారు 50మంది నైజీరియన్స్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఒకవైపు డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతుంటే.. మరోవైపు ఏకంగా నైజీరియన్లే హైదరాబాద్‌లో ఫామ్ హౌజ్ బుక్ చేసుకొని, డ్రగ్స్ పార్టీ నిర్వహించుకోవడం విస్మయానికి గురిచేసింది. అంటే.. నగరాన్ని తమ పార్టీలకు అడ్డాగా మార్చుకుంటున్నారని పోలీసులు విస్తుపోయారు.

ఆర్థిక ఇబ్బందులతో దంపతుల ఆత్మహత్యాయత్నం

(5వ పేజీ తరువాయి)

రెసిడెన్సీ జీ-2లో అద్దెకు ఉంటున్నారు. వీరికి 2007లో వివాహం కాగా సంతానం కలగలేదు. రమ్యకృష్ణ గృహిణి కాగా, రామకృష్ణారెడ్డి ఓ యూట్యూబ్ ఛానల్‌లో పనిచేస్తున్నాడు. గతంలో రామకృష్ణారెడ్డి రెస్టారెంట్, హోటల్ వంటి వ్యాపారాలు చేయగా వాటిల్లో తీవ్ర నష్టాలు చవిచూశారు. అప్పులు పెరిగిపోవడం, అప్పు ఇచ్చిన వారు డబ్బు కోసం ఇంటికి రావడాన్ని వారు తట్టుకోలేకపోయారు. దీంతో దంపతులు ఆత్మహత్య చేసుకోవాలనే నిర్ణయానికి వచ్చారు. మొదట అనుకున్నట్టుగా ఈనెల 29న రామకృష్ణారెడ్డిని రమ్యకృష్ణ కత్తితో పొడిచి తాను ఆత్మహత్యకు యత్నించింది. భర్తకు తీవ్ర రక్తస్రావమై మృతిచెందాడు. ఆమెకు కత్తిగాట్లు పడినప్పటికీ ప్రాణాపాయం కలగలేదు. 24 గంటల పాటు ఆమె ఇంట్లోనే ఉండిపోయింది. అయితే, నాలుగు రోజుల క్రితమే తామిద్దరం ఆత్మహత్య చేసుకోవాలని భావించామని, భర్తను తానే కత్తితో పొడిచానని, తాను ఆత్మహత్యకు యత్నించగా ధైర్యం సరిపోలేదని, చిన్నగాట్లతో బయటపడ్డానని బంధువులు, ఇంటి యజమానికి తెలిపింది. దీంతో వారు పోలీసులకు సమాచారమందించారు. ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు ఇంట్లోని పడకగదిలో రామకృష్ణ మృతదేహాన్ని, హాల్‌లో గాయాలతో ఉన్న రమ్యకృష్ణను గుర్తించారు. ఆమెను పోలీసులు విచారించగా తానే కత్తితో భర్తను పొడిచానని, రక్తస్రావంతో చనిపోయాడని చెప్పినట్లు తెలిసింది. చికిత్స నిమిత్తం ఆమెను ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. రామకృష్ణారెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

పలు అనుమానాలు..

అప్పుల బాధకు కత్తితో పొడుచుకుని చనిపోవాలని నిర్ణయించుకోవడం ఏమిటి? భర్త చనిపోయిన విషయాన్ని భార్య వెంటనే ఎందుకు చెప్పలేదు.? విషయం దాచడం వెనక మతలబు ఏమిటి, ఈ తరహాలో కూడా ఆత్మహత్యలు చేసుకుంటారా అని స్థానికంగా చర్చ జరుగుతోంది.

ప్రాథమిక సమాచారాన్ని బట్టి అప్పుల బాధ తట్టుకోలేక దంపతులు ఆత్మహత్య చేసుకోవాలని భావించినట్లు తెలుస్తోందని కూకట్‌పల్లి ఏసీపీ రవికిరణ్‌రెడ్డి తెలిపారు. అందులో భాగంగానే రమ్యకృష్ణ కత్తితో భర్తను పొడిచి, తర్వాత తనను తాను పొడుచుకుని ఉండవచ్చని, దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు.

పీఎం కిసాన్ యోజన పేరుతో రూ.7.50 లక్షలు స్వాహా

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వాట్సాప్ ద్వారా పీఎం కిసాన్ యోజన పేరుతో ఏపీకే లింక్ పంపిన సైబర్ నేరగాళ్లు నగరానికి చెందిన వ్యక్తి నుంచి రూ.7.50 లక్షలు కాజేశారు. సికింద్రాబాద్ ప్రాంతానికి చెందిన వ్యక్తి(49)కి వాట్సాప్‌లో పీఎం కిసాన్ యోజన పేరుతో లింక్ వచ్చింది. బాధితుడు ఆ లింక్‌ను ఓపెన్ చేశాడు. తర్వాత వాట్సాప్ ఖాతా హ్యాక్ అవడంతో పాటు తన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఖాతా నుంచి రూ.7.50 లక్షలు వివిధ ఖాతాలకు మళ్లించినట్లు బాధితుడు గుర్తించాడు. వెంటనే సైబర్ క్రైం పోర్టల్‌లో ఫిర్యాదు చేశాడు.

బైక్‌ల దొంగలు అరెస్ట్

● రూ.42 లక్షల విలువైన 22 బైక్‌లు స్వాధీనం



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ నరేష్‌రెడ్డి

జీడిమెట్ల, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఖరీదైన బైక్‌లను దొంగిలించి విక్రయిస్తున్న ఐదుగురు సభ్యుల ముఠాను జగద్గిరిగుట్ట పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ.42లక్షల విలువైన కేటీఎం డ్యూక్, రాయల్ఎన్‌ఫీల్డ్, పల్సర్, యమహా15, హోండా యునికాన్ వంటి ఖరీదైన 22 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. శనివారం జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాలానగర్ ఏసీపీ పి.నరేష్‌రెడ్డి, జగద్గిరిగుట్ట సీఐ నర్సింహ కేసు వివరాలు వెల్లడించారు. కేపీహెచ్‌బీ కాలనీ, అడ్డగుట్టలో హాస్టల్‌లో ఉంటున్న గొల్లపల్లి శ్రీధర్(26), కూకట్‌పల్లి ఆల్విన్‌కాలనీలో నివాసం ఉంటున్న మిద్దే వీరకౌశిక్‌గౌడ్(21), ఆల్విన్‌కాలనీలో నివాసముంటున్న కట్టా మణికంఠ(20), గుత్తుల శ్రీనివాస్(28), షేక్ నాగూర్‌వలి(25) ఒక ముఠాగా ఏర్పడ్డారు. వీరు కొంత కాలంగా షాపులు, నివాస ప్రాంతాల ఎదుట పార్క్‌చేసిన ఖరీదైన బైక్‌లను దొంగిలించి, విక్రయిస్తున్నారు. కేపీహెచ్‌బీకాలనీకి చెందిన గఫూర్‌రాజ్ ఇటీవల తన బైక్ దొంగతనానికి గురైందని జగద్గిరిగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. శనివారం ఉదయం నంబర్ ప్లేట్‌లేని బైక్‌పై తిరుగుతున్న గొల్లపల్లి శ్రీధర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా బైక్‌లు చోరీచేస్తూ విక్రయిస్తున్నట్లు అంగీకరించాడు. ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి 22 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/IJt3vA0లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.


బాలాపూర్ గణేష్ వద్ద తహసీల్దార్ ఇందిరా దేవిని సన్మానిస్తున్న గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్ రెడ్డి


సుధా టాకీస్ వద్ద మండపాన్ని ఆసక్తిగా చూస్తున్న సీపీ సీవీ ఆనంద్


ఉప్పుగూడ అంబికానగర్‌లో ఐదు కిలోల పేపర్ గణపతి


కాల్వగడ్డ శంషీర్‌గంజ్‌లో ఆపరేషన్ సిందూర్ థీమ్ గణపతి


లాల్‌దర్వాజలో ఉగ్రవాదిని కాలుతో తొక్కుతున్న గణనాథుడు

ఓ బొజ్జ గణపయ్య..

మండపాల్లో కొలువైన వినాయక విగ్రహాలకు భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తున్నారు. అంతటా గణేశ్ నవరాత్రి వేడుకలు అంబరాన్నంటాయి. ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేవిధంగా భక్తులు, ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. పాతబస్తీలో గణపతి మండపాలను డీసీపీ స్నేహమెహ్రాతో కలిసి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మండప నిర్వాహకులకు పలు సూచనలు, సలహాలు చేశారు. మండపాల వద్ద ఏర్పాటు చేసిన పాయింట్ బుక్‌లను పరిశీలించారు. వర్షాలు పడుతున్నందున మండపాల నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని, లేకుంటే ప్రమాదాలు సంభవించే అవకాశాలుంటాయన్నారు.


చాంద్రాయణగుట్ట ఇందిరానగర్‌లో గణపతికి పూజలు చేస్తున్న టీపీసీసీ కార్యనిర్వాహక కార్యదర్శి పర్వతాల రాజేందర్


మదీన: దూద్‌బౌలిలో సామూహిక హారతిలో పాల్గొన్న మహిళలు, చార్మినార్ భాగ్యలక్ష్మీ దేవాలయ చైర్మన్


నార్సింగ్‌లోని స్కైలా గేటెడ్ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన స్కైలా కరెన్సీ గణనాథుడు

వినాయకా.. చెరువును కాపాడు

నార్సింగ్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గండిపేట మండలం, పుప్పాల్‌గూడ, నార్సింగ్ మధ్యలోగల ముష్కీం చెరువు ఆక్రమణకు గురౌతుండడంతో కొంతకాలంగా స్థానికులు గొడవ చేస్తున్నారు. చెరువును పూర్తిస్థాయిలో రక్షించాలని హైడ్రాకు ఫిర్యాదు చేశారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఈ చెరువును పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ కూడా ఇచ్చారు. అయితే ఇంత వరకు చర్యలు తీసుకోకపోవడంతో చెరువు పక్కనే ఉన్న టౌన్‌షిప్‌వారు వినాయక విగ్రహం వద్ద చెరువు ఫొటో పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యా.. వినాయక.. చెరువును నువ్వే కాపాడాలని వేడుకొన్నారు.


వినాయకుడి వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న టౌన్‌షిప్ వాసులు


ఆక్రమణకు గురవుతున్న చెరువు


గోషామహల్ నియోజకవర్గం పటేల్‌నగర్‌లోని వినాయకునికి పూజలు చేస్తున్న తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్


రాజేంద్రనగర్: బొజ్జ గణపయ్యను పత్తి కుంటలో నిమజ్జనం చేయడానికి తీసుకువచ్చిన ఓ కుటుంబం


పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న సీపీ ఆనంద్

పండుగలు ప్రశాంతంగా జరిగేలా చూడాలి

నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్

చార్మినార్ ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గణేశ్ ఉత్సవాలు, మిలాదుల్ ఉన్‌నబీ ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. శుక్రవారం రాత్రి దక్షిణ మండలం డీసీపీ కార్యాలయం పురానీ హవేలీ కార్యాలయంలో సీవీ ఆనంద్ అధ్యక్షతన సౌత్ జోన్ పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గణేశ్ నిమజ్జనం సందర్భంగా తీసుకోవాల్సిన భద్రతా చర్యలు పోలీసు బందోబస్తుపై చర్చించారు. సీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ, గతంలో నిమజ్జనం సమయంలో జరిగిన లోటుపాట్ల గురించి చర్చించారు. మిలాద్ ఉన్ నబీ పండుగ ఉన్నందున శాంతిభద్రతల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. విగ్రహాలను నిమజ్జనం కోసం త్వరగా తరలించేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికపై చర్చించి అధికారులకు తగిన సూచనలు ఇచ్చారు. సమావేశంలో సౌత్ జోన్ డీసీపీ స్నేహా మెహ్రా, అపూర్వ రావు, వెంకటేశ్వర్లు, టాస్క్ ఫోర్స్ అధికారులు, మరియు సౌత్ జోన్‌లోని అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులు పాల్గొన్నారు.

దూద్‌బౌలి మండపం వద్ద సేవా కార్యక్రమాలు

మదీన, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : గణేశ్ నవరాత్రి ఉత్సవాలు అంటే ప్రత్యేక పూజలు, భక్తిగీతాలు, అన్నదానాలతోపాటు అవసరార్థులకు రూ.11లక్షల విలువ చేసే పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జేవీహెచ్ఎఫ్ సంస్థ ప్రతినిధులు తెలిపారు. దూద్‌బౌలిలోని టీమ్ జేవీహెచ్ఎఫ్ వినాయక మండపం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశ్‌ని ఆదివారం జరిగే ఈ పంపిణీ కార్యక్రమానికి దక్షిణ మండలం డీసీపీ స్నేహా మెహ్రా ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారు. 25 మంది పేద విద్యార్థులకు రూ.20వేల చొప్పున పంపిణీ చేయనున్నారు. 300 మంది పేద కుటుంబాలను ఎంపిక చేసి వారికి రూ.1500 విలువ చేసే నిత్యావసర సరుకులు పంపిణీ చేయనున్నారు. ధూప దీప నైవేద్యాలకు నోచుకోని ఒక ఆలయానికి ఏడాదికి రూ.50వేల చొప్పున, వైద్యానికి నోచుకోని పేదలకు రూ.లక్ష అందించనున్నట్లు టీమ్ జేవీహెచ్ఎఫ్ ప్రతినిధులు తెలిపారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలి

మదీన, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి శనివారం అధికారులతో కలిసి వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. మలక్‌పేట, సంతోష్‌నగర్, చాంద్రాయణగుట్ట సర్కిల్‌ల పరిధిలోని మలక్‌పేట, మూసారాంబాగ్, సైదాబాద్, సంతోష్‌నగర్, ఐఎస్ సదన్, బార్కాస్, బాలాపూర్ గుర్రంచెరువు, చాంద్రాయణగుట్ట, బండ్లగూడ, జంగమ్మెట్, ఫలక్‌నుమా ప్రభుత్వ జూనియర్ కాలేజీ తదితర ప్రాంతాల్లో పర్యటించి కొనసాగుతున్న అభివృద్ధి పనులను, పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ, ప్రాజెక్టు అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ఈ పర్యటనలో చాంద్రాయణగుట్ట, బార్కస్ డివిజన్ల కార్పొరేటర్లు అబ్దుల్ వహబ్, మహ్మద్ హఫీజ్, మలక్‌పేట సర్కిల్ డిప్యూటీ ఇంజనీర్ ఇంతెషాఫ్ అలీ, ఇంజనీరింగ్ ప్రాజెక్ట్, పారిశుద్యం, క్రీడా విభాగాల అధికారులు పాల్గొన్నారు.


సుజాత, రాజశ్రీలను సన్మానిస్తున్న వ్యవసాయ వర్సిటీ రిజిస్ట్రార్ విద్యాసాగర్, జాయింట్ రిజిస్ట్రార్ శివాజీ

ఉద్యోగ విరమణ.. సన్మానం

రాజేంద్రనగర్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి) : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ కంప్ట్రోలర్ (ఆడిట్) గా విధులు నిర్వహిస్తున్న ఎం.సుజాత, అసిస్టెంట్ కంప్ట్రోలర్ (ఫైనాన్స్) గా విధులు నిర్వహిస్తున్న హెచ్ రాజశ్రీ శనివారం ఉద్యోగ విరమణ చేశారు. వారిని వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జీఈసీహెచ్ విద్యాసాగర్, జాయింట్ రిజిస్ట్రార్ డి.శివాజీలు సన్మానించి మెమెంటోలు అందజేశారు.


రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం

చాంద్రాయణగుట్ట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ దేశ ప్రధాని నరేంద్ర మోదీ పట్లచేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ శనివారం బీజేపీ శాలిబండ డివిజన్ అధ్యక్షుడు సాయినాథ్ సూర్యవంశీ ఆధ్వర్యంలో ఫూల్ బాగ్ చమాన్ వద్ద రాహుల్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశం ప్రధాని మోదీ నేతృత్వంలో ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. రాహుల్ గాంధీ భేషరతుగా దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

ఆకట్టుకున్న అనన్య నృత్యం


కూచిపూడిలో అరంగేట్రం చేసిన అనన్య

రవీంద్రభారతి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : లయబద్ధంగా సాగిన నృత్యాంశాలకు వైవిధ్యభరితంగా నర్తించిన యువ నర్తకి అనన్య పోల్సాని ప్రేక్షకుల్ని రంజింపజేసింది. శనివారం రవీంద్రభారతిలో అభినయ దర్పణ ఆర్ట్స్అకాడమీ ఆధ్వర్యంలో ప్రముఖ నాట్య గురు ఓలేటి రంగమని శిష్యురాలైన అనన్య కూచిపూడి నాట్యంలో రంగప్రవేశం చేసింది. యూకే లో ఎల్.ఎల్.బి చదువుతున్న యువ నర్తకి అనన్య పోల్సాని గత పది సంవత్సరాల నుంచి గురువు ఓలేటి రంగమని వద్ద కూచిపూడిలో అడుగులు నేర్చుకొని రవీంద్రభారతిలో తొలి ప్రదర్శన ఇచ్చింది. ఈ సందర్భంగా గణపతి కీర్తన, భామా కలాపం, జావలి, తిల్లానా, సింహనందిని వంటి అంశాల్లో నర్తించి భళా అనిపించింది. చక్కటి ఆహార్యం ఆకట్టుకునే హావభావాలతో నర్తకి ప్రతిభ ఆహుతుల్ని ఆకట్టుకుంది. ఈ నాట్యానికి నట్టు వాగం ఓలేటి రంగమని చేయగా మృదంగం రాజగోపాలచార్య, వాయిలిన్ దినకర్, ఫ్లూట్ వెంకటేష్ వాయిద్య సహకారం అందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి జూపల్లి కృష్ణారావు, పద్మభూషణ్ డాక్టర్ రాజా రాధా రెడ్డి, శాంతా బయోటెక్ చైర్మన్ పద్మ భూషణ్ వరప్రసాద్ రెడ్డి, పద్మశ్రీ డాక్టర్ శోభరాజు హాజరై నర్తకిని ఆశీర్వదించారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి : మంత్రి వివేక్

నార్సింగ్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): అర్హులైన వారందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు తప్పనిసరిగా అందుతాయని, సంక్షేమ పథకాలను ప్రతీ ఒక్కరు ఉపయోగించుకోవాలని మంత్రి వివేక్, తుమ్మల నాగేశ్వరావు కోరారు. శనివారం జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని షేక్‌పేట్ డివిజన్‌లలో పలు అభివృద్ధి పనులను మంత్రులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందే విధంగా ప్రవేశపెడుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అందరికీ న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఓయూ కాలనీ, డ్రీమ్ వ్యాలీ కాలనీ ప్రాంతాల్లో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. మంత్రుల వెంట జూబ్లీహిల్స్ కాంగ్రెస్ ఇన్‌చార్జి అజహరుద్దీన్, జోనల్ కమిషనర్ అనురాగ్, డీసీ సమ్మయ్య, విజయ్, హరిరామ్, మోన్‌రావు, సుగుణ, షేక్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి వివేక్ తదితరులు

దేవాలయంలో పూజలు

షేక్‌పేట్ ఓయూ కాలనీలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో మంత్రి వివేక్ తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ శ్రీనివాస్ మంత్రికి స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు స్పందించిన మంత్రి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

అడవి పండ్లు.. అద్భుత పోషక గనులు

ఉద్యాన వర్సిటీ వైస్ చాన్స్‌లర్ డా.దండ రాజిరెడ్డి


'అడవి పండ్లు' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో వివిధ రంగాల ప్రముఖులు

రాజేంద్రనగర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో పోషకాహార భద్రతకు అడవి పండ్లు ఆధారం కానున్నాయని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డాక్టర్ దండ రాజిరెడ్డి అన్నారు. ఉద్యాన కళాశాల వేదికగా విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ ఎం.పద్మయ్య రచించిన 'ఆదరణ కరువైన అడవి పండ్లు' అనే పుస్తకావిష్కరణలో ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు.

అడవిలో దొరుకుతూ పోషకాహార విలువలు కలిగిన అటవీ పండ్ల జాతులపై విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో పరిశోధనలు చేపడతామన్నారు. అదేవిధంగా అవసరమైతే వాటి నుంచి నూతన రకాలను అభివృద్ధి చేసేందుకు వర్సిటీ కృషి చేస్తుందన్నారు. విలువైన అడవి పండ్ల మొక్కలను రైతులు సైతం తమ క్షేత్రాలలో సాగు చేసేందుకు అవకాశాలను పరిశీలించాలని కోరారు. నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ, అటవీశాఖ, ప్రభుత్వ సహకారంతో లోతైన ఈ పనులపై లోతైన పరిశోధనలు, వినియోగదారులకు వీటి పోషక విలువలను పరిచయం చేసే కార్యక్రమం చేపడతామన్నారు. విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఐదు ఎకరాలలో రచయిత ప్రస్తావించిన అటవీపండ్ల వనాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ డాక్టర్ ప్రియాంక వర్గీస్, నేషనల్ బయోడైవర్శిటీ అథారిటీ మాజీ చైర్మన్ డాక్టర్ అచలేందర్‌రెడ్డి, నాబార్డ్ విశ్రాంత సీజీఎం మోహనయ్య, ఐఐఓఆర్ డైరెక్టర్ డాక్టర్ ఆర్ కే మాథుర్, మాజీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ నీరజ ప్రభాకర్, జే చీనా, పి.ప్రశాంత్, పిడిగెం సైదయ్య, అనిత, నిఖిల్, జి.యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

హతీరామ్ బాలాజీ మఠాన్ని కూల్చివేయొద్దు : రవీంద్రనాయక్

బర్కత్‌పుర, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో హతీరామ్ బాలాజీ మఠాన్ని కూల్చివేసే నిర్ణయాన్ని వెంటనే నిలిపివేయాలని మాజీ ఎంపీ ధారావత్ రవీంద్రనాయక్, బంజారా భారత్ కన్వీనర్ జగన్నాయక్, బంజారా అర్చక సంఘం అధ్యక్షుడు గోపాల్ నాయక్, గౌరవ అధ్యక్షుడు రాజు నాయక్ డిమాండ్ చేశారు. దీనిపై ఏపీ సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు లేఖలు రాశామని కొంతమంది కుట్రల వల్ల హతీరామ్ బాలాజీ మఠాన్ని కూల్చివేస్తున్నారని ఆరోపించారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకుని హతీరామ్ బాలాజీ మఠాన్ని కాపాడాలని, మఠం ఆస్తుల దుర్వినియోగంపై సీబీఐచే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. శ్రీవేంకటేశ్వర స్వామి హతీరామ్‌జీతో పాచికలు ఆడారని, అందువల్లనే తిరుమలలో మఠాన్ని ఏర్పాటు చేశారని వారన్నారు. ఈ మఠానికి 500 ఏళ్ల చరిత్ర ఉందని తెలిపారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలకు నిలయంగా ఈ మఠం కింద 2,450 ఎకరాల భూములు ఉన్నాయని వారు తెలిపారు. శ్రీనివాస నంద స్వామి చేసిన కుట్రల వల్ల ఈ మఠాన్ని కూల్చివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఈ మఠాన్ని కాపాడుకోవడానికి రెండు తెలుగురాష్ట్రాల నుంచి వేలాదిగా బంజారాలు తిరుపతి వెళ్తారని తెలిపారు. బంజారా ఆస్తులను కాపాడుకుంటామన్నారు. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని కొంత మంది సుప్రీంకోర్టును ఆశ్రయించడం అన్యాయమన్నారు. బంజారాలకు ద్రోహం చేయవద్దని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బంజారా సంఘం నేతలు జోహర్‌నాయక్, డాక్టర్ జగన్నాయక్, భువననాయక్, ఎస్.పి.నాయక్, రాజునాయక్, సోమ్లదాదా, రాంచందర్ నాయక్, సభావత్ కల్యాణ్‌నాయక్, రవిరాథోడ్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ ధారావత్ రవీంద్రనాయక్



బహుజన సమాజ్ పార్టీ తెలంగాణ అధ్యక్షుడిగా నియమితులైన బడంగ్ పేట్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ఇబ్రమ్ శేఖర్, కు శంషాబాద్ విమానాశ్రయంలో పుష్ప గుచ్ఛం ఇచ్చి స్వాగతం పలుకుతున్న ప్రముఖ న్యాయవాది ఎండీ నయీమ్

- (పహాడిషరీఫ్ ఆంధ్రజ్యోతి)

చెట్ల కొమ్మల నరికివేతతో ట్రాఫిక్ జామ్

మదీన, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి ఊరేగింపు నేపథ్యంలో శనివారం సిబ్బంది చెట్ల కొమ్మలను నరికివేయడంతో తీవ్రమైన ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. పురానాపూల్ హిందూ శ్మశాన వాటిక ఎదురుగా ప్రధానరహదారిపై సిబ్బంది శనివారం చెట్ల కొమ్మలను నరికివేశారు. అసలే వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ప్రధాన రహదారికావడం.. దానికి తోడు జన సంచారం ఎక్కువగా ఉండే సమయంలో రోడ్డుపై వాహనాన్ని నిలిపి చెట్ల కొమ్మలను తొలగిస్తుండడంతో పురానాపూల్ దర్వాజ నుంచి సిటీ కాలేజీ వరకు తీవ్రమైన ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.


ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న చాంద్రాయణగుట్ట ఏసీపీ, ఇన్‌స్పెక్టర్


ర్యాపిడ్ యాక్షన్.. ఫ్లాగ్ మార్చ్

మదీన, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి, మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలను పురస్కరించుకుని సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ చైతన్యకుమార్ ఆదేశాల మేరకు శనివారం చాంద్రాయణగుట్ట పోలీసులు బస్తీల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఏసీపీ సుధాకర్, ఇన్‌స్పెక్టర్ ఆర్.గోపీ నేతృత్వంలో స్టేషన్ పరిధిలోని ఎంబీఎన్ఆర్ చౌరస్తా, కేశవగిరి వై జంక్షన్, టీజంక్షన్, గుర్రంచెరువు, కట్టమైసమ్మ దేవాలయం, సలాల, బార్కాస్ తదితర ప్రాంతాల్లో చాంద్రాయణగుట్ట పోలీసులు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ బృందం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. అలాగే బందోబస్తులో భాగంగా సౌత్‌వెస్ట్‌జోన్ ఏసీపీ కిషన్ కుమార్ ఆధ్వర్యంలో ర్యాపిడ్ యాక్షన్ బలగాలతో మెహదీపట్నం, మల్లేపల్లి, అల్‌సబాహోటల్, నుంచి మర్హాన్ హోటల్ వరకు మార్చ్‌పాస్ నిర్వహించారు.


క్రీడలలో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్‌లను బహూకరిస్తున్న డీసీపీ చింతమనేని శ్రీనివాస్

చదువుతో పాటు క్రీడలు అవసరం: డీసీపీ

రాజేంద్రనగర్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి) : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శనివారం జాతీ య క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థి జీవి తంలో చదువుతో పాటు క్రీడలు చాలా అవసరం అన్నారు. శారీరక ఆరోగ్యం, క్రమశిక్షణ, టీమ్ స్పిరిట్ చాలా అవసరం అన్నారు. విద్యార్థి జీవితంలో క్రీడలు కలిగించే ఉపయోగాలను వివరించారు. విజేతలకు డీసీపీ చింతమనేని శ్రీనివాస్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.గోవర్ధన్, ఓఎస్‌ఏ రాంరెడ్డి, క్రీడల ఇన్‌చార్జీ సైదా నాయక్, ఫిజికల్ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.


ఉద్యోగ విరమణ పొందిన రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్సు డిపో ఉద్యోగులు

ఉద్యోగుల సేవలు మరువలేనివి : డీఎం కృష్ణారెడ్డి

రాజేంద్రనగర్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి) : రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్సు డిపోలో పనిచేస్తూ శనివారం ఉద్యోగ విరమణ పొందిన శివరామక్రిష్ణ, రాజేంద్ర కుమార్, శ్రీరాజీల సేవలు మరువలేనివని రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్సు డిపో మేనేజర్ కృష్ణారెడ్డి అన్నారు. డిపో ఆవరణలో ఏర్పాటు చేసిన ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమంలో ఉద్యోగ విరమణ చేసిన వారిని సన్మానించారు. కార్యక్రమంలో ఉద్యోగ నాయకులు పీపీ రెడ్డి, జీఎం రెడ్డి, ముత్యంరెడ్డి, వెంకటరెడ్డి, అంజయ్య, హనుమంత్‌రెడ్డి, అశోక్ సన్మానించారు.

'సైబర్ సెక్యూరిటీ కోర్సుల'లో దరఖాస్తులకు ఆహ్వానం

బర్కత్‌పుర, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ అకాడమి ఆఫ్ సైబర్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మెరుగైన ఉపాధి అవకాశాలు గల ఎథికల్ హాకింగ్ కోర్సులలో శిక్షణకై రాష్ట్రవ్యాప్తంగా దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ విమలారెడ్డి తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ డిప్లొమా అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. సైబర్ సెక్యూరిటీ ఆఫీసర్, డిప్లొమా ఇన్ సైబర్ సెక్యూరిటీ అండ్ ఎథికల్ హాకింగ్, పీజీ డిప్లొమా ఇన్ సైబర్ సెక్యూరిటీ తదితర కోర్సుల్లో శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌లను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 7893141797 ఫోన్‌లో సంప్రదించాలని ఆమె కోరారు.

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | గోవిందరావు : 9703618721, రాజ్ కుమార్: 9985921389 కె. అనిల్ కుమార్: 99854 03628

నివాళి

ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ మాతృమూర్తి కనకరత్నం మృతి పట్ల పలువురు ప్రముఖులు, రాజకీయ, సినీ నటీనటులు, దర్శకులు సంతాపం తెలిపారు. ఆ మేరకు ఆమె పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.


కనకరత్నంకు అంత్యక్రియలు...



చిరంజీవి, అర్జున్‌లతో మాట్లాడుతున్న దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్, నిర్మాత నాగవంశీ


దర్శకుడు వినాయక్


మురళీమోహన్, జీవిత, శ్రీను వైట్ల


నాగచైతన్య


వరుణ్‌తేజ్, వెంకటేశ్, సాయిధరమ్‌తేజ్


మలినేని గోపీచంద్


కనకరత్నం భౌతికకాయం వద్ద సంతాపం తెలుపుతున్న దర్శకుడు బోయపాటి శ్రీను

రాష్ట్రప్రభుత్వాలను అస్థిరపరిచే కుట్ర

● ఎంసీపీఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి

మియాపూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తూ ఇచ్చిన హామీలను విస్మరిస్తూ ప్రతిపక్షంలో ఉన్న పార్టీలను, రాష్ట్ర ప్రభుత్వాలను అస్థిరపరిచేందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఆర్టికల్ 130కి సవరణ తీసుకు వచ్చిందని ఎంసీపీఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి ఆందోళన వ్యక్తం చేశారు. మియాపూర్‌లోని తాండ్ర రామచంద్రయ్య భవన్‌లో భారత మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ (ఐక్య) తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి, ఎంసీపీఐ(యు) నాయకులు కామ్రేడ్ మొద్దు సదానందం, ఆకారపు మల్లయ్యలకు ఘనంగా నివాళులు అర్పించారు. తమకు అనుకూలంగా ఉన్న ఓటర్లను మాత్రమే లిస్టుల్లో ఉంచి, వ్యతిరేకంగా ఉన్న వాటిని తొలగించి, అడ్డదారిన తమ అధికార ప్రాబల్యాన్ని నియంతృత్వాన్ని కాపాడుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు.

152 డెకాయ్ ఆపరేషన్‌లు.. 45 మందిపై కేసులు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో వారం వ్యవధిలో సైబరాబాద్ షీటీమ్స్ పలు ప్రాంతాల్లో 152 డెకాయ్ ఆపరేషన్‌లు నిర్వహించారు. యువతులను వేధిస్తున్న 45 మంది పోకిరీలను అదుపులోకి తీసుకొని వారిపై కేసులు నమోదు చేశారు. సోషల్ మీడియా, మెయిల్స్, ఫోన్ ద్వారా వచ్చిన మరో 15 ఫిర్యాదులపై కూడా చర్యలు తీసుకున్నారు. మహిళల భద్రత గురించి ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో 69 అవగాహన కార్యక్రమాలను నిర్వహించామని డీసీపీ సృజన శనివారం తెలిపారు.

ఆంధ్రజ్యోతి Daily CLASSIFIEDS

JOBS

★ Exp/Trained Teacher for High School - English, Shanker Vidyalaya H.S, Bjr Nagar, Malkajgiri (Near Lalapet). 9293771959 AJH-01417

WANTED

★ Wanted Experience SALES PERSON & HELPERS for Saree Showroom near Secretariat Tankbund M/F. Contact: 9989698981 AJH-6855

TOLET

★ Sharing furnished office space available for rent at Ameerpet, Main Road, Rent: 15K/per month. Cont: 9177950666 AJH-003410

వధువు కావలెను

★ దూదేకుల Unmarried ప్రాపర్ వరంగల్ 31 5'6" స్వంత ఇల్లు ప్రాపర్టీస్ బిజినెస్ వరునికి వధువు కావలెను. caste no bar (except sc) కట్నం ప్రసక్తి లేదు. Self: 8985773533 AJH-003412

PLOT FOR SALE

★ Open Plots 100 Sq.Yds @ 4,00,000/- Cheemalakonduru 2km from Yadagiri to Bhadradri H/W 1km from RRR EMI also avble. Cont. 9177871177 AJH-003249

★ SHADNAGAR, DTCP / RERA, PLOTS, 25 LACS PLOT, BANK LOANS ALSO. EXACTLY 2KM FROM BUS STAND. WELL DEVELOPED, READY TO CONSTRUCT, GATED COMNTY 9177385251 AJH-003350

★ SHADNAGAR, BALANGAR, PLOTS 5999 Rs. SQYD, 24 MONTHS EMI, Exactly 2km from NH44 EXISTING VILLAGE, FILM STUDIO CLUB HOUSE, GATED COMMUNITY 9177385251 AJH-003368

★ ఘట్‌కేసర్ మం. పోచారం, జోడిమెట్ల సర్కిల్ నుండి చౌదరిగుడా 60 ఫీట్ల రోడ్డుకు తూర్పు ఫేసింగ్‌తో కమర్షియల్ ప్లాటు 400 గజాలు అమ్మకానికి కలదు. 9849084905 AJH-15062

OLD AGE HOME

★ ఈశ్వర్ హోమ్ కేర్ సర్వీసెస్ 24 గం. వృద్ధులకు, పేషంట్ల సేవకు బేబీ కేర్ ఇంటి పని, వంట పనికి M/F వర్కర్స్‌ని మీఇంటికి పంపగలము. ఫోన్: 8121024199 AJH-16006

REAL ESTATE

★ AP కృష్ణా జిల్లాలో భూములు కొనదలచిన, అమ్మదలచిన వారు సంప్రదించగలరు. CELL : 9885358691 AJH-232093

వ్యవసాయ భూమి అమ్మకం

★ బాపట్ల జిల్లా మేదరమెట్ల దగ్గర, దైవాల రావూరు గ్రామంలో 7 ఎకరాల వ్యవసాయ భూమి అమ్మకానికి కలదు. సంప్ర: 9032582481 / 9908862323 AJH-16076

SPOKEN HINDI

★ Learn Online / Offline Spoken Hindi / English, French & German within 30 Days. 100% Guarantee for all Ages. Free Demo. Cont: 98495 42456 AJB-303

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ADVT

క్లాసిఫైడ్స్ ప్రకటనల కొరకు ఈ క్రింది నంబర్లను సంప్రదించగలరు. 99859 21380, 99859 21386 97036 18806

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

ప్రతి అవసరానికి వేగవంతమైన ఫలితం

REAL ESTATE · SITUATION VACANT · TO LET · AUTOMOTIVE · COMPUTERS · HEALTH CARE · EDUCATION · ENTER TAINMENT

4 లైన్ల ప్రకటన కేవలం రూ. 700/- GST 5% Extra

ప్రతి అదనపు లైన్‌కు రూ. 150/-

ప్లాట్ నం. 76, అశ్విని లేఅవుట్, ఇంబా హైట్స్ రోడ్ నం. 70, జూబ్లీహిల్స్, హైదరాబాద్

సెల్: 9985921380 / 9985921386 9703618806 / 9985406505

నిమజ్జనాలకు 68 ప్రత్యేక కంట్రోల్‌రూంలు

104 ప్రత్యేక డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల అదనపు ఏర్పాట్లు

● దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ



హైదరాబాద్ సిటీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) గణేష్ విగ్రహాల నిమజ్జనాలకు గ్రేటర్‌లో 68 ప్రత్యేక కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశామని దక్షిణ తెలంగాణ విద్యుత్‌పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ తెలిపారు. 110 ప్రాంతాల్లో అదనపులోడ్‌కు అదనంగా 104 ప్రత్యేక డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రేటర్ పరిధిలోని జోనల్ చీఫ్ ఇంజనీర్లు (సీఈ), సూపరింటెండింగ్ ఇంజనీర్ల(ఎస్ఈ)లతో కలిసి ఆయన శనివారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. శోభాయాత్ర నిర్వహించే రూట్లలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, 101 సబ్ డివిజన్ స్థాయి బృందాలు, నిమజ్జన కార్యక్రమాలు ముగిసే వరకు 24 గంటలు అందుబాటులో ఉండేలా డ్యూటీ చార్ట్ వేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. పెద్ద విగ్రహాలు ప్రతిష్ఠించిన మండపాలు నుంచి శోభాయాత్ర నిర్వహించే వీధులు, రహదారులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. కాన్ఫరెన్స్‌లో సంస్థ డైరెక్టర్లు శివాజీ, డా.నర్సింహులు, చక్రపాణి, కృష్ణారెడ్డి, మెట్రోజోన్ చీఫ్ ఇంజనీర్ ప్రభాకర్, రంగారెడ్డి, మేడ్చల్ జోన్ల సీఈలు పాండ్య, కామేష్, పది సర్కిళ్ల ఎస్ఈలు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ టు అమీర్‌పేట

● నాలాలను పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్


ఎల్లారెడ్డిగూడలో చేపట్టిన నాలా పనులను పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్, కార్పొరేటర్ సంగీతాశ్రీనివాస్‌యాదవ్

బంజారాహిల్స్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ నుంచి అమీర్‌పేట వరకు నాలాలను హైడ్రా కమిషనర్ రంగనాథ్ శనివారం పరిశీలించారు. వర్షం కురిస్తే అమీర్‌పేట మైత్రీవనం మినీ చెరువులా మారుతోందని తెలుసుకొని ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా పరిశీలించడం విదితమే. ఈ నేపథ్యంలో పూడిక వల్ల నాలాలు పొంగి మురుగు, వరద రోడ్లను ముచ్చెత్తుతున్నాయని హైడ్రా అధికారులు నిర్ధారణకు వచ్చి పనులు చేపట్టారు.

● జూబ్లీహిల్స్ నుంచి అమీర్‌పేట వరకు దారి తీసే రెండు నాలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పూడికతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న నాలాలను పరిశీలించారు. పూడిక పనులు మొదలు పెట్టాక కాస్త సమస్య తగ్గిందని రంగనాథ్‌తో స్థానికులు అన్నారు.

● జూబ్లీహిల్స్, గాయత్రి హిల్స్ కృష్ణానగర్ ప్రాంతాల నుంచి సారథి స్టూడియో పక్క నుంచి వచ్చే కాలువతో పాటు.. యూసుఫ్‌గూడ, మధురానగర్, శ్రీనివాస్ నగర్ వెస్ట్ నుంచి వచ్చే వరద కాలువలు కలిసి అమీర్‌పేట వద్ద రోడ్డు దాటుతున్నప్పుడు తలెత్తుతున్న ఇబ్బందులను కూడా పరిశీలించారు. ఈ ప్రాంతాల్లో ఆరేడు అడుగుల మేర పూడుకుపోవడాన్ని గమనించారు.

● కృష్ణా నగర్లో ప్రగతినగర్ వద్ద వరద కాలువలను మొత్తం పూడ్చేసి జరిగిన ఆక్రమణలను వెంటనే తొలగించాలని కమిషనర్ ఆదేశించారు. పూడిక కారణంగా సమస్య ఉత్పన్నమవుతున్నట్టు తెలుస్తోందన్నారు. అందుకే అన్ని చోట్ల పూడిక పనులను మొదలు పెట్టినట్టు పేర్కొన్నారు. అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే అన్ని ప్రభుత్వ శాఖల సహకారంలో నాలా పరివాహక ప్రాంతాల నివాసులతో సమావేశమై శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్టు చెప్పారు. వందేళ్ల వరకు సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట కార్పొరేటర్ వనం సంగీతాశ్రీనివాస్‌యాదవ్, హైడ్రా అధికారులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీ జెండా ఎగరాలి

● కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం మరింత అప్పులపాలు

: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి


మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

యూసుఫ్‌గూడ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వచ్చే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో తెలంగాణ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి అన్నారు. బీజేపీకి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్రాన్ని కాంగ్రెస్ మరింత అప్పుల కుప్పగా మార్చడంతో ప్రజలు ఆ పార్టీపై మండిపడుతున్నారని విమర్శించారు. యూసుఫ్‌గూడ మహమూద్ గార్డెన్‌లో శనివారం జరిగిన జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌తోనే మార్పు సాధ్యమని చెప్పి మోసపూరిత హామీలతో గద్దెనెక్కి అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఇచ్చిన హామీల్ని అమలు చేయడం లేదన్నారు. ఓ కుటుంబం చేతిలో బంది అయ్యామని మార్పు కోసం కాంగ్రెస్‌కు ఓటేస్తే అధికారంలోకి వచ్చిన ఈ పార్టీ కూడా కుటుంబ పాలనతో ప్రజలని మోసం చేస్తోందన్నారు. కార్యక్రమం బీజేపీ స్టేట్ చీఫ్ రామచందర్‌రావు, ఎంపీ రఘునందన్‌రావు, పాయల్ శంకర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సెక్యూరిటీ గార్డు ముసుగులో గంజాయి దందా

●ఒకరి అరెస్టు.. 7.50 కిలోల సరుకు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సెక్యూరిటీ గార్డు ముసుగులో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిలో ఒకరిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. అతని నుంచి 7.50 కిలోల సరుకు స్వాధీనం చేసుకున్నారు. బిహార్‌కు చెందిన అర్జున్ కుమార్... అమృత కపాడియా నవజీవన్ ఉమెన్స్ కాలేజీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఇదే రాష్ట్రానికి చెందిన రాహుల్ పండరి కూడా మరో ప్రాంతంలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఇద్దరూ కలిసి బిహార్ నుంచి గంజాయి తెచ్చి, నగరంలో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. వారి గంజాయి విక్రయాలపై సమాచారం అందుకున్న ఎక్సైజ్ అధికారులు నిఘా పెట్టారు. దీంతో తన వద్ద ఉన్న గంజాయిని అర్జున్ కుమార్‌కు ఇచ్చి రాహుల్.. బిహార్‌కు పరారయ్యాడు. సమాచారాన్ని సేకరించిన ఎస్టీఎఫ్ టీం నాగరాజు బృందం రామ్‌కోటి ఎడంబాగ్ ఘాచి భవన్‌లోని అర్జున్ కుమార్ ఇంటిపై దాడులు చేశారు. అతడి అరెస్ట్ చేసి, పై మొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

● తుని నుంచి గంజాయి తెచ్చి...

ఆంధ్ర తుని ప్రాంతం నుంచి గంజాయి తెచ్చి నగరంలో విక్రయిస్తున్న ముగ్గురు యువకులను ఎక్సైజ్ సిబ్బంది అరెస్ట్ చేశారు. తునికే చెందిన వరుణ్ కుమార్ కేపీహెచ్‌బీ ప్రాంతంలో హాస్టల్‌లో ఉంటున్నాడు. తుని నుంచి గంజాయి తెచ్చి నగరంలో విక్రయిస్తున్నాడు. అతడికి సాయి మణికంఠ, బన్నీలు సహకరిస్తున్నారు. గంజాయి విక్రయాలపై సమాచారంతో నిఘా పెట్టిన ఎక్సైజ్ అధికారులు, మాదాపూర్ 100 ఫీట్ రోడ్డులో వీరిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 2 బైకులు, 1.10 కిలోల సరుకు స్వాధీనం చేసుకున్నారు.

● ..విక్రేత అరెస్టు

గంజాయిని తరలిస్తున్నారనే సమాచారం మేరకు జియాగూడ నుంచి అత్తాపూర్‌కు వెళ్లే దారిలో ఎస్టీఎఫ్ అంజిరెడ్డి బృందం తనిఖీలు నిర్వహించింది. ధూల్‌పేట్‌కు చెందిన ధన్‌రాజ్‌ను అదుపులోకి తీసుకుంది. అతని నుంచి 1.09 కిలోల గంజాయిని, బైక్‌ను స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేశారు.


అమరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

అమరుల ఆశయాలను కొనసాగిద్దాం

గన్‌పార్క్ ఆగస్టు 30, (ఆంధ్రజ్యోతి): అమరుల ఆశయాలను కొనసాగిద్దామని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. శనివారం అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో ముందుగా ఆయన గన్‌పార్కులోని అమరుల స్థూపం వద్ద అమరులకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు అమరులు చేసిన త్యాగం ఎప్పటికీ నిలిచి పోతోందన్నారు. వారు కలలుగన్న రాష్ట్రం రావాలన్నారు. వారు కలలుగన్న సామాజిక తెలంగాణ తెలంగాణ రాష్ట్రం సాధించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీసీనియర్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భర్తను హతమార్చిన భార్య, ప్రియుడి రిమాండ్

● ఒంటరైన చిన్నారులు

దిల్‌సుఖ్‌నగర్, ఆగస్టు30(ఆంధ్రజ్యోతి): ప్రియుడితో కలిసి భర్తను హతమార్చిన భార్యతో పాటు, ఆమె ప్రియుడిని శనివారం సరూర్‌నగర్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. దిల్‌సుఖ్‌నగర్ పీ అండ్ టీ కాలనీలో నివసించే చిట్టి.. తన ప్రియుడు హరీష్‌తో కలిసి నిద్రిస్తున్న భర్త శేఖర్‌ను గొంతు నులిమి, డంబుల్‌తో మోది హతమార్చడం విదితమే. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్న అతడిని అడ్డుతొలగించడం కోసం ప్రియుడితో కలిసి పథకం రూపొందించి హతమార్చినట్లు పోలీసుల విచారణలో తేలింది.

ఒంటరైన చిన్నారులు

తండ్రి హత్యకు గురికావడం, ఇందులో తల్లి ప్రమేయం ఉండటంతో జైలు పాలైంది. దీంతో దంపతుల చిన్నారులు ఇద్దరు ఒంటరివారయ్యారు. పోస్టుమార్టం అనంతరం శనివారం శేఖర్ మృతదేహాన్ని ఆయన తల్లిదండ్రులకు అప్పగించారు. సొంతూరైన నాగర్‌కర్నూలు జిల్లా ఉరుకొండ మండలం మాదవరం గ్రామానికి మృతదేహాన్ని తీసుకువెళ్లారు.

పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి

● లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం

● మాజీ సర్పంచ్‌లు



పంజాగుట్ట,ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న సర్పంచ్ బిల్లులను వెంటనే చెల్లించాలని మాజీ సర్పంచ్‌లు డిమాండ్ చేశారు. రెండు రోజుల్లో స్పందించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడుతామని వారు హెచ్చరించారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ క్రాంతి దళ్ వ్యవస్థాపక అధ్యక్షుడు పృథ్వీరాజ్ యాదవ్, తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్, ఉపాధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి తదితరులు మాట్లాడారు. రాష్ట్రంలో మొత్తం 12,769 గ్రామపంచాయతీలు ఉన్నాయని, బయట నుంచి వడ్డీ కి తెచ్చి గ్రామాల్లో అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. సుమారు 700 కోట్ల రూపాయల వరకు ప్రభుత్వం నుంచి తమకు బకాయిలు రావాల్సి ఉందని అన్నారు. ఇప్పటి వరకు శాంతియుతంగా నిరసన, ఆందోళన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. వడ్డీలు పెరిగి అప్పు ఇచ్చిన వారి వేధింపులు భరించలేక రాష్ట్రంలో ఇప్పటికే చాలా మంది సర్పంచులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు.

లాలాగూడ సెంట్రల్ ఆస్పత్రిలో తనిఖీలు

హైదరాబాద్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ లాలాగూడ రైల్వే కేంద్ర ప్రధాన ఆస్పత్రిలో శనివారం రైల్వే బోర్డు, ఇండియన్ రైల్వే హెల్త్ సర్వీసెస్(ఐఆర్‌హెచ్ఎస్) డైరెక్టర్ జనరల్ డాక్టర్‌జగదీష్ చంద్ర తనిఖీలు నిర్వహించారు. అత్యవసర సందర్భంలో వినియోగించుకునేందుకు ఆస్పత్రి ప్రాంగణంలో ఆక్సిజన్ ప్లాంట్‌ను అభివృద్ధి చేసిన వైద్య బృందాన్ని అభినందించారు.

ట్రై కమిషనరేట్లలో పలువురి పదవీ విరమణ

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ట్రై కమిషనరేట్ల పరిధిలో పదవీ విరమణ చేసిన అధికారులు, సిబ్బందిని సీపీలు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లోని కమిషనరేట్‌లో శనివారం పదవీ విరమణ పొందిన 33 మంది అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులను సీపీ ఆనంద్ ఘనంగా సత్కరించారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో పదవీ విరమణ చేసిన నలుగురు అధికారులను రాచకొండ సీపీ సుధీర్ బాబు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. సైబరాబాద్ కమిషరేట్ కార్యాలయంలో శనివారం పదవీ విరమణ పొందిన 14 మంది సిబ్బందిని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి సత్కరించి వీడ్కోలు పలికారు.

నిబద్ధతతో పనిచేస్తేనే గుర్తింపు

● కలెక్టర్ హరిచందన దాసరి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు వృత్తి నిబద్ధతతో పనిచేస్తేనే గుర్తింపు లభిస్తుందని కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. ఉద్యోగ విరమణ పొందిన కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్, మారేడుపల్లి తహసీల్దార్ భీమయ్యను కలెక్టరేట్‌లో శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగులకు పదోన్నతులు, బదిలీలు, రిటైర్‌మెంట్లు సాధారణమన్నారు. ఉద్యోగ విరమణ పొందిన వారు మంచి ఆరోగ్యంతో ఉంటూ ప్రజాసేవలో నిమగ్నం కావాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ముకుందరెడ్డి, ఇన్‌చార్జి డీఆర్ఓ శ్రీధర్, ఎస్‌డీసీ సూర్యప్రకాష్, ఆర్డీఓ సాయిరాం, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

● సత్యప్రమోదతీర్థుల స్వామీజీ స్మారక నాణెం విడుదల



ఉత్తరాధిమఠం పీఠాధిపతులైన సత్యప్రమోదతీర్థుల స్వామీజీ 30వ చాతుర్మాస్య సందర్భంగా శనివారం నగరంలోని కాచిగూడ ఉత్తరాధి మఠంలో రూ. 108 స్మారక నాణాన్ని కేంద్రం ప్రభుత్వం విడుదల చేసింది. కార్యక్రమానికి కేంద్ర మంత్రి ప్రహ్లాద జోషి, విశ్రాంత కర్ణాటక ప్రధాన న్యాయమూర్తి పీఎస్. దినేశ్‌కుమార్, బ్రహ్మోస్ సీఈవో జయతీర్థజోషి హాజరయ్యారు. ఈ సందర్భంగా సత్యప్రమోదతీర్థుల స్వామిజీ అసాధరణ వ్యక్తిత్వాన్ని, సమాజానికి అందించిన అమూల్య సేవను వక్తలు కొనియాడారు.

అల్వాల్,ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి):

ఎమర్జింగ్ టెక్నాలజీస్‌పై సదస్సు

రాంగోపాల్‌పేట్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌లేషల్ రీసర్చ్, జనోమిక్స్, ఎమర్జింగ్ టెక్నాలజీస్‌పై ఒక రోజు సదస్సు జరిగింది. కిమ్స్ ఆసుపత్రికి అనుబంధంగా ఉన్న కిమ్స్ ఫౌండేషన్ అండ్ రీసర్చ్ సెంటర్(కేఎఫ్ఆర్‌సీ) ఆధ్వర్యంలో శనివారం మినిస్టర్ రోడ్డులోని కిమ్స్ ఆసుపత్రి ఆడిటోరియంలో కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ చైర్మన్ డాక్టర్ జి.ఎన్.రావు మాట్లాడుతూ ట్రాన్స్‌లేషన్ రీసర్చ్ వైద్య రంగానికి ఎంత ముఖ్యమో వివరించారు. కిమ్స్ సీఎండీ డాక్టర్ బొల్లినేని భాస్కర్ రావు, కేఎఫ్ఆర్‌సీ చైర్మన్ డాక్టర్ వి.భుజంగరావు మాట్లాడుతూ ఆధునాతన సాంకేతికలపై వైద్యులు దృష్టి పెట్టాలన్నారు. సదస్సులో డాక్టర్ సయ్యదా, న్యూరాలజిస్ట్ డాక్టర్ సుభాష్ కౌల్‌లతో పాటు సుమారు 100 మంది పాల్గొన్నారు.

ముగిసిన సివిల్ రంగ నిపుణుల శిక్షణ


శిక్షణలో సివిల్ రంగ నిపుణులు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు30 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణాల్లో కీలక పాత్ర పోషిస్తోన్న జాతీయ భవన నియమావళి (నేషనల్ బిల్డింగ్ కోడ్- ఎన్‌బీసీ) 2016లోని నిర్మాణ రూపకల్పన అంశంపై సివిల్ రంగ నిపుణులకు బీఐఎస్ హైదరాబాద్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణ శనివారంతో ముగిసింది. నగరంలోని మౌలాలీ బీఐఎస్ కార్యాలయంలో దేశంలోని విద్యాసంస్థలు, ప్రభుత్వ శాఖలు, పరిశ్రమలు, ప్రైవేట్ కన్సల్టెన్సీ సంస్థల నుంచి వచ్చిన 36 మంది ప్రతినిధులకు ఈనెల 27 నుంచి 30 వరకు శిక్షణ ఇచ్చారు. ముగింపు సందర్భంగా శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. బీఐఎస్ హైదరాబాద్ హెడ్ పీవీ శ్రీకాంత్‌తో పలువురు పాల్గొన్నారు.

'బాధితుల పక్షాన తీర్పు హర్షణీయం'

బర్కత్‌పుర, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ధన్వంతరి ఫౌండేషన్ ఇంటర్నేషనల్ ఖేల్ ఖతమైందని, మోసాలకు పాల్పడ్డ కమలాకర్‌శర్మ, జయశ్రీలపై ధన్వంతరి బాధితుల ఫోరం విజయం సాధించిందని ఫోరం కన్వీనర్ గిరిప్రసాద్‌శర్మ అన్నారు. బాధితుల పక్షాన న్యాయస్థానం తీర్పునిచ్చిందని, ఇది హర్షణీయమన్నారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ధన్వంతరి బాధితుల ఫోరం ఆధ్వర్యంలో బాధితులతో కలిసి ఆయన సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 29న నాంపల్లిలోని ఎంఎస్‌జే కోర్టు బాధితులకు అనుకూలంగా తీర్పునిచ్చిందన్నారు. ధన్వంతరి ఫౌండేషన్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు కమలాకరశర్మ ఆస్తులు మొత్తం అమ్మి బాధితులకు డబ్బులు ఇవ్వాలని కోర్టు తీర్పునిచ్చిందన్నారు.

విశ్వనియమాలు విశ్వ రహస్యాలు పుస్తకావిష్కరణ

చిక్కడపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రచయిత్రి, సంఘసేవకురాలు డా. లక్కరాజు నిర్మల రచించి రూపకల్పన చేసిన విశ్వనియమాలు విశ్వ రహస్యాలు పుస్తకం ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. శాంతాబయోటెక్ చైర్మన్ పద్మభూషణ్ డా. వరప్రసాద్‌రెడ్డి నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో పుస్తకాన్ని వరప్రసాద్‌రెడ్డి ఆవిష్కరించారు. నేటి, రేపటి తరానికి ఈ పుస్తకరచన ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

కవులు, కళాకారుల కృషి ఎంతో గొప్పది

చిక్కడపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సమాజాన్ని అభ్యుదయం, ప్రగతి పథంలో నడిపించడంలో కవులు, కళాకారుల కృషి ఎంతో గొప్పదని ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ దుర్గాప్రసాద్ అన్నారు. కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి త్యాగరాయగానసభలో ప్రసిద్ధ సాహితీవేత్త ఆరుద్ర శతజయంతి ముగింపు వేడుకలు జరిగాయి. సాహితీవేత్త డా. లగడపాటి సంగయ్యకు కిన్నెర ఆరుద్ర పురస్కారాన్ని దుర్గాప్రసాద్ బహూకరించి మాట్లాడారు. ప్రతీజాతికి చరిత్ర ఉంటుందని, సామాజికవేత్తలు చరిత్రకారులు జాతి శీలం నైతికత గుణశీలం వివరిస్తారన్నారు.

ఈవీఎం గోదాము పరిశీలన


హైదరాబాద్ సిటీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం నగరంలోని చుడీబజార్‌లో ఉన్న ప్రధాన ఈవీఎం గోదామును శనివారం హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ పరిశీలించారు. గోదాము లోపల ఉన్న వస్తువుల నిల్వ, భద్రతా స్థితిగతులు, స్టాక్ రిజిస్టర్లను గమనించారు. జూబ్లీహిల్స్ శాసనసభ ఉప ఎన్నిక కోసం భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మార్గదర్శకాల ప్రకారం అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదామును పరిశీలించారు.

చెస్ పోటీలు షురూ



దుద్దిళ్ల శ్రీపాదరావు ఆలిండియా ఓపెన్ ఫిడే చెస్ గోల్డ్‌కప్ టోర్నమెంట్‌ను శనివారం క్రీడా మంత్రి శ్రీహరి, శాట్ చైర్మన్ శివసేనారెడ్డి ప్రారంభించారు. అనంతరం మంత్రి.. చెస్ ఆడారు. సరూర్‌నగర్ స్టేడియంలో జరుగుతున్న ఈ పోటీల్లో 800 మంది క్రీడాకారులు విచ్చేశారు.

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి):



‘ఘాటి’లో దేశరాజు పాత్రకు విక్రమ్ ప్రభునే కావాలనుకున్నా. తన కళ్లలో ఒక బాధ కనిపిస్తుంది. అదే సమయంలో ఒక శక్తి కూడా ఉంటుంది. ఈ పాత్రకు డబ్బింగ్ కూడా ఆయనే చెప్పారు.

• సండే సెలబ్రిటీ

‘గమ్యం, కంచె, కృష్ణం వందే జగద్గురుం, గౌతమిపుత్ర శాతకర్ణి’ వంటి విజయవంతమైన చిత్రాల ద్వారా తెలుగువారికి దర్శకుడు క్రిష్ జాగర్లమూడి సుపరిచితుడు. తాజాగా ఆయన తీసిన ‘ఘాటి’ సినిమా వచ్చే వారం విడుదల కానుంది. ఆంధ్రా- ఒడిశా సరిహద్దులో జరిగే గంజాయి రవాణా ఇతివృత్తంగా రూపొందించిన ఈ సినిమాలో అనుష్క ప్రధానమైన పాత్ర పోషిస్తున్నారు. దర్శకుడిగా తన ప్రస్థానం గురించి.. ‘ఘాటి’ గురించి ‘నవ్య’కు క్రిష్ ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

గంజాయి అనేది సామాజిక సమస్య. చిన్న పిల్లలు ఈ భూతం బారిన పడుతున్నారు. జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.

మనిషి కథ చెప్పటం నాకిష్టం!

‘ఘాటి’ పేరు వెనకున్న కథేమిటి?

‘ఘాటి’ అనేది సంస్కృతంలో ‘ఘట్ట’ అనే పదం నుంచి పుట్టింది. ‘ఘాటి’ అనే కొండల్లో ఉండే లోతైన దారి అని అర్థం. ఆంధ్రా- ఒడిశా సరిహద్దుల్లోని కొండల్లో జరిగే కథ ఇది. ఈ కొండల అంచుల్లో చాలా గ్రామాలు ఉంటాయి. ఇక్కడ ‘శీలావతి’ అనే ప్రత్యేకమైన గంజాయి లభ్యమవుతుంది. దీనికి ప్రపంచవ్యాప్తంగా మంచి డిమాండ్ ఉంది. ఏటా వేల కోట్ల రూపాయల గంజాయి ఇక్కడ నుంచి అనేక ప్రాంతాలకు సరఫరా అవుతుంది. ఈ గ్రామాల్లో నివసించేవారే దీన్ని సరఫరా చేస్తారు. వీరి పూర్వీకులు బ్రిటిష్‌వారి సమయంలో కొండల్లో రోడ్లు వేసేవారు. ఎంత ఎత్తయిన కొండనైనా సునాయాసంగా ఎక్కగలుగుతారు. వీరికి ఆ కొండల ఆనుపానులన్నీ తెలుసు. వీరిని ‘ఘాటీలు’ అని కూడా పిలుస్తారు. ఒక్కొక్క ఘాటి 100 నుంచి 150 కేజీల గంజాయిని భుజం మీద మోస్తారు. ఈ నేపథ్యంలోని కథ కాబట్టి దీనికి ‘ఘాటి’ అని పేరు పెట్టాం.

ఈ కథ ఎలా పుట్టింది..?

కొవిడ్‌కు ముందు రచయిత చింతకింద శ్రీనివాసరావుగారు నాకు ఈ కథ చెప్పారు. నాకు చాలా నచ్చింది. ఎందుకంటే గంజాయి ఒక సామాజిక సమస్య. మీరు గమనిస్తే నా సినిమాల ఇతివృత్తాలన్నీ ఆయా కాలాల పరిస్థితులపై ఆధారపడి ఉంటాయి. గంజాయి అనేది ప్రస్తుతం మనం ఎదుర్కొంటున్న పెద్ద సమస్య కాబట్టి దీనిపై సినిమా తీయాలనుకున్నా. అంతే కాకుండా స్వీటీ (అనుష్క)తో నేను ఒక సినిమా చేయాల్సి ఉంది. అప్పుడప్పుడు తను... ‘సరోజ-2 చేద్దామా’ అని సరదాగా అడుగుతూ ఉండేది. ఈ కథ విన్నప్పుడు దానిలో శీలావతి పాత్రకు అనుష్క అతికినట్లు సరిపోతుందనిపించింది. మేము యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై రెండు సినిమాలు తీయాలనుకున్నాం. రాజీవ్‌రెడ్డి గారికి, మా నాన్న జాగర్లమూడి సాయిబాబాగారికి ఈ కథ చెప్పినప్పుడు- వారిద్దరికీ కథ బాగా నచ్చింది. దాంతో స్క్రిప్ట్‌వర్క్ ప్రారంభించాను.

అనుష్కనే ఎంచుకోవటానికి ప్రత్యేకమైన కారణముందా?

ఈ కథలో శీలావతి ఒక అద్భుతమైన పాత్ర. తను చల్లగా వీచే కొండగాలి లాంటిది. కానీ అవసరమైనప్పుడు తానే కొండగా మారుతుంది. ఒక అందమైన జీవితాన్ని జీవించే శీలావతి... ముందు బాధితురాలిగా మారుతుంది. ఆ తర్వాత తానే ఒక నేరస్తురాలు అవుతుంది. ఆ నేరస్తురాలు ఒక లెజెండ్‌గా మారుతుంది. ఈ పరిణామక్రమానికి అనుష్క మాత్రమే న్యాయం చేయగలదనిపించింది. వాస్తవ జీవితంలో కూడా ఆమె మృదుస్వభావి. మంచి మనిషి. అదే సమయంలో అవసరమైనప్పుడు చాలా దృఢంగా కూడా ఉంటుంది. అందుకే ఆమెను ఎంచుకొన్నాను.

‘హరిహర వీరమల్లు’ చారిత్రక చిత్రం.



‘ఘాటి’ వర్తమాన చిత్రం. ఒక చిత్రం నుంచి మరొక చిత్రానికి మారటం కష్టం అనిపించదా?

నేను స్వతహాగా కథకుడిని. మనుషుల కథను చెప్పటం నాకు ఇష్టం. ‘వీరమల్లు’ అయిన తర్వాత ‘ఘాటి’ తీద్దామనుకున్నాను. కానీ షెడ్యూల్స్ మారిపోవటంవల్ల ‘వీరమల్లు’ పూర్తి చేయలేకపోయాను. ‘ఘాటి’ కథ అప్పటికే నా దగ్గర ఉంది. ఇక్కడ ఒక విషయం చెప్పాలి. నా ప్రతి సినిమాలోనూ పాత్రలు కొత్తగా ఉంటాయి. ప్రతి పాత్రకూ ఒక జర్నీ ఉంటుంది. దానిని పట్టుకుంటే అద్భుతమైన పాత్ర ఆవిష్కృతమవుతుంది. ‘ఘాటి’ విషయానికి వస్తే... అదొక ప్రపంచం. ఇప్పటిదాకా ఎవరూ చూడని, చెప్పని ప్రపంచం. దీనిలో శీలావతిగా అనుష్క, దేశిరాజుగా విక్రమ్ ప్రభు, విశ్వదీప్ అనే పోలీస్ అధికారిగా జగపతిబాబు కనిపిస్తారు. కుందుల నాయుడు, కుష్టాల నాయుడు అనే ప్రతికూల పాత్రలు ఉంటాయి. ఈ పాత్రలన్నింటిలోనూ పొరలు పొరలుగా కోణాలుంటాయి. ఇవన్నీ ఒక దాని తర్వాత ఒకటి బయటకు వస్తుంటే చాలా ఎక్సైటింగ్‌గా అనిపిస్తుంది.



నా సినిమాల్లో ‘గమ్యం’ ఒక వ్యక్తి కథ. ‘వేదం’ ఒక సమాజం కథ. ‘కృష్ణం వందే జగద్గురుం’ అన్నం ముద్దలాంటి సమాజం మెతుకులుగా విడిపోతుంటే తీసిన కథ. అన్ని యుద్ధాలనూ ఆపివేయటానికి ఒక యుద్ధం చాలని ‘గౌతమిపుత్ర శాతకర్ణి’ చెబుతుంది.

వీఎఫ్ఎక్స్‌ల ఒరవడి నడుస్తోంది. ఈ సినిమాలో వీఎఫ్ఎక్స్‌లు ఎక్కువగా ఉంటాయా?

నా ఉద్దేశంలో వీఎఫ్ఎక్స్ అంటే సినిమాకు మేకప్ వేయటం. నేను అవసరమైనప్పుడే వీఎఫ్ఎక్స్‌లు ఉపయోగిస్తాను. ఈ సినిమాలో చాలా తక్కువ వాడాం. వీలైనంత వరకు నిజమైన లోకేషన్లలోనే షూటింగ్ చేయటానికి ఇష్టపడతా! ‘కంచె, గౌతమిపుత్ర శాతకర్ణి’ వంటి సినిమాల్లో కూడా యుద్ధాలకు నిజమైన లోకేషన్లే వాడాను.

సినిమాల్లో మీకు ఏ క్రాఫ్ట్ అంటే ఎక్కువ ఇష్టం?

నాకు రాయటం చాలా ఇష్టం. ఏదైనా కథ రాసేటప్పుడు కలిగే తృప్తి భిన్నంగా ఉంటుంది. కొన్నిసార్లు ఎంత ప్రయత్నించినా ఏమీ రాయలేం. కష్టపడి.. కష్టపడి రాయాల్సి వస్తుంది. ఇలా ఈ రాసే ప్రక్రియ పూర్తయ్యేలోగా... మొత్తం సినిమాను ముందుగానే చూసేస్తాం. దర్శకుడు అంతఃచక్షువులతో చూసి ప్రేక్షకులకు బాహ్యచక్షువులతో చూపిస్తాడు.

మీ సినిమాల్లో పాత్రలు విలువలతో బలంగా ఉంటాయి. వీటిని ఎలా రూపొందిస్తారు?

నేను మానవ జాతిని ప్రేమిస్తాను. ఈ ప్రకృతిలో మనిషి ఒక అద్భుతం. మానవ సమాజం ఒక అద్భుతం. ఇలాంటి మనిషి కథ చెప్పటం నాకు ఇష్టం. సమాజం పతనావస్థకు వెళ్లిపోయిందనుకున్న ప్రతిసారీ... ఆ సమాజం మరింత బలమైన పునాదులతో పైకి వెళ్తూ ఉంటుంది. మానవ పరిణామక్రమంలో దీనిని మనం స్పష్టంగా చూడవచ్చు. వృత్తిపరంగా నేను దర్శకుడిని కాబట్టి నా చుట్టూ ఉన్న పరిస్థితులను గమనిస్తూ ఉంటా. వాటిలో కొన్ని నాకు తెలియకుండా మెదడులో పూసలుగా చేరిపోతాయి. అవసరమైనప్పుడు ఈ పూసలన్నీ దండగా మారి బయటకు వస్తాయి. కథలో కూర్చుంటాయి.

‘కొండపొలం, ఘాటి’... ఇలా భిన్నమైన సినిమాలు తీసేటప్పుడు భయమేయదా?

సుమారు 17 సంవత్సరాల క్రితం నేను సినీ రంగంలోకి ప్రవేశించా. నాకు నచ్చిన కథలను చెప్పటానికి ‘సినిమా’ అనే మాధ్యమాన్ని ఎంచుకున్నా. నేను చెప్పే కథలకు కావాల్సిన నటీనటులను, బడ్జెట్‌ను ఎంచుకొని- అందరికీ నచ్చేటట్లు కథ చెప్పటానికి ప్రయత్నిస్తున్నా. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. నా ఉద్దేశంలో ఇక్కడ ఎవరూ ఎవరికీ పోటీ కాదు. ఒక్కొక్కరిదీ ఒకో శైలి. ఒక జర్నీ. చలం... రావిశాస్త్రి, శ్రీపాద సుబ్రమణ్య శాస్త్రి, విశ్వనాథ... ఈ రచయితల్లో ఎవరు గొప్ప అని అడిగితే ఎలా చెప్పగలం?

• సీవీఎల్ఎన్ ప్రసాద్

మనం ఎంతో ఇష్టంగా పెంచుకునే మొక్కలు ఒక్కోసారి వడలిపోయి కనిపిస్తుంటాయి. అలాంటప్పుడు మొక్కలను ఎలా సంరక్షించుకోవాలో తెలుసుకుందాం...

మొక్కలు వాడిపోతున్నాయా?

- బియ్యం కడిగిన నీళ్లను ఒక స్ప్రే బాటిల్‌లో పోసి ఉంచుకోవాలి. రోజుకు ఒకసారి ఈ నీళ్లను మొక్క మొదట్లో, కాండం పైన, ఆకుల మీద పిచికారీ చేయాలి. ఇలా వారంపాటు చేస్తే మొక్కలు బలం పుంజుకుంటాయి.
- కూరగాయల వ్యర్థాలు, కోడిగుడ్ల పెంకులు, ఉల్లిపాయ తొక్కలను మొక్కల మొదట్లోని మట్టిలో కలుపుతూ ఉండాలి. దీనివల్ల పోషకాలు అంది మొక్కలు బలంగా



పెరుగుతాయి.
- అరటిపండు తొక్కలను చిన్న ముక్కలుగా చేయాలి. వీటిని ఒక ప్లాస్టిక్ బాటిల్‌లో వేసి నిండా నీళ్లు పోసి రాత్రంతా నాననివ్వాలి. ఈ నీటిని రోజుకు రెండుసార్లు మొక్కల మొదట్లో కొద్దికొద్దిగా పోయాలి. అరటిపండు తొక్కల్లోని పొటాషియం.. మొక్కలకు జీవాన్ని అందిస్తుంది.
- ఒక బకెట్ నీళ్లలో రెండు చెంచాల పసుపు వేసి బాగా కలపాలి. ఈ నీళ్లతో మొక్కల కాండాన్ని, ఆకులను బాగా తడపాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తూ ఉంటే క్రిమికీటకాలు నశించి మొక్కలు ఏపుగా పెరుగుతాయి.
- రోజులో కొద్దిసేపయినా మొక్కలకు సూర్యరశ్మి అందేలా చూసుకోవాలి. అధిక వేడి, వర్షాల నుంచి మొక్కలను కాపాడాలి. మొక్కల మొదట్లో మట్టి ఎప్పుడూ తేమగా ఉండేలా చూసుకోవాలి.
- ఎండిపోయిన కొమ్మలు, ఆకులు, పూలను ఎప్పటికప్పుడు తొలగించాలి. మొక్కల అవసరాలకు తగ్గట్టుగా సేంద్రీయ ఎరువులను అందించాలి. అప్పుడే మొక్కలు ఆరోగ్యంగా పెరుగుతాయి.


పర్వదినాల్లో మహిళలు పట్టుచీరలు కట్టుకుని దేవాలయాలకు, బంధుమిత్రుల ఇళ్లకు వెళుతూ ఉంటారు. ఆ సమయంలో అనుకోకుండా వర్షం కురిస్తే ఎంత జాగ్రత్తగా ఉన్నప్పటికీ పట్టుచీరలు కొద్దో గొప్పో తడిసి తేమను పీల్చుకుంటాయి. అలాంటప్పుడు పట్టుచీరలను సంరక్షించుకునే పద్ధతులతోపాటు వర్షాకాలంలో ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో తెలుసుకుందాం...

వర్షాకాలంలో పట్టుచీరలను ఇలా..

- తేమవల్ల పట్టుచీర మీద ఒకరకమైన బూజు ఏర్పడుతుంది. దీంతో దారం పోగులు బలహీనమవుతాయి. చీర చిరుగులు పడుతుంది. కాబట్టి తడిసిన పట్టుచీరను గాలి తగిలేలా నీడలో ఆరవేయాలి.
- ఇస్త్రీ చేసిన తరవాత పట్టుచీర నుంచి కొద్దిపాటి తేమ బయటికి వస్తుంది. చీర పూర్తిగా వేడి చల్లారే వరకు వేచి ఉండాలి. ఏమాత్రం తడి లేదని నిర్ధారించుకున్న తరవాతనే బీరువాలో పెట్టాలి.
- పట్టుచీరలను పలుచని కాటన్ వస్త్రం లేదా పేపర్లో చుట్టి జాగ్రత్త చేయాలి. దీనివల్ల వాతావరణంలోని తేమ, దుమ్ము లాంటివి చీరకు పట్టకుండా ఉంటాయి. ఈ చీరలను ప్లాస్టిక్ కవర్లలో పెట్టి ప్యాక్ చేయకూడదు. అలా చేస్తే ఫంగస్ లాంటివి చేరి పాడుచేస్తాయి.
- బీరువాలో పట్టుచీరలను ఉంచిన అరల్లో ఒకటి లేదా రెండు సిలికా జెల్ సాచెట్లను ఉంచడం మంచిది. ఇవి తేమను పీల్చుకుని చీరలను పొడిగా ఉంచుతాయి. కొద్దిగా రాతి ఉప్పు, బేకింగ్ సోడా, చార్‌కోల్ పొడిలో ఒకదాన్ని తీసుకుని చిన్న కాగితాల్లో కొద్దికొద్దిగా వేసి పొట్లాలు కట్టి వాటిని బీరువా అరల్లో ఉంచినా మంచి ప్రయోజనం కనిపిస్తుంది. రెండు వారాలకు ఒకసారి ఈ పొట్లాలను మారుస్తూ ఉండాలి.
- కర్పూరం బిళ్లలు, కలరా ఉండలు, ఎండిన వేపాకులను పలుచని గుడ్డలో చుట్టి బీరువా అరల్లో ఉంచడం వల్ల సిల్వర్ ఫిష్, చిమ్మటలు లాంటి క్రిమి కీటకాలు చేరకుండా ఉంటాయి.



- నెలకు ఒకసారి పట్టుచీరలను బయటికి తీసి మడతలు విప్పి మెల్లగా దులపాలి. తరవాత మరో విధంగా మడతపెట్టి జాగ్రత్త చేయాలి. చీరలు తేమగా ఉన్నాయనిపిస్తే కొద్దిసేపు లేత ఎండలో ఆరవేయాలి. సూర్యరశ్మి నేరుగా తగిలితే చీరలు రంగు కోల్పోయే అవకాశముంటుంది. కాబట్టి తగు జాగ్రత్తలు తీసుకోవాలి.
- బీరువా అమర్చిన చోట నేరుగా ఎండ తగలకుండా చూసుకోవాలి. బీరువా వెనక గోడ నుంచి లీకేజీ, చెమ్మ రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. బీరువా కింద, పక్కల.. బూజు, దుమ్ము చేరకుండా తరచూ శుభ్రం చేస్తూ ఉండాలి. అప్పుడే బీరువాలోని పట్టుచీరలు చాలాకాలం మన్నుతాయి.





ఈ వారమే విడుదల ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా ఓటీటీల్లో విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌లు...		
ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
ది ఫాల్ గై	తెలుగు డబ్బింగ్	సెప్టెంబర్ 03
ఇన్‌స్పెక్టర్ జెండే	హిందీ చిత్రం	సెప్టెంబర్ 05
అమెజాన్ ప్రైమ్		
ది రన్ ఎరౌండ్స్	ఒరిజినల్ సిరీస్	సెప్టెంబర్ 01
కాన్ఫిడెన్స్ క్వీన్	వెబ్‌సిరీస్	సెప్టెంబర్ 06
జియో హాట్‌స్టార్		
సు ఫ్రమ్ సో	తెలుగు డబ్బింగ్	సెప్టెంబర్ 05
ఆపిల్ టీవీ ప్లస్		
హయ్యెస్ట్ టూ లోయెస్ట్	హాలీవుడ్ మూవీ	సెప్టెంబర్ 05
ఎంఎక్స్ ప్లేయర్		
రైజ్ అండ్ ఫాల్	హిందీ సిరీస్	సెప్టెంబర్ 06

సవాళ్లను అధిగమించి.. గెలిచి...

నవమాసాలు మోసిన కన్న తల్లి తనను ఏడాది వయసులోనే వదిలించుకున్నా.. 15 ఏళ్లకే ఇల్లు వదిలి వెళ్లిపోవలసి వచ్చినా కుంగిపోలేదామె. అంచెలంచెలుగా ఎదుగుతూ ఏకంగా వంద కోట్లకు పైగా విలువైన “రూబన్స్ యాక్సెసరీస్”కు అధిపతిగా మారారు. ఆమే ముంబైకు చెందిన చీనూ కాలా... ఆమె ప్రయాణంలోని ఆసక్తికర విషయాలివీ...

చీనూ కాలాకు మొదటినుంచీ చదువంటే పెద్దగా ఆసక్తి లేదు. డ్యాన్స్, ఫ్యాషన్, మోడలింగ్ పట్ల ఎంతో మక్కువ. అయినా తండ్రి కోసం చదువుకు ప్రాధాన్యమిచ్చారు. కానీ 15 ఏళ్ల వయసులో చీనూకు తండ్రితో గొడవైంది. దాంతో గుండె నిండా బాధతో, చేతిలో 300 రూపాయలతో ఇంట్లోంచి బయటకు వచ్చేశారు. ఆ తరువాత పొట్టకూటి కోసం ఆమె చేయని పని లేదు. 20 రూపాయల కోసం ఇళ్ల చుట్టూ తిరిగి కత్తులు, కోస్టర్ సెట్‌లు అమ్మారు. రిసెప్షనిస్టుగా, రెస్టారెంట్‌లో వెయిట్రెస్‌గా పని చేశారు. వస్త్ర దుకాణంలోనూ పనిచేశారు. బ్రతుకుతెరువు కోసం పలు ఉద్యోగాలు కూడా చేశారు.

ఆ ఉద్యోగంతో...

2002లో చీనూకు టాటా కమ్యూనికేషన్స్‌లో టెలీ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌గా ఉద్యోగం వచ్చింది. ఆ ఉద్యోగమే ఆమె జీవితాన్ని మలుపు తిప్పింది. అక్కడే ఆమెకు అమిత్ కాలా పరిచయమయ్యారు. ఆ పరిచయం ప్రేమగా మారింది. అలా వారిద్దరూ 2004లో వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. ఆ తరువాత చీనూ భర్తతో కలిసి బెంగళూరుకు వెళ్లిపోయారు. చీనూకు మోడలింగ్ పట్ల ఉన్న ఇష్టాన్ని తెలుసుకున్న అమిత్ దానిని గౌరవించి ఆమెకు వెన్నుదన్నుగా నిలిచారు. అమిత్ సహకారంతో చీనూ 2008 గ్లాడ్రాగ్స్ మిసెస్ ఇండియా పోటీల్లో పాల్గొని, టాప్ 10లో చోటు సంపాదించుకున్నారు. ఆ సమయంలోనే ఫ్యాషన్ రంగంలో జ్యూవెలరీ, యాక్సెసరీస్ అవసరం ఉందని చీనూ గుర్తించారు.

లోతుగా అధ్యయనం చేసి...

ఆ తరువాత చీనూ దేశవ్యాప్తంగా ఎన్నో ప్రాంతాలు తిరిగి ఆభరణాల గురించి క్షుణ్ణంగా తెలుసుకున్నారు. మార్కెట్‌లో ఎలాంటి జ్యూవెలరీ అందుబాటులో ఉన్నాయి, వాటిని ఎలా, ఎక్కడ తయారుచేస్తున్నారు వంటి అంశాల గురించి తెలుసుకున్నారు.. ఆభరణాల గురించి పూర్తి అవగాహన తెచ్చుకుని 2014లో 3 లక్షల రూపాలయలతో బెంగళూరులో ఓ మాల్‌లో రూబన్స్ యాక్సెసరీస్ స్టోర్‌ను ప్రారంభించారు. ఆపై నాలుగేళ్లలోనే బెంగళూరు, హైదరాబాద్, కొచ్చిల్లో అయిదు స్టోర్‌లు ఏర్పాటు చేసే స్థాయికి ఆమె వ్యాపారం పుంజుకుంది. మొదట హెడ్ యాక్సెసరీస్‌తో ఆమె ప్రారంభించిన రూబన్ యాక్సెసరీస్ సంస్థ నేడు తల నుంచి కాళ్ల పట్టీల వరకూ, అన్ని అభరణాలతో పాటు హ్యాండ్ బ్యాగుల వంటి యాక్సెసరీలను అమ్మే స్థాయికి విస్తరించి, రూ.వంద కోట్లకు పైగా టర్నోవర్ సాధిస్తూ జ్యూవెలరీ రంగంలో దూసుకుపోతుంది.



భయపడితే ఏదీ సాధించలేం..

విభిన్న డిజైన్లలో ఆభరణాలు రూపొందిస్తూ మగువల మనసులు దోచుకుంటున్న చీనూ.. భయపడితే ఏదీ సాధించలేమని చెబుతున్నారు. సవాళ్లు ఎదుర్కొంటేనే విజయం దరి చేరుతుందని ఓ సందర్భంలో ఆమె చెప్పారు. అలాగే కష్టపడితేనే ఫలితం ఉంటుందనీ, తాను రోజుకు 15 గంటలపైనే కష్టపడేదానినని వెల్లడించారు. “నేను పెద్దగా చదువుకోలేదు. కనీసం పాఠశాల విద్య కూడా పూర్తి చేయలేదు. కానీ జీవితంలో ఎదురైన అనుభవాల నుంచి ఎన్నో విలువైన జీవిత పాఠాలు నేర్చుకున్నాను” అని చీనూ చెప్పారు. తాను రైల్వే స్టేషన్‌లో తలదాచుకున్నప్పుడు ఎంతో మంది తిరిగి ఇంటికి వెళ్లిపోమని తనకు సలహా ఇచ్చారని, కానీ తాను మాత్రం ఎదురైన అన్ని ఒడిదొడుకులను తట్టుకుని ధైర్యంగా ముందుకు సాగానని గుర్తుచేసుకున్నారు. తాను ఆనాడు అంత దృఢంగా ఉండడం వలనే ఈనాడు ఈ స్థాయిలో ఉన్నానని చీనూ అంటున్నారు.



పోషకాహార లోపం, హార్మోన్ల అసమతౌల్యం, నెలసరి సమస్యల కారణంగా ఒక్కోసారి ముఖం మీద మొటిమలు, గుల్లలు, గడ్డలు ఎక్కువగా వస్తూ ఉంటాయి. వీటివల్ల మచ్చలు కూడా ఏర్పడుతుంటాయి. కొన్ని ఇంటి చిట్కాలు పాటిస్తూ వీటినుంచి ఉపశమనం పొందవచ్చు.

మెరిసే చర్మం కోసం...

- ఒక ఐస్ క్యూబ్‌ను పలుచని గుడ్డలో చుట్టి మొటిమలు, గడ్డలపై మెల్లగా అద్దాలి. ఇలా తరచూ చేస్తూ ఉంటే క్రమంగా మొటిమలు తగ్గుతాయి.
- ఒక గిన్నెలో రెండు చెంచాల శనగపిండి, ఒక చెంచా పసుపు, తగినన్ని గులాబీ నీళ్లు పోసి పేస్టులా చేయాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి పావు గంటసేపు ఆరనివ్వాలి. తరవాత వేళ్ల కొనలతో ముఖం మీద గుండ్రంగా రుద్దుతూ పిండిని తొలగించాలి. వెంటనే గోరువెచ్చని నీటితో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తే చర్మం మీద ఉన్న మృతకణాలు తొలగి, మొటిమలు, మచ్చలుతగ్గి ముఖం ప్రకాశవంతంగా మారుతుంది.
- ఒక గిన్నెలో రెండు చెంచాల గంధం పొడి లేదా ముల్తాని మట్టి వేసి తగినన్ని నీళ్లు పోసి కలపాలి. ఈ పేస్టుని ముఖానికి పట్టించాలి. పావుగంటసేపు ఆరనిచ్చి చల్లని నీళ్లతో శుభ్రం చేసుకుంటే ముఖం మీద పేరుకున్న జిడ్డు తొలగిపోతుంది. మొటిమలు కూడా తగ్గుతాయి.
- బాగా పండిన టమాటాను మధ్యకు కోసి ఆ బద్దతో ముఖాన్ని కింది నుంచి పైకి మృదువుగా మర్దన చేయాలి. ఇలా పది నిమిషాలపాటు చేసిన తరవాత చల్లని నీళ్లతో ముఖాన్ని కడిగేసుకోవాలి. రెండు రోజులకు ఒకసారి ఇలా చేస్తూ ఉంటే ముఖం మీద మచ్చలన్నీ మాయమవుతాయి.

అల్లు అరవింద్ మాతృమూర్తి కన్నుమూత









దివంగత హాస్యనటుడు అల్లు రామలింగయ్య సతీమణి, అల్లు అరవింద్ తల్లి... కనకరత్నం (94) శుక్రవారం అర్ధరాత్రి దాటాక కన్నుమూశారు. శనివారం సాయంత్రం ఆమె అంత్యక్రియలు కోకాపేట్‌లో నిర్వహించారు. అల్లు అరవింద్ ఫామ్‌హౌస్‌లో అల్లు రామలింగయ్య సమాధి పక్కన కనకరత్నం అంత్యక్రియలు నిర్వహించారు. చిరంజీవి, అల్లు అర్జున్ పాడె మోశారు. అల్లు అరవింద్ అంతిమ సంస్కారాలను నిర్వహించారు. అంతిమ యాత్రలో అల్లు శిరీష్, రామ్‌చరణ్ సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. అల్లు కనకరత్నం కోరిక మేరకు ఆమె నేత్రాలను అల్లు కుటుంబం చిరంజీవి ఐ బ్యాంక్‌కు దానం చేసింది. కనకరత్నమ్మ నేత్రదానం ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని చిరంజీవి కొనియాడారు.

నార్సింగ్ (ఆంధ్రజ్యోతి)



నాకు మాత్రం ఆయన ముద్దుల మావయ్య

నారా లోకేశ్

'చరిత్ర సృష్టించాలన్నా.. దాన్ని తిరగ రాయాలన్నా మావయ్య బాలయ్యకే సొంతం. ఆయనకున్నంత ఎనర్జీ మా తరంలో ఎవ్వరికీ లేదు. ఆయన ఇప్పటికీ యువకుడే. మీ అందరికీ ఆయన బాలయ్య బాబు కానీ నాకు మాత్రం ముద్దుల మావయ్య.' అని ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. హీరోగా ఇండస్ట్రీలో 50 ఏళ్లు పూర్తిచేసుకున్నందుకు నందమూరి బాలకృష్ణ ప్రతిష్ఠాత్మక వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ - యూకే గోల్డ్ ఎడిషన్‌లో స్థానం దక్కించుకున్న సంగతి తెలిసిందే. భారతీయ సినీ పరిశ్రమలో ఈ ఘనత సాధించిన తొలి నటుడు ఆయనే కావడం విశేషం. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ కమిటీ నందమూరి బాలకృష్ణను శనివారం సర్టిఫికెట్, ప్రత్యేక జ్ఞాపికతో సన్మానించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నారా లోకేశ్, కేంద్రమంత్రి బండి సంజయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నారా లోకేశ్ మాట్లాడుతూ 'బాలకృష్ణ గారు యాభై ఏళ్లుగా సినీ రంగంలో, తర్వాత రాజకీయాల్లోనూ ప్రత్యేక స్థానం సాధించుకున్నారు. ఆయన భోళా శంకరుడు. ఏదీ మనసులో దాచుకోరు. బాలయ్య బాబుగారు ఎప్పుడూ అన్‌స్టాపబుల్. ఆయనకు ఈ గుర్తింపు దక్కడం మనందరికీ గర్వకారణం' అన్నారు. బాలకృష్ణ మాట్లాడుతూ 'నాకు జన్మనిచ్చి, మీ అందరి హృదయాల్లో నిలిపిన దైవాంశ సంభూతులు నాన్న ఎన్టీఆర్‌కూ, అమ్మ బసవతారకం గారికి నా నివాళులు. అభిమానులకూ, చిత్ర పరిశ్రమకు జీవితాంతం రుణపడి ఉంటాను. నాకు ఈ గౌరవం కల్పించిన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ కమిటీకి నా కృతజ్ఞతలు. ఈ సందర్భంగా నాకు శుభాకాంక్షలు, ఆశీస్సులు అందించిన హీరోలు అమితాబ్ బచ్చన్, రజనీకాంత్‌కు ధన్యవాదాలు. తెలంగాణలో వరద బాధితులను ఆదుకునేందుకు సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.50 లక్షలు విరాళంగా ఇస్తున్నాను' అని చెప్పారు. బండి సంజయ్ మాట్లాడుతూ 'ఏదైనా ముక్కుసూటిగా చెప్పే మనస్తత్వం గల వ్యక్తి బాలకృష్ణ. ఆయన ఈ ఘనత సాధించడం తెలుగు ప్రజలకు గర్వకారణం. ఆయన నిండు నూరేళ్లు ఇదే జోష్‌తో కొనసాగాలని కోరుకుంటున్నా' అని తెలిపారు.













కాంస్యమే.. అయినా చరిత్రే!



సాత్విక్ జోడీ ఖాతాలో రెండో పతకం

సెమీఫైనల్లో భారత జంట ఓటమి

పారిస్: ప్రతిష్ఠాత్మక ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో తెలుగు కుర్రాడు సాత్విక్ సాయిరాజ్, ముంబై షట్లర్ చిరాగ్ శెట్టి పతకంతో మెరిశారు. పురుషుల డబుల్స్‌లో కాంస్య పతకం సాధించారు. శనివారం అర్ధ రాత్రి ఇక్కడ జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో అమలాపురం కుర్రాడు సాత్విక్, చిరాగ్ ద్వయం 19-21, 21-18, 12-21తో చైనాకు చెందిన 11వ ర్యాంకర్ చెన్ బో యాంగ్/లియు యి జంట చేతిలో పరాజయం పాలైంది. దీంతో భారత జోడీ కంచు పతకానికి పరిమితమైంది. ప్రపంచ తొమ్మిదో ర్యాంకరైన సాత్విక్/చిరాగ్ జంటకు ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఇది రెండో పతకం కావడం విశేషం. గతంలో 2022 టోక్యో ఈవెంట్‌లో కాంస్య పతకం దక్కించుకుంది. దీంతో ఈ మెగా టోర్నీ పురుషుల డబుల్స్‌లో రెండు పతకాలు నెగ్గిన భారత షట్లర్లుగా సాత్విక్, చిరాగ్ నయా చరిత్ర సృష్టించారు. అంతేకాదు.. పీవీ సింధు (ఓ స్వర్ణం, రెండు రజతాలు, రెండు కాంస్యాలు), సైనా నెహ్వాల్ (ఓ రజతం, ఓ కాంస్యం) తర్వాత ఒకటి కంటే ఎక్కువ ప్రపంచ పతకాలు నెగ్గిన భారత షట్లర్లుగానూ ఘనత వహించారు. ఇక.. సాత్విక్ ద్వయం సెమీస్ చేరికతో ప్రపంచ చాంపియన్‌షిప్‌లో 2011 నుంచి కనీసం ఒక పతకం గెలుస్తూ వచ్చిన భారత సంప్రదాయాన్ని కొనసాగించినట్టయింది. కాగా.. శుక్రవారం అర్ధ రాత్రి జరిగిన క్వార్టర్‌ఫైనల్లో సాత్విక్/చిరాగ్ ద్వయం 21-12, 21-19తో చిరకాల ప్రత్యర్థి, మలేసియాకు చెందిన వరల్డ్ నెం.3 జంట ఆరోన్ చియా/సో వూ యిక్‌జీ షాకిచ్చి సెమీఫైనల్ చేరింది. గత ఏడాది ఇదే మలేసియా జోడీ చేతిలో క్వార్టర్ ఫైనల్ ఓటమితో పారిస్ ఒలింపిక్స్ పతకాన్ని సాత్విక్ జంట మిస్సవడం గమనార్హం. ఈ విజయంతో ఆ పరాజయానికి భారత ద్వయం ప్రతీకారం తీర్చుకుంది. పురుషుల డబుల్స్ మరో సెమీఫైనల్లో కొరియాకు చెందిన సియో సంగ్ జె/కిమ్ వోన్ హో ద్వయం 21-12, 21-3తో డెన్మార్క్‌కు చెందిన డిఫెండింగ్ చాంప్ జోడీ కిమ్ ఆస్ట్రప్/స్కారప్ రాస్ముసెన్‌పై గెలిచి ఫైనల్ చేరింది. ఆదివారం జరిగే తుది పోరులో చైనా జంట చెన్ బో యాంగ్/లియు యితో అమీతుమీ తేల్చుకోనుంది. పురుషుల సింగిల్స్‌లో థాయ్‌లాండ్ షట్లర్ కున్లావత్ వితిసార్న్, చైనాకు చెందిన ప్రపంచ నెంబర్‌వన్ షి యుకి టైటిల్ పోరులో అమీతుమీ తేల్చుకోనుండగా.. మహిళల సింగిల్స్‌లో చైనా సంచలనం చెన్ యుఫీ, జపాన్ షట్లర్ అకానె యమగూచి ఫైనల్లో తలపడనున్నారు.

కొరియాకు మలేసియా ఝలక్

● ఆసియా కప్ హాకీ

నేటి మ్యాచ్
భారత్ X జపాన్
మ. 3 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో

రాజ్‌గిర్ (బిహార్): ఆసియా కప్ హాకీ టోర్నీలో కొరియా టైటిల్ ఆశలకు గట్టి దెబ్బ తగిలింది. శనివారం జరిగిన పూల్ 'బి' మ్యాచ్‌లో ఐదుసార్లు చాంపియన్ కొరియాకు 4-1తో మలేసియా ఝలకిచ్చింది. జియోనియో జిన్ రెండో నిమిషంలోనే గోల్ చేసి కొరియాను ఆధిక్యంలో నిలిపాడు. కానీ తర్వాత అద్భుతంగా పుంజుకొన్న మలేసియా అఖీముల్లా (29, 34, 58) హ్యాట్రిక్‌తోపాటు అష్రన్ ఫీల్డ్ గోల్‌తో అనూహ్య విజయం దక్కించుకుంది. పూల్ 'బి' మరో మ్యాచ్‌లో బంగ్లాదేశ్ 8-3తో తైపీని చిత్తు చేసింది.

రాజస్థాన్ కోచింగ్‌కు ద్రవిడ్ గుడ్‌బై

● ఫ్రాంచైజీతో విభేదాలే కారణమా?



న్యూఢిల్లీ: ఐపీఎల్ జట్టు రాజస్థాన్ రాయల్స్ చీఫ్ కోచ్ పదవి నుంచి రాహుల్ ద్రవిడ్ వైదొలిగాడు. ఈ విషయాన్ని రాజస్థాన్ యాజమాన్యం శనివారం ప్రకటించింది. 'పునర్ వ్యవస్థీకరణలో భాగంగా ద్రవిడ్‌కు ఉన్నతమైన స్థానం కోసం ప్రతిపాదించాం. కానీ, అతడు దానిని తిరస్కరించాడు. జట్టును వీడాలనుకొన్నాడు' అని ఎక్స్‌లో రాజస్థాన్ పోస్టు చేసింది. గతేడాది టీమిండియా కోచ్‌గా కాంట్రాక్ట్ ముగిసిన తర్వాత.. రాజస్థాన్ కోచ్‌గా ద్రవిడ్ నియమితులయ్యాడు. అయితే, కొన్నేళ్లపాటు జట్టుతో కొనసాగే విధంగా ఒప్పందం కుదుర్చుకొన్నా.. ఒక్క సీజన్‌కే తప్పుకోవడం గమనార్హం. కెప్టెన్ సంజూ శాంసన్ కూడా తనను విడుదల చేయాలని ఫ్రాంచైజీని కోరినట్టు ఇప్పటికే వార్తలు వెలువడ్డాయి. ఇప్పుడు ద్రవిడ్ కూడా వైదొలగడం ఎన్నో అనుమానాలకు తావిస్తోంది. ముఖ్యంగా కొత్త కెప్టెన్ విషయంలో యాజమాన్యంతో ద్రవిడ్ విభేదించాడనే వార్తలు వినవస్తున్నాయి. శాంసన్ జట్టును వీడే అవకాశాలు ఉండడంతో రియాన్ పరాగ్‌కు సారథ్య బాధ్యతలు అప్పగించాలని ఫ్రాంచైజీ భావిస్తోందట. ఈ సీజన్‌లో గాయపడిన సంజూ బ్యాటింగ్‌కే పరిమితం కాగా.. పరాగ్ ఎక్కువ మ్యాచ్‌లకు సారథ్యం వహించాడు. అయితే, నిరుడు ప్లేఆఫ్స్ చేరిన రాయల్స్.. ఈ ఏడాది తొమ్మిదో స్థానంలో నిలిచింది. ఈ నేపథ్యంలో పరాగ్‌కు సారథ్యం అప్పగించడంపై సుముఖంగా లేని ద్రవిడ్.. జట్టులోని జైస్వాల్, జురెల్ పేర్లను పరిగణనలోకి తీసుకోవాలని కోరాడట. అయితే, రాయల్స్ యాజమాన్యం మాత్రం పరాగ్‌వైపే మొగ్గుచూపుతుండడంతో.. జట్టును వీడాలని ద్రవిడ్ నిర్ణయం తీసుకున్నాడని తెలిసింది.

ఆసియాకప్ సమయం మారింది

● రాత్రి 8 నుంచి మ్యాచ్‌లు

దుబాయ్: యూఏఈలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఆసియాకప్ టీ20 మ్యాచ్‌ల సమయాలను మార్చారు. సెప్టెంబరు 9 నుంచి టోర్నీ జరగనుండగా.. ఈ సమయంలో అక్కడ ఎండ వేడిమి 40 డిగ్రీల వరకు ఉండనుంది. రాత్రి ఏడు గంటల వరకు కూడా వేడి తీవ్రత కొనసాగే అవకాశం ఉంది. దీంతో ఆటగాళ్ల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సమయం మార్చాల్సిందిగా ప్రసారకర్తలకు భారత్ సహా పాకిస్థాన్, శ్రీలంక, అఫ్ఘానిస్థాన్, బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డులు విజ్ఞప్తి చేశాయి. దీంతో 18 మ్యాచ్‌లను అర్ధగంట వెనక్కి జరపగా, భారత కాలమాన ప్రకారం రాత్రి 8 గంటలకు మ్యాచ్‌లు ఆరంభమవుతాయి. అయితే ఒక్క మ్యాచ్ (అబుధాబిలో సెప్టెంబరు 15) మాత్రం సాయంత్రం 5.30కి మొదలు కానుంది.

ఫిట్‌నెస్ టెస్టుకు సిద్ధం

బెంగళూరు: ఆసియాకప్ ఆరంభానికి ముందు ఫిట్‌నెస్ టెస్టు కోసం భారత ఆటగాళ్లంతా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీఓఏ)కి చేరుకుంటున్నారు. వన్డే కెప్టెన్ రోహిత్ శర్మతో పాటు టీ20 వైస్‌కెప్టెన్ శుభ్‌మన్ గిల్, పేసర్లు బుమ్రా, సిరాజ్, జైస్వాల్, శార్దూల్ ఠాకూర్ ప్రస్తుతం సీఓఏలోనే ఉన్నారు. ఇక హర్షిత్, అర్ష్‌దీప్, కుల్దీప్ బెంగళూరులోనే దులీప్ ట్రోఫీ ఆడుతున్నారు. రోహిత్ వన్డేలకు మాత్రమే పరిమితమైన విషయం తెలిసిందే. ఇక భారత ఆటగాళ్లకు కొత్తగా ప్రవేశపెట్టిన బ్రాంకో టెస్టు ద్వారా ఫిట్‌నెస్‌ను పరీక్షించే అవకాశం ఉంది.

తొక్కిసలాట మృతులకు రూ.25 లక్షలు

ఆర్‌సీబీ ప్రకటన

బెంగళూరు (ఆంధ్రజ్యోతి): తమ జట్టు విజయోత్సవాల్లో తొక్కిసలాట కారణంగా మృతి చెందిన వారికి రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు నష్టపరిహారాన్ని పెంచింది. ఐపీఎల్ చరిత్రలో తొలిసారిగా ఆర్‌సీబీ ఈ ఏడాది విజేతగా నిలిచిన విషయం తెలిసిందే. దీంతో చిన్నస్వామి స్టేడియంలో సంబరాలు చేసుకునే సమయంలో బయట తొక్కిసలాట జరిగి 11 మంది మృతి చెందారు. ఆ సమయంలో ఆర్‌సీబీ రూ.10 లక్షల చొప్పున నష్టపరిహారం ప్రకటించింది. తాజాగా ఆర్‌సీబీ కేర్స్ పేరిట విడుదల చేసిన ప్రకటనలో ఒక్కో అభిమాని కుటుంబానికి రూ.25 లక్షల చొప్పున ఇవ్వనున్నట్టు వెల్లడించింది.

టైటాన్స్ రెండో ఓటమి

ప్రొ కబడ్డీలో యోధాస్ గెలుపు



విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్)లో ఆతిథ్య తెలుగు టైటాన్స్ జట్టుకు రెండో రోజూ కలిసిరాలేదు. శనివారం ఇక్కడ జరిగిన తమ రెండో మ్యాచ్‌లో టైటాన్స్ 35-40తో యూపీ యోధాస్ చేతిలో పరాజయం పాలైంది. యోధాస్ తరఫున గగన్ గౌడ 14 పాయింట్లతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఇందులో నాలుగు బోనస్ పాయింట్లు ఉండడం విశేషం. కెప్టెన్ సుమిత్ సాంగ్వాన్ 8, గుమన్ సింగ్ 7 పాయింట్లు స్కోర్ చేశారు. టైటాన్స్ జట్టులో విజయ్ మాలిక్ రైడ్ ద్వారా పది పాయింట్లు, ట్యాకిలింగ్‌లో ఒకటి, బోనస్ రూపంలో మరో మూడు పాయింట్లు సాధించాడు. మరో మ్యాచ్‌లో యు ముంబా 6-5తో గుజరాత్ జెయింట్స్‌పై టైబ్రేకర్‌లో గెలిచింది. అంతకుముందు ఇరుజట్లు హోరాహోరీగా పోరాడడంతో 29-29తో స్కోరు సమమైంది. దీంతో టైబ్రేక్‌లో ఫలితం యు ముంబాను వరించింది.

భారత్‌కు పాక్ జూనియర్ హాకీ జట్టు

రాజ్‌గిర్: భారత్‌లో జరగనున్న ఎఫ్‌ఐహెచ్ జూనియర్ వరల్డ్‌కప్‌లో పాకిస్థాన్ హాకీ జట్టు పాల్గొననుందని హాకీ ఇండియా కార్యదర్శి భోలానాథ్ సింగ్ చెప్పాడు. భద్రతా కారణాలతో ఆసియా కప్ నుంచి పాక్ సీనియర్ జట్టు వైదొలిగిన సంగతి తెలిసిందే. అయితే, జూనియర్ జట్టు మాత్రం భారత్‌లో పర్యటించేందుకు సుముఖత వ్యక్తం చేసిందని భోలా తెలిపాడు. నవంబరు-డిసెంబరులో చెన్నై, మధురై నగరాల్లో వరల్డ్‌కప్ జరగనుంది.

12 బంతుల్లో 11 సిక్సర్లు

సల్మాన్ నిజార్ సంచలనం



తిరువనంతపురం: కేరళ క్రికెట్ లీగ్ (కేఎల్‌సీ)లో కాలికట్ గ్లోబ్‌స్టార్స్ బ్యాటర్ సల్మాన్ నిజార్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. ఇన్నింగ్స్ చివరి 12 బంతుల్లో ఏకంగా 11 సిక్సర్లు బాది ఔరా.. అనిపించాడు. శనివారం త్రివేండ్రం రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సల్మాన్ 26 బంతుల్లోనే అజేయంగా 86 పరుగులు సాధించాడు. ఆరంభంలో నెమ్మదిగా ఆడిన తను 19వ ఓవర్‌లో ఐదు వరుస సిక్సర్లతో 31 రన్స్ రాబట్టాడు. ఆఖరి ఓవర్‌లోనైతే తానెదుర్కొన్న ఆరు లీగల్ డెలివరీలను సిక్సర్లుగా మలిచి 40 రన్స్ రాబట్టాడు. ఈ ఓవర్‌లో రెండో బంతి వైడ్ కాగా, మూడో బంతి నోబ్‌తో పాటు మూడు పరుగులు వచ్చాయి. ఈ బాదుడుకు కాలికట్ జట్టు చివరి 12 బంతుల్లో 75 రన్స్ సాధించి టీ20 ఫార్మాట్‌లో సరికొత్త రికార్డు నెలకొల్పింది. ఇక 187 రన్స్ ఛేదనలో రాయల్స్ 173 రన్స్‌కే పరిమితమై ఓడింది.

సాయికార్తీక్ జోడీకి ఐటీఎఫ్ టైటిల్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఐటీఎఫ్ 15కే వరల్డ్ టూర్ టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్‌కు చెందిన సాయికార్తీక్ రెడ్డి డబుల్స్ టైటిల్ సొంతం చేసుకున్నాడు. శనివారం థాయ్‌లాండ్‌లో జరిగిన ఫైనల్లో సాయికార్తీక్/థాంటబ్ (థాయ్‌లాండ్) జోడీ 7-6, 6-3తో అథర్వ (భారత్)-యుటా టోమిడా (జపాన్) జంటపై గెలిచింది.

ప్రీక్వార్టర్స్‌కు జొకో

● అల్కారజ్, సబలెంక, గాఫ్ కూడా
● యూఎస్ ఓపెన్‌లో ఆండ్రీవ అవుట్



న్యూయార్క్: స్టార్ ఆటగాడు నొవాక్ జొకోవిచ్ యూఎస్ ఓపెన్‌లో జోరు కొనసాగిస్తున్నాడు. రికార్డుస్థాయిలో 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌పై కన్నేసిన ఈ మాజీ చాంపియన్ సింగిల్స్‌లో ప్రీక్వార్టర్స్‌కు దూసుకెళ్లాడు. శనివారం జరిగిన మూడో రౌండ్లో 7వ సీడ్ జొకోవిచ్ 6-4, 6-7(4), 6-2, 6-3తో కామ్ నోరిని ఓడించాడు. ఓవైపు వెన్నునొప్పితో బాధపడుతూనే ఆటను కొనసాగించిన 38 ఏళ్ల జొకో మ్యాచ్‌లో ఏకంగా 18 ఏస్‌లు సంధించడం విశేషం. ఈ గెలుపుతో 1991లో జిమ్మీ కానర్స్ (38 ఏళ్ల వయసులో) తర్వాత యూఎస్ ఓపెన్‌లో నాలుగో రౌండ్ చేరిన అతిపెద్ద వయస్కుడిగా జొకో రికార్డు సృష్టించాడు. మూడోరౌండ్లో 4వ సీడ్ టేలర్ ఫ్రిట్జ్ 7-6(3), 6-7 (11), 6-4, 6-4తో జెరోమ్ కిమ్‌పై నెగ్గగా, జర్మనీ క్వాలిఫయర్ జాన్ లెనార్డ్ స్ట్రఫ్ 6-4, 6-3, 7-6(7)తో 17వ సీడ్ టియాఫోను కంగుతినిపించాడు. 2వ సీడ్ అల్కారజ్ 6-2, 6-4, 6-0తో లూసియానోని ఓడించి ప్రీక్వార్టర్స్ చేరాడు. అడ్రియన్ మనారియాతో పోరులో 6-3, 3-6, 6-4, 4-6తో ఉన్న దశలో 6వ సీడ్ బెన్ షెల్టన్ గాయంతో మ్యాచ్ నుంచి వైదొలిగాడు. మహిళల సింగిల్స్ మూడో రౌండ్లో అమెరికాకు చెందిన 29 ఏళ్ల టేలర్ టౌన్‌సెండ్ 7-5, 6-2తో 5వ సీడ్ మిర్రా ఆండ్రీవకు షాకిచ్చింది. మరో మ్యాచ్‌లో క్రెజికోవా 4-6, 6-4, 6-4తో 10వ సీడ్ ఎమ్మా నవారోను చిత్తుచేయగా.. టాప్‌సీడ్ సబలెంక 6-3, 7-6 (2)తో లైలా ఫెర్నాండెజ్‌ను, లోకల్ స్టార్, 3వ సీడ్ కొకొ గాఫ్ 6-3, 6-1తో మాగ్ధలినాను ఓడించి ప్రీక్వార్టర్స్‌లో అడుగుపెట్టారు.

అనిరుధ్ జోడీ బోణీ: పురుషుల డబుల్స్‌లో భారత జోడీ అనిరుధ్ చంద్రశేఖర్/విజయ్ ప్రశాంత్ శుభారంభం చేసింది. తొలిరౌండ్లో హారిసన్/ఎవాన్ ద్వయంపై గెలిచింది. ఇక, రుత్విక్/శ్రీరామ్ జంట తొలి రౌండ్లోనే ఓడింది.

బిజినెస్ ప్లస్

క్రెడిట్ కార్డుతో అద్దె చెల్లిస్తున్నారా!



అయితే ఆలోచించి ఉపయోగించండి

దేశ జనాభాలో చాలా మందికి సొంత గూడు లేదు. ఆదాయానికి తగ్గట్టు ఏదో ఒక అద్దె ఇల్లే గతి. పట్టణ ప్రాంతాల్లో ఈ సమస్య మరింత ఎక్కువ. మంచి ఇల్లు అద్దెకు దొరకడం ఒక సమస్య అయితే, అద్దె చెల్లించడం మరో సమస్య. ఒక్కోసారి సమయానికి జీతం రాదు. లేదా అత్యవసర ఖర్చులు వస్తాయి. అలాంటప్పుడు అప్పు చేసి లేదా క్రెడిట్ కార్డు ద్వారా అద్దె చెల్లించాల్సి వస్తుంది. క్రెడిట్ కార్డుతో అద్దె చెల్లించడంలో కొన్ని లాభాలతో పాటు కొన్ని నష్టాలూ ఉన్నాయి. అవేమిటంటే..

లాభాలు

రివార్డులు, క్యాష్‌బ్యాక్‌లు : క్రెడిట్ కార్డుల ద్వారా జరిపే అన్ని చెల్లింపులకు రివార్డు పాయింట్లు, క్యాష్‌బ్యాక్‌లు లభిస్తాయి. అద్దె చెల్లింపులకూ ఇది వర్తిస్తుంది. ఉదాహరణకు ఒక వ్యక్తి క్రెడిట్ కార్డు ద్వారా తన ఇంటి నెలవారీ అద్దె రూ.30,000 చెల్లిస్తే క్యాష్‌బ్యాక్ రూపంలో ఒక శాతం వరకు (రూ.300) లభిస్తుంది.

వెసులుబాటు: క్రెడిట్ కార్డు ద్వారా అద్దె చెల్లిస్తే క్రెడిట్ కార్డు కంపెనీకి ఆ మొత్తాన్ని 25 నుంచి 50 రోజుల్లో వడ్డీ లేకుండా చెల్లించవచ్చు. తాత్కాలిక ఆర్థిక ఇబ్బందులతో బాధపడే వారికి ఇది పెద్ద ఊరట.

క్రెడిట్ స్కోరు: క్రెడిట్ కార్డు ద్వారా చెల్లించిన అద్దె మొత్తాన్ని మళ్లీ సమయానికి క్రెడిట్ కార్డు కంపెనీకి చెల్లించాలి. క్రమం తప్పకుండా ఇలా చేయడం వల్ల క్రెడిట్ స్కోర్ పెరుగుతుంది. తద్వారా భవిష్యత్‌లో రుణాలు తీసుకోవాల్సి వస్తే సులభమైన షరతులతో లేదా ఎక్కువ మొత్తాన్ని తక్కువ వడ్డీ రేటుతో అప్పుగా తీసుకునే సౌలభ్యం ఉంటుంది.

వెసులుబాటు: క్రెడిట్ కార్డు ద్వారా అద్దె చెల్లించడం చాలా సులభం. ఈ చెల్లింపులకు సంబంధించిన డిజిటల్ రికార్డులూ అందుబాటులో ఉంటాయి. భవిష్యత్‌లో ఇంటి యజమానితో లేదా పన్ను అధికారులతో ఏవైనా సమస్యలు ఏర్పడితే సాక్ష్యాలుగానూ ఉపయోగపడతాయి.

సమస్యలు

ఫీజులు: చాలా బ్యాంకులు తమ క్రెడిట్ కార్డుల ద్వారా జరిగే అద్దె చెల్లింపులపై ఒకటి నుంచి రెండు శాతం వరకు ఫీజుగా వసూలు చేస్తున్నాయి. ఉదాహరణకు ఒక వ్యక్తి తన క్రెడిట్ కార్డు ద్వారా రూ.30,000 అద్దె చెల్లించాడనుకుందాం. దీనిపై బ్యాంకు 1.5 శాతం చొప్పున రూ.375 ఫీజుగా వసూలు చేసింది. దీంతో రివార్డులు, క్యాష్‌బ్యాక్‌ల ద్వారా వచ్చే దానికంటే ఫీజు రూపంలో పోయేదే ఎక్కువవుతుంది.

ట్యాక్స్ స్క్రూటినీ: క్రెడిట్ కార్డు ద్వారా అద్దె చెల్లిస్తుంటే, ఆ డిజిటల్ రికార్డులు భద్రంగా ఉంటాయి. ఐటీ రిటర్న్‌లో మీరు పేర్కొన్న ఆదాయానికి, అద్దె చెల్లింపు మధ్య భారీ వ్యత్యాసం ఉన్నా, హెచ్‌ఆర్‌ఏ ఎక్కువగా క్లెయిమ్ చేసినా ఐటీ శాఖకు దొరికిపోతారు.

యాజమాని ఆమోదించాలి: చాలా మంది ఇళ్ల యజమానులు క్రెడిట్ కార్డు చెల్లింపులను ఆమోదించరు. నగదు లేదా బ్యాంకు ట్రాన్స్‌ఫర్ అడుగుతుంటారు. అద్దె ఆదాయంపైనే ఆధారపడే యజమానులైతే బ్యాంకు ట్రాన్స్‌ఫర్‌లను కూడా అంగీకరించరు. అంతా నగదు రూపంలోనే చెల్లించమంటారు.

అప్పుల ఊబి: గడువులోగా క్రెడిట్ కార్డు బకాయిలు చెల్లించాలి. లేకపోతే వడ్డీ మీద వడ్డీ చెల్లించలేక అప్పుల ఊబిలో చిక్కుకుపోవాల్సి ఉంటుంది.

పై విషయాలన్నిటిని బేరీజు వేసుకున్న తర్వాతే క్రెడిట్ కార్డు చెల్లింపులను ఎంచుకోవాలి. ఇక్కడ ఫీజుల రూపంలో పోయేదాని కంటే రివార్డులు, క్యాష్‌బ్యాక్‌ల రూపంలో వచ్చేది ఎక్కువగా ఉండాలి. లేకపోతే క్రెడిట్ కార్డు ద్వారా అద్దెల చెల్లింపు దండగ అని చెప్పక తప్పదు.

హైదరాబాద్‌లో మదుపరుల శిబిరం

హైదరాబాద్(ఆంధ్రజ్యోతి బిజినెస్): సెబీ, ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్ అండ్ ప్రొటెక్షన్ ఫండ్ అథారిటీ (ఐఈపీఎఫ్ఏ) సారథ్యంలో సీడీఎస్‌ఎల్ ఇన్వెస్టర్ ప్రొటెక్షన్ ఫండ్ (సీడీఎస్‌ఎల్ ఐపీఎఫ్), బీఎస్ఈ ఇన్వెస్టర్ ప్రొటెక్షన్ ఫండ్ (బీఎస్ఈ ఐపీఎఫ్) హైదరాబాద్‌లో 'నివేశక్ శివిర్' (మదుపరుల శిబిరం) పేరుతో శనివారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో క్లెయిమ్ చేయని డివిడెండ్లు, షేర్లను ఎలా క్లెయిమ్ చేసుకోవాలి? నామినేషన్, కేవైసీ అప్‌డేట్ ఎలా చేయాలి? అనే విషయాలను నిపుణులు ఇన్వెస్టర్లకు వివరించారు. ఐఈపీఎఫ్ఏకు చేసిన క్లెయిమ్‌ల ప్రాసెసింగ్, క్లెయిమ్స్‌కు సంబంధించి మదుపరులు అడిగిన ప్రశ్నలకు నిపుణులు సమాధానాలు ఇచ్చారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

31 తేదీ			
హైదరాబాద్	515	విజయవాడ	560
వరంగల్	517	గోదావరి	550
చిత్తూరు	578	విశాఖపట్నం	555
		డజను గుడ్లు రూ. 72	

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,04,950 ▲	96,200 ▲	1,31,000 ▲
విజయవాడ	1,06,650 ▲	1,00,500 ▲	1,23,750 ▲
విశాఖపట్నం	1,04,950 ▼	96,200 ▲	1,31,000 ▼
రాజమండ్రి	1,04,950 ▲	96,200 ▲	1,23,900 ▲
ప్రొద్దుటూరు	1,05,000 ▲	96,600 ▲	1,23,000 ▲
ముంబై	1,02,400 ▲	93,790 ▲	1,17,572 ▲

త్వరలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

● జన్ ధన్ పథకంతో ఆర్థికానికి ఊతం
● ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా



ఇండోర్ (మధ్య ప్రదేశ్): ఎన్ని సవాళ్లు ఎదురైనా భారత్ త్వరలోనే ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. మధ్య ప్రదేశ్‌లోని ఇండోర్ సమీపంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన ఈ విషయం స్పష్టం చేశారు. 'ప్రస్తుతం ప్రపంచంలోని ఐదు అతి పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో మన దేశం ఒకటి. త్వరలోనే మనం మూడో స్థానానికి చేరుకోబోతున్నాం' అని మల్హోత్రా అన్నారు. ట్రంప్ సుంకాల పోటు నేపథ్యంలోనూ జూన్ త్రైమాసికంలో భారత జీడీపీ వృద్ధిరేటు ఐదు త్రైమాసికాల గరిష్ఠ స్థాయి 7.8 శాతానికి పెరిగింది. ఈ నేపథ్యంలోనే ఆర్‌బీఐ చీఫ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వం, బ్యాంకులు కలిసి 11 ఏళ్ల క్రితం ప్రారంభించిన ప్రధాన మంత్రి జన్ ధన్ పథకం కూడా దేశ ఆర్థిక అభివృద్ధికి దోహదం చేస్తోందని మల్హోత్రా తెలిపారు. ఇప్పటివరకు ఈ పథకం కింద 55 కోట్ల బ్యాంకు ఖాతాలు ప్రారంభమైనట్టు వెల్లడించారు. దాంతో ఈ ఖాతాదారులందరికీ పొదుపు, పెన్షన్, బీమా, రుణాలతో పాటు ఇతర ఆర్థిక సేవలూ అందుబాటులోకి వచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. సైబర్ నేరగాళ్ల దుర్వినియోగం చేయకుండా జన్ ధన్ ఖాతాదారులు వెంటనే ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని కోరారు. ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సుంకాల పోటు తాత్కాలికమే

● వృద్ధి రేటుకు ఢోకా లేదు
● సీఈఏ నాగేశ్వరన్

కోల్‌కతా: మన ఆర్థిక వ్యవస్థపై అమెరికా సుంకాల పోటు ప్రభావం తాత్కాలికమేనని కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు(సీఈఏ) అనంత నాగేశ్వరన్ అన్నారు. విస్తృత ప్రయోజనాల దృష్ట్యా రెండు దేశాల మధ్య త్వరలోనే సుంకాలపై ఒక అవగాహన కుదిరే అవకాశం ఉందన్నారు. ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ (ఐసీసీ) నిర్వహించిన ఒక సదస్సులో దృశ్య మాధ్యమం ద్వారా పాల్గొన్న ఆయన ఈ విషయం చెప్పారు. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం(బీటీఏ)పై అమెరికా-భారత్ దాదాపుగా ఒప్పందానికి చేరువైనా, కొన్ని అనూహ్య పరిణామాలతో ఒప్పందం కుదురలేదన్నారు. సీఈఏ తాజా ప్రకటనతో బీటీఏ కోసం రెండు దేశాల మధ్య తెర వెనుక ఇంకా మంతనాలు జరుగుతున్నట్టు తెలుస్తోంది. సుంకాల సమస్య నుంచి ఎగుమతిదారులను ఆదుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపైనా ప్రభుత్వం చర్చిస్తున్నట్టు నాగేశ్వరన్ చెప్పారు. సుంకాలతో మన జీడీపీ వృద్ధి రేటుకు పెద్దగా వచ్చే ముప్పు కూడా ఏమీ లేదని తేల్చి పారేశారు. ఈ ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో వృద్ధి జోరు ముందు త్రైమాసికాల్లోనూ కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు.

అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ ద్వారా వస్తువులు విక్రయిస్తున్నారా?

ఇటీవలికాలంలో ఆన్‌లైన్ ద్వారా వస్తు కొనుగోళ్లు అనూహ్యంగా పెరిగాయి. దాంతో చాలా వ్యాపార సంస్థలు షోరూమ్‌లతోపాటు ఆన్‌లైన్‌లోనూ విక్రయాలు సాగిస్తున్నాయి. ముఖ్యంగా అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఈ-కామర్స్ సైట్ల ద్వారా భారీగా కొనుగోళ్లు జరుగుతున్న నేపథ్యంలో చాలా మంది విక్రేతలు ఈ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుని అమ్మకాలు జరుపుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లోనూ చాలా మంది వ్యాపారులు ఈ-కామర్స్ ఆపరేటర్స్ ద్వారా అమ్మకాలు సాగిస్తున్నారు. వీరు జీఎస్‌టీకి సంబంధించి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం..

జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ ఎవరికి అవసరమో చెప్పేందుకు వ్యాపారులను అంటే, సరఫరాదారులను రెండు వర్గాలుగా విభజించారు. మొదటి వర్గం సాధారణ వ్యాపారులు. వీరికి వార్షిక టర్నోవర్ నిర్ధారిత పరిమితి దాటేంతవరకు రిజిస్ట్రేషన్ అవసరం లేదు. రెండో వర్గం రిజిస్ట్రేషన్ తప్పనిసరి అయినవారు. వీరు టర్నోవర్‌తో సంబంధం లేకుండా ముందే రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

సాధారణ వ్యాపారుల విషయానికొస్తే, వీరికి ఆర్థిక సంవత్సరంలో టర్నోవర్ పరిమితిని రూ.20 లక్షలుగా నిర్ణయించారు. అంటే, పూర్తిగా పన్ను మినహాయింపు పొందిన సరఫరాలు, రివర్స్ చార్జ్ మెకానిజంలోకి వచ్చే సరఫరాదారులు తప్ప మిగతా వారు రూ.20 లక్షల వార్షిక టర్నోవర్ దాటితే తప్పక రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అయితే, చిన్న, మధ్య తరగతి వ్యాపారులకు లబ్ది చేకూర్చేందుకు కేవలం వస్తువులు మాత్రమే విక్రయించే వర్తకులకు ఈ పరిమితిని కొన్ని రాష్ట్రాల్లో రూ.40 లక్షలుగా నిర్ధారించారు. వారి సరఫరాల్లో సేవలు కూడా ఉంటే మాత్రం పెంచిన పరిమితి వర్తించదు. తెలుగు రాష్ట్రాల విషయానికొస్తే, ఆంధ్ర ప్రదేశ్‌లో ఈ పరిమితి రూ.40 లక్షలుగా ఉండగా.. తెలంగాణలో మాత్రం రూ.20 లక్షలకే పరిమితం చేశారు. అంటే, కేవలం వస్తువులను మాత్రమే విక్రయిస్తుంటే ఆంధ్ర ప్రదేశ్‌లో రూ.40 లక్షలు, తెలంగాణలో రూ.20 లక్షల వార్షిక టర్నోవర్ వరకు రిజిస్ట్రేషన్ అవసరం లేదు.

అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఈ-కామర్స్ ఆపరేటర్ల ద్వారా వస్తువులు విక్రయించే వారు, ముఖ్యంగా ఇంటి నుంచే విక్రయాలు జరిపేవారు తమ టర్నోవర్ చాలా తక్కువ గనుక రిజిస్ట్రేషన్ అవసరం లేదని భావిస్తుంటారు. కానీ, ఈ-కామర్స్ ఆపరేటర్స్ ద్వారా వస్తు అమ్మకాలను జరిపేవారిని ప్రభుత్వం రెండో వర్గంగా గుర్తించింది. అంటే, వీరు తప్పనిసరిగా జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందే. సాధారణ వ్యాపారులకు వర్తించే రూ.20 లక్షలు లేదా రూ.40 లక్షల వార్షిక టర్నోవర్ పరిమితి వీరికి వర్తించదు. కాబట్టి, ఆన్‌లైన్ ద్వారా విక్రయాలు ప్రారంభించే ముందే జీఎస్‌టీ నెట్‌వర్క్‌లో రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుంది. తాము ఆర్జించే తొలి రూపాయి నుంచి పన్ను చెల్లించాలి. చాలా మంది ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్‌తోపాటు ఇతర మార్గాల్లోనూ విక్రయాలు జరుపుతుంటారు. ఒకసారి రిజిస్ట్రేషన్ తీసుకుంటే ఈ-కామర్స్ ఆపరేటర్స్ ద్వారా విక్రయించిన సరుకుతోపాటు ఇతర మార్గాల్లో అమ్మకాలకూ జీఎస్‌టీ వర్తిస్తుంది.

సాధారణంగా ఈ-కామర్స్ ఆపరేటర్లు తమతో ఒప్పందం కుదుర్చుకున్న విక్రేతలకు జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ ఖచ్చితంగా ఉండేలా జాగ్రత్తపడతాయి. చాలా మంది చిరు వ్యాపారులు ఈ-కామర్స్ ఆపరేటర్ల సూచన మేరకు జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ పొందినప్పటికీ, వార్షిక టర్నోవర్ పరిమితి దాటనంత వరకు పన్ను చెల్లించనక్కర్లేదని, రిటర్నులూ సమర్పించాల్సిన అవసరం లేదని భావిస్తుంటారు. కానీ, ఈ-కామర్స్ సైట్ల ద్వారా విక్రయాలు జరిపేవారు ముందుగానే జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ పొందడమే కాకుండా సమయానికి రిటర్నులు దాఖలు చేయడంతోపాటు సంబంధిత పన్నును సకాలంలో చెల్లించేలా జాగ్రత్తలు తీసుకోవాలి. రిటర్నుల ఫైలింగ్‌లో అనుభవం లేనివారు అకౌంటెంట్ల సలహాలు, సాయంతో ఈ ప్రక్రియను పూర్తి చేయవచ్చు.



రాంబాబు గొండాల

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	95	విజయవాడ	117
వరంగల్	95	గుంటూరు	112
కరీంనగర్	95	ఒంగోలు	112
మహబూబ్‌నగర్	95	చిత్తూరు	100
కర్నూలు	95	నెల్లూరు	105
విశాఖపట్నం	121	అనంతపురం	105
గోదావరి	117		

తనను నోబెల్‌కు సిఫారసు చేయలేదనే..

భారత్‌పై ట్రంప్ సుంకాలకు కారణమిదే

» న్యూయార్క్ టైమ్స్ సంచలన కథనం

న్యూయార్క్, ఆగస్టు 30: భారత్‌పై అమెరికా అడ్డగోలు సుంకాల వెనుక 'రష్యా చమురు కొనుగోళ్లను మించిన కారణం ఉందా? ట్రంప్ వ్యక్తిగత కక్షతోనే భారీగా సుంకాలు విధించారా? ట్రంప్, మోదీ మధ్య బంధం చెడిందా?.. ఈ ప్రశ్నలన్నింటికీ న్యూయార్క్ టైమ్స్ అవుననే అంటోంది. నోబెల్ శాంతి బహుమతి కోసం ఆరాటపడుతున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. తనను నామినేట్ చేయాలని భారత్‌ను కోరారని, దానికి మోదీ నిరాకరించడంతో అక్కసు పెంచుకున్నారని పేర్కొంటూ ఒక కథనాన్ని ప్రచురించింది. "భారత్, పాక్ మధ్య యుద్ధాన్ని తానే ఆపానని ట్రంప్ 40 సార్లు చెప్పుకొన్నారు. యుద్ధం ఆపే విషయంలో అమెరికా సహా మరే దేశ జోక్యం లేదని స్పష్టం చేసింది. దీనిపై ట్రంప్ ఆగ్రహించారు. జూన్ 17న మోదీతో ఫోన్‌లో మాట్లాడిన ట్రంప్.. తనను నోబెల్ శాంతి బహుమతికి నామినేట్ చేయాలని కోరారు. అలా చేస్తే.. యుద్ధాన్ని ట్రంప్ ఆపారని ఒప్పుకొన్నట్టు అవుతుందని, కుదరదని మోదీ స్పష్టం చేశారు. ట్రంప్ కోరారుకదా అని నామినేట్ చేస్తే.. భారత్‌లో తన ప్రతిష్ఠకు మచ్చ వస్తుందని మోదీ భావించారు. భారత్ అలా నామినేట్ చేయకపోవడంతో ట్రంప్ కక్షగట్టారు. భారత్‌పై అధిక సుంకాల వెనుక 'రష్యా చమురు కొనుగోళ్లను మించిన కారణం ఇదే. ఇతర దేశాలు రష్యా నుంచి చమురుకొంటున్నా పట్టించుకోకుండా.. భారత్‌ను కావాలనే లక్ష్యంగా చేసుకున్నారు. ఒకప్పుడు మిత్రులుగా పేరుపొందిన మోదీ, ట్రంప్ మధ్య దూరం పెరిగింది. జూన్ 17 తర్వాత వారు మళ్లీ మాట్లాడుకున్నది కూడా లేదు.." అని న్యూయార్క్ టైమ్స్ పేర్కొంది.

అమెరికాకు అన్ని పోస్టల్ పార్శిళ్లు బంద్!

» కమ్యూనికేషన్స్ మంత్రిత్వ శాఖ వెల్లడి

న్యూఢిల్లీ, ఆగస్టు 30: సుంకాల ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికాకు వెళ్లే అన్ని రకాల మెయిల్ బుకింగ్స్‌ను పూర్తిగా నిలిపివేయాలని భారత్ తాజాగా నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పోస్టల్ విభాగం, కమ్యూనికేషన్స్ మంత్రిత్వ శాఖ శుక్రవారం నోటీసు జారీచేశాయి. అమెరికా దిగుమతి సుంకాలపై గందరగోళం నేపథ్యంలో లెటర్లు, డాక్యుమెంట్లు, 100 డాలర్ల కంటే తక్కువ విలువైన బహుమతులు సహా అన్ని క్యాటగిరీల మెయిల్ బుకింగ్స్‌ను పూర్తిస్థాయిలో ఆపేయాలని నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నాయి. నియంత్రణ విధానాల్లో అస్పష్టత, అమెరికాకు పార్శిళ్లను రవాణా చేసేందుకు విమానయాన సంస్థల విముఖత అంశాలను కమ్యూనికేషన్స్ మంత్రిత్వ శాఖ పేర్కొంది. పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నామని, వీలైనంత త్వరగా అన్ని రకాల సేవలను పునరుద్ధరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోస్టల్ విభాగం వెల్లడించింది. అమెరికా కస్టమ్స్ విభాగం జారీచేసిన కొత్త నిబంధనల్లో స్పష్టత లేని కారణంగా పార్శిళ్లను తీసుకెళ్లేందుకు విమానయాన సంస్థలు నిరాకరిస్తున్నాయని ప్రభుత్వం ఈనెల మొదట్లో ప్రకటించిన విషయం తెలిసిందే. జూలై 30న అమెరికా ప్రభుత్వం జారీచేసిన కార్యనిర్వాహక ఉత్తర్వుల ప్రకారం.. ఆగస్టు 29 నుంచి 100 డాలర్లకు పైగా విలువైన పార్శిళ్లపై కస్టమ్స్ సుంకాలు వర్తించనున్నాయి. ఈ నేపథ్యంలో లెటర్లు, డాక్యుమెంట్లు, 100 డాలర్ల వరకు విలువైన బహుమతుల పార్శిళ్ల రవాణాకు అనుమతిస్తున్నట్లు భారత ప్రభుత్వం ఇంతకుముందటి ఉత్తర్వుల్లో పేర్కొంది. అయితే ఇప్పుడు అమెరికాకు అన్ని మెయిల్ సర్వీసులను నిలిపివేస్తూ తాజా నిర్ణయం తీసుకుంది. మరోవైపు పార్శిళ్ల దిగుమతులపై పెంచిన సుంకాలు శుక్రవారం నుంచే అమల్లోకి వచ్చాయి.

ఆలయ విరాళాలు దేవుళ్లకు మాత్రమే

» ఇతర కార్యక్రమాలకు మళ్లించరాదు: మద్రాస్ హైకోర్టు

చెన్నై, ఆగస్టు 30: భక్తులు విరాళంగా ఇచ్చిన నిధులు దేవుడికి మాత్రమే చెందుతాయని మద్రాస్ హైకోర్టు స్పష్టం చేసింది. ఇతర కార్యక్రమాలకు ఆ నిధులను మళ్లించకూడదని తేల్చి చెప్పింది. ఆ నిధులను మతపరమైన, దాతృత్వ కార్యక్రమాలకు మాత్రమే వినియోగించాలని పేర్కొంది. ఈ మేరకు మద్రాస్ హైకోర్టు మధురై బెంచ్ తీర్పు ఇచ్చింది. ఆలయాల నిధులతో కల్యాణ మండపాలు నిర్మించడానికి 2023-25 మధ్య తమిళనాడు ప్రభుత్వం ఇచ్చిన ఐదు జీవోలను జస్టిస్ ఎస్ఎం సుబ్రమణియమ్, జస్టిస్ జీ అరుల్ మురుగన్‌లతో కూడిన ధర్మాసనం కొట్టివేసింది. ఆలయాల నిర్వహణ, అభివృద్ధికి మాత్రమే ఆలయాల నిధులు వినియోగించాలని, కల్యాణ మండపాలు వంటి వాణిజ్య అవసరాలకు వాటిని మళ్లించకూడదని చెప్పింది. హిందూ రెలిజియస్ అండ్ చారిటబుల్ ఎండోమెంట్స్ యాక్ట్- 1959 ప్రకారం పూజలు, అన్నదానం, యాత్రికుల సంక్షేమం, పేదలకు సహాయం వంటి కార్యక్రమాలకు తప్ప, ఆదాయార్జన కార్యక్రమాలకు నిధులను మళ్లించకూడదని ధర్మాసనం స్పష్టం చేసింది.

చెన్నైలో రోగులను పరీక్షిస్తూ గుండెపోటుతో గుండె డాక్టర్ మృతి



చెన్నై, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రి వార్డులో రోగులను పరీక్షిస్తూ గుండెపోటుతో ఓ యువ గుండె శస్త్రచికిత్సా నిపుణుడు కుప్పకూలాడు. సహచర వైద్యులు, సీనియర్ వైద్య నిపుణులు ఆయనను కాపాడుకునేందుకు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. చెన్నై సవిత వైద్య కళాశాలలో ఇటీవల చోటుచేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. డాక్టర్ గ్రాడ్లిన్ రాయ్(39) చురుకైన, నిపుణుడైన గుండె శస్త్రచికిత్సా వైద్యునిగా పేరుపొందారు. గత బుధవారం ఆయన యథావిధిగా వార్డులో రోగులను పరీక్షిస్తుండగా హఠాత్తుగా గుండెపోటుకు గురై కుప్పకూలారు. గమనించిన సహచరులు, సిబ్బంది ఆయనకు సీపీఆర్ చేశారు. ఐసీయూకు తరలించారు. అత్యాధునిక చికిత్సలను అందించారు. ఎన్ని చేసినా గుండెకు రక్తం సరఫరా చేసే ప్రధాన ధమని 100% పూడుకుపోవడంతో వచ్చిన గుండెపోటు కావడంతో జరిగిన నష్టాన్ని పూడ్చడం వైద్యులకు సాధ్యం కాలేదు. దీంతో డాక్టర్ రాయ్ మరణించినట్లు ప్రకటించారు. డాక్టర్ రాయ్‌కు గతంలో ఎలాంటి అనారోగ్య సమస్యలు లేవని సహచరులు పేర్కొన్నారు.

సీఎం అభ్యర్థిగా ప్రకటించుకున్న తేజస్వీ

» మద్దతు ప్రకటించిన అఖిలేశ్.. వేదికపై మౌనంగా రాహుల్

పట్నా, ఆగస్టు 30: ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ తనను తాను బిహార్ విపక్ష మహాగఠ్ బంధన్ సీఎం అభ్యర్థిగా ప్రకటించుకున్నారు. ఆరాలో ఓటర్ అధికార్ యాత్ర చివరి రోజు సభ వేదికపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఎస్పీ అధ్యక్షుడు అఖిలేష్ తదితరులు ఉండగా తేజస్వీ ఈ ప్రకటన చేశారు. వెంటనే అఖిలేష్ తేజస్వీకి మద్దతు ప్రకటించారు. కానీ రాహుల్ గాంధీ మౌనం వహించారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో విపక్ష సీఎం అభ్యర్థిని తానే అని ప్రకటించుకోవడం ద్వారా ఈ విషయంలో ఇబ్బందులు లేకుండా చూసుకునేందుకు తేజస్వీ యత్నించారు. అయితే సీట్ల పంపకాల్లో అంగీకారం కుదరకపోవడమే రాహుల్ మౌనానికి కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. 2020లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 243 నియోజకవర్గాలకు గాను పొత్తులో భాగంగా కాంగ్రెస్ పార్టీ 70 స్థానాల్లో పోటీ చేసి 19 చోట్ల మాత్రమే నెగ్గింది. ఆర్జేడీ మాత్రం 75 స్థానాల్లో గెలిచి అతిపెద్ద పార్టీగా అవతరించింది. గత ఎన్నికల్లో తక్కువ స్థానాల్లో గెలిచినా ఈసారి కూడా 70 సీట్లు ఇవ్వాలని కాంగ్రెస్ కోరుతోంది. దీనిపై ఆర్జేడీ తటపటాయిస్తోంది.

'మానవ జీపీఎస్' బాగూఖాన్ హతం

» వందకు పైగా ఉగ్రవాద చొరబాట్లకు కారకుడు

న్యూఢిల్లీ, ఆగస్టు 30: చొరబాట్లలో కీలకంగా వ్యవహరిస్తూ ఉగ్రవాద శ్రేణుల్లో మానవ జీపీఎస్‌గా పేరు తెచ్చుకున్న బాగూఖాన్ అలియాస్ సమందర్ చాచాను భద్రతా దళాలు ఎన్‌కౌంటర్‌లో మట్టుబెట్టాయి. జమ్మూకశ్మీర్‌లోని నౌషెరా ప్రాంతంలోకి మరో ఉగ్రవాదితో కలిసి అతడు చొరబడగా.. నిఘా వర్గాల సమాచారం మేరకు భద్రతా దళాలు వారిని చుట్టుముట్టాయి. ఇది గమనించి వారు కాల్పులకు తెగబడగా ఎదురు కాల్పులు జరిపి హతమార్చాయి. బాగూఖాన్ ఎన్‌కౌంటర్‌తో ఉగ్ర సంస్థల నెట్‌వర్క్‌కు గట్టి దెబ్బ తగిలినట్లయింది. 1995 నుంచి పీవోకేను కేంద్రంగా చేసుకొని బాగూఖాన్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడని.. వందకు పైగా చొరబాట్లకు సూత్రధారిగా వ్యవహరించాడని భద్రతా దళాలు తెలిపాయి.

పార్లమెంటులో జగన్నాథ రథచక్రాలు

భువనేశ్వర్, ఆగస్టు 30: పూరీ జగన్నాథుడి రథయాత్రలో వినియోగించే పవిత్రమైన 3 రథాల చక్రాలను పార్లమెంటు ఆవరణలో ప్రతిష్ఠించనున్నారు. ఈ మేరకు శ్రీ జగన్నాథ్ ఆలయ పరిపాలన యంత్రాంగం(ఎస్‌జేటీఏ) చేసిన ప్రతిపాదనకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అంగీకారం తెలిపినట్టు ఎస్‌జేటీఏ ముఖ్య కార్యనిర్వహణాధికారి అరబింద పదీ శనివారం వెల్లడించారు. 'పూరీ జగన్నాథ ఆలయానికి శుక్రవారం కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్, పూరీ ఎంపీ సంబిత్ పాత్రా తదితరులతో కలిసి ఓం బిర్లా విచ్చేశారు. ఈ సందర్భంగా పవిత్రమైన మూడు చక్రాలను పార్లమెంటు ఆవరణలో ప్రముఖంగా కనిపించే ప్రదేశంలో ప్రతిష్ఠించేందుకు ఆయనకు ప్రతిపాదనను అందజేశాం. ఈ ప్రతిపాదనకు ఓం బిర్లా అంగీకరించారు' అని అరబింద పదీ 'ఎక్స్'లో పోస్టు చేశారు. కాగా, పూరీ రథయాత్రకు ప్రతి ఏటా కొత్త కలపను వినియోగించి రథాలను తయారు చేస్తారు.

ఇండోనేషియా ప్రాంతీయ పార్లమెంటుకు నిప్పు

జకార్తా, ఆగస్టు 30: ఇండోనేసియాలో ప్రభుత్వ వ్యతిరేక ఆందోళన హింసాత్మకంగా మారింది. శాసనసభ్యుల జీతాలను భారీగా పెంచినందుకు నిరసనగా యువత ఉద్యమం చేపట్టడంతో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. శుక్రవారం సాయంత్రం మకస్సార్‌లోని ప్రాంతీయ పార్లమెంటు భవనానికి ఆందోళనకారులు నిప్పుపెట్టారు. ఈ కారణంగా ముగ్గురు మరణించారని, మరో అయిదుగురు గాయపడ్డారని శనివారం అధికారులు తెలిపారు.

జీమెయిల్ పాస్‌వర్డ్ మార్చుకోండి: గూగుల్

న్యూఢిల్లీ, ఆగస్టు 30: జీమెయిల్ వినియోగదారులు తక్షణమే తమ పాస్‌వర్డ్‌లను మార్చుకోవాలని గూగుల్ సూచించింది. 250 కోట్ల మంది ఖాతాల సమాచారం ప్రమాదంలో పడిందని హెచ్చరించింది. సేల్స్ ఫోర్స్ డేటా తస్కరణ(బ్రీచ్) అయిన నేపథ్యంలో ఈ ప్రమాదం ఏర్పడిందని టెక్ దిగ్గజం పేర్కొంది. ఈ ఏడాది జూన్ ప్రథమార్థంలో ఈ ఘటన చోటుచేసుకుందని వివరించింది. ముందుగా అనుకున్నదానికన్నా డేటా తస్కరణ ఘటన పెద్దదేనని పేర్కొంది. ఈ హ్యాకర్స్ తాజాగా వినియోగదారులకు కాల్స్, మెసేజెస్ చేస్తున్నారని, పాస్‌వర్డ్ రీసెట్ చేసుకోవాలని, లాగిన్ కోడ్స్ ఇవ్వాలని కోరుతున్నారని గూగుల్ హెచ్చరించింది.

ట్రంప్ సుంకాలు చట్టవిరుద్ధం

(మొదటిపేజీ తరువాయి)

అడ్డగోలు సుంకాల విధింపు అధికారాన్ని ఇవ్వలేదని తేల్చిచెప్పింది. ఈ మేరకు 11మంది జడ్జీలతో కూడిన కోర్టులో ఏడుగురు సుంకాలకు వ్యతిరేకంగా, నలుగురు అనుకూలంగా తీర్పు ఇచ్చారు. మెజారిటీ మేరకు సుంకాలకు వ్యతిరేకంగా కోర్టు తీర్పు వెలువడింది. అయితే దీనిపై ట్రంప్ యంత్రాంగం సుప్రీం కోర్టులో అప్పీలు చేసుకోవడానికి వీలుగా తీర్పు అమలును అక్టోబర్ 14 వరకు నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నిజానికి ట్రంప్ టారిఫ్‌లు అన్యాయం, చట్టవిరుద్ధమంటూ దాఖలైన పిటిషన్లపై తొలుత విచారించిన దిగువస్థాయి ఫెడరల్ కోర్టు.. ట్రంప్ సుంకాలను కొట్టివేస్తూ తీర్పు ఇచ్చింది. కానీ దానిపై ట్రంప్ యంత్రాంగం 'ఫెడరల్ అప్పీల్స్ కోర్టు ఫర్ ది ఫెడరల్ సర్క్యూట్‌'ను ఆశ్రయించగా... దిగువ కోర్టు తీర్పును నిలిపివేసింది. ఇప్పుడు ఫెడరల్ అప్పీల్స్ కోర్టు కూడా ట్రంప్ సుంకాలు చట్టవిరుద్ధమని తీర్పు ఇచ్చింది. ట్రంప్ తిరిగి అప్పీలు చేయనున్న నేపథ్యంలో అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చే తీర్పు కీలకం కానుంది.

అమెరికా నాశనమవుతుంది: ట్రంప్

ఫెడరల్ అప్పీల్స్ కోర్టు తీర్పుపై ట్రంప్ 'ట్రూత్' వేదికగా స్పందించారు. ప్రపంచ దేశాలపై తాము విధించిన టారిఫ్‌లు యథాతథంగా కొనసాగుతాయని చెప్పారు. కోర్టు తీర్పు పూర్తిగా ఏకపక్షం, పక్షపాతంతో కూడుకున్నదని విమర్శించారు. అయినా చివరికి అమెరికాయే గెలుస్తుందని పేర్కొన్నారు. "కోర్టు తీర్పు అమలైతే.. అమెరికా సర్వనాశనం అవుతుంది. ఇక్కడి ఉత్పత్తిదారులు, రైతులు, పనివారు తీవ్రంగా నష్టపోతారు. వివిధ దేశాలు అమెరికా దిగుమతులపై అన్యాయంగా విధిస్తున్న సుంకాలను, భారీ వాణిజ్య లోటును ఎదుర్కోవడానికి వాటిపై సుంకాలు విధించాల్సిందే. సుంకాల అమలుకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇస్తుందన్న నమ్మకముంది" అని ట్రంప్ పేర్కొన్నారు.



వలసదారుల అంశంలోనూ దెబ్బ!

అమెరికాలో సరైన పత్రాలు లేకుండా ఉంటున్నవారిని వేగంగా తిప్పిపంపేసేందుకు ట్రంప్ యంత్రాంగం చేపట్టిన చర్యలను వాషింగ్టన్ డీసీ డిస్ట్రిక్ట్ కోర్టు తాత్కాలికంగా నిలిపివేసింది. వలసదారులను జడ్జి ఎదుట హాజరుపర్చకుండా, వారు చెప్పే అంశాలను పరిశీలించకుండా నేరుగా తిప్పిపంపేయడం సరికాదని కోర్టు జడ్జి జియా కోబ్ పేర్కొన్నారు. వలసదారులకు అమెరికా చట్టసభ కాంగ్రెస్ ఇచ్చిన వెసులుబాట్లను కాదనలేమని స్పష్టం చేశారు.

సుంకాలు నిలిచిపోతాయా?

1977 నాటి అమెరికా 'అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం (ఐఈఈపీఏ)' ప్రకారం.. వివిధ దేశాలు, వాటి నుంచి వచ్చే దిగుమతులు అమెరికాకు ముప్పుగా పరిణమించే పరిస్థితులు నెలకొంటే, అధ్యక్షుడు అత్యవసరంగా ఆయా దేశాలపై పలురకాల ఆంక్షలు విధించవచ్చు. ఇందుకోసం చట్టసభ (కాంగ్రెస్) అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం ట్రంప్ విధిస్తున్న సుంకాలు ఈ చట్టం పరిధిలోకి రావని, అడ్డగోలు సుంకాల వసూలు చేసేందుకు ట్రంప్‌కు చట్టసభ అనుమతి ఇవ్వలేదని కోర్టులు పేర్కొంటున్నాయి. ఒకవేళ సుప్రీంకోర్టు కూడా వ్యతిరేకంగా తీర్పు ఇస్తే సుంకాలు నిలిచిపోతాయా, ట్రంప్ ఏం చేస్తారన్నది చర్చనీయాంశంగా మారింది. అయితే అధ్యక్షుడిగా ఉన్న అధికారాలతో ట్రంప్ సుంకాలు విధించేందుకు ఇతర చట్టాలు కూడా ఉన్నాయని.. కాకపోతే ట్రంప్ ఇప్పటిలా దూకుడుగా, ఇష్టం వచ్చినట్టు టారిఫ్‌లు వేయడం కుదరదని అమెరికా చట్టాల నిపుణులు చెబుతున్నారు.

ఆందోళనకరంగా బిల్ క్లింటన్ ఆరోగ్యం!

» గుండె వ్యాధులతో తీవ్ర ఇబ్బంది

» లయ సరిచేసేలా గుండెకు డీఫిబ్రిలేటర్



డీఫిబ్రిలేటర్ బ్యాగుతో క్లింటన్

న్యూయార్క్, ఆగస్టు 30: అమెరికా మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్ ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా మారింది. ఇప్పటికే గుండె సంబంధిత వ్యాధులతో ఆయన బాధపడుతున్నారు. దీనికి సంబంధించి పలుమార్లు సర్జరీలు కూడా అయ్యాయి. ఇటీవల ఆయన అమెరికాలోని హ్యాంప్‌టన్స్ ఎయిర్‌పోర్టులో డీఫిబ్రిలేటర్ అనే వైద్య పరికరంతో కనిపించారు. ఆయనతో పాటు భార్య హిల్లరీ క్లింటన్ కూడా ఉన్నారు. పోర్టబుల్ డీఫిబ్రిలేటర్ ఉన్న బ్యాగును ఆమె తీసుకుని వెళుతున్నారని డెయిలీ మెయిల్ వార్తా సంస్థ పేర్కొంది. 79 ఏళ్ల క్లింటన్‌కు 2004లోనే హార్ట్‌ఎటాక్ వచ్చింది. నాలుగుసార్లు బైపాస్ సర్జరీ కూడా జరిగింది. కాగా, డీఫిబ్రిలేటర్ ఓ వైద్య పరికరం. గుండెలో అసాధారణ స్పందనలను సరిచేయడానికి ఉపయోగిస్తారు. ఇది గుండెకు ఓ నియంత్రిత స్థాయిలో విద్యుత్ షాక్‌ను ఇస్తుంది. దీంతో లయ తప్పిన గుండెను సాధారణ పరిస్థితిలోకి తీసుకువచ్చే వీలవుతుంది. ప్రాణాంతక గుండె లయ, అరిథ్మియా పరిస్థితుల నుంచి రోగిని కాపాడే అవకాశం కలుగుతుంది.

విదేశీ విద్యార్థులకు ట్రంప్ ని'బంధనాలు'!

ఎఫ్-1 వీసా నిబంధనల్లో త్వరలో మార్పులు.. అమలులోకి వస్తే వర్సిటీలు, కోర్సుల మార్పు కష్టమే

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించేందుకు వచ్చే విదేశీ విద్యార్థులకు ఇచ్చే ఎఫ్-1 వీసా నిబంధనల్లో మార్పులకు ట్రంప్ యంత్రాంగం చేసిన ప్రతిపాదనలు భారతీయుల డాలర్ డ్రీమ్స్‌ను దెబ్బకొట్టేలా ఉన్నాయి. ముఖ్యంగా విద్యార్థి వీసాపై అమెరికా వెళ్లి ఏదో ఒక కోర్సు చేస్తున్నామని చెబుతూ అక్కడే సెటిల్ అయిపోదామనుకునే వారి ఆశలను దెబ్బతీసేలా కనిపిస్తున్నాయి. ప్రస్తుతమున్న నిబంధనల ప్రకారం.. ఎఫ్-1 వీసాతో అమెరికా వెళ్లిన విద్యార్థులు తాము చదువుకునే కోర్సు కాలపరిమితి ప్రకారం ఆ దేశంలో ఉండవచ్చు. కోర్సులో చేరిన తర్వాత మేజర్స్ లేదా ప్రోగ్రామ్‌ను కూడా మార్చుకోవచ్చు. కోర్సు అధికారికంగా పూర్తయిన తర్వాత అదనంగా మరో 60 రోజులు అక్కడే ఉండవచ్చు. ఆ తర్వాత కూడా మరికొన్ని రోజులు అక్కడే ఉండాలనుకుంటే ఓపీటీ(ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్) లేదా స్టెమ్(సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్) ఓపీటీకి దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంపిక చేసుకున్న కోర్సులు లేదా ట్రైనింగ్ ప్రోగ్రామ్ ఆధారంగా వీసా గడువును పొడిగిస్తారు. అయితే, ట్రంప్ యంత్రాంగం తాజాగా చేసిన ప్రతిపాదనలు ఈ నిబంధనలను మరింత కఠినతరం చేయనున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు తమ మేజర్స్ ప్రోగ్రామ్స్‌ను అమెరికా వెళ్లిన తొలి సంవత్సరంలో మార్చుకునే వీలు ఉండదని అంటున్నారు. ఓ డిగ్రీని అమెరికాలో పూర్తి చేసి అదే స్థాయి లేదా అంతకంటే తక్కువ స్థాయి డిగ్రీ చేసేందుకు మళ్లీ ఎఫ్-1 వీసా పొందాలంటే ఇక కుదరదని చెబుతున్నారు. అలాగే, ఓ కోర్సు చేసేందుకు ఎఫ్-1 వీసాపై అమెరికా వెళ్లి మరో కొత్త కోర్సు చేస్తామంటే అంగీకరించరని అంటున్నారు. కొత్త కోర్సు చేయాలనుకునే వారు స్వదేశానికి వచ్చి వీసా కోసం మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిందేనని చెబుతున్నారు.

డీహెచ్ఎస్‌కు దరఖాస్తు చేసుకోవాల్సిందే

ప్రతిపాదిత నిబంధనల ప్రకారం కోర్సు కాల పరిమితి ప్రకారం గరిష్ఠంగా నాలుగేళ్ల కాల పరిమితితో ఎఫ్-1 వీసా జారీ చేస్తారు. ఆ తర్వాత కూడా అమెరికాలో ఉండాలనుకునే వారు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్ ల్యాండ్ సెక్యూరిటీ(డీహెచ్ఎస్)కు దరఖాస్తు చేసుకోవాల్సిందే. ప్రస్తుతం ఎఫ్-1 వీసాదారులు తమ కోర్సు పూర్తయిన తర్వాత 60 రోజులు దాకా అమెరికాలో ఉండవచ్చు. ఈ సమయంలో చాలామంది ఉద్యోగం సాధించి హెచ్-1బీ వీసా పొందుతున్నారు. ఇప్పుడు 60 రోజుల గడువును 30 రోజులకు కుదించనున్నారు. దీంతో విద్యార్థి వీసాతో అమెరికా వచ్చి ఆ తర్వాత హెచ్-1బీ వీసా పొందడం మరింత కష్టం కానుందని భారతీయ అమెరికన్ శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఓపీటీ ఎక్స్‌టెన్షన్ వస్తుందని ఆశించే వారు ఇకపై ఈఓఎస్‌తో పాటు వర్క్ ఆథరైజేషన్ కోసం కూడా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఎక్కువ జీతం వచ్చే ఉద్యోగాలే లక్ష్యం కావాలి



ప్రతిపాదిత నిబంధనలు అమల్లోకి వస్తే ఓపీటీ ద్వారా హెచ్-1 బీ వర్క్ వీసా పొందడం, విద్యార్థులు ఎంట్రీ లెవల్ ఉద్యోగాల్లో చేరడం కష్టం అవుతుంది. అందువల్ల విద్యార్థులు మేజర్స్/ప్రోగ్రామ్‌లలో మార్పులు తగ్గించుకోవాలి. చివరి నిమిషం వరకూ వేచి ఉండకుండా ఈఓఎస్(ఎక్స్‌టెన్షన్ ఆఫ్ స్టే)కు త్వరగా దరఖాస్తు చేసుకోవాలి. ఈఓఎస్ నిబంధనలకు అనుగుణంగా ఓపీటీ/స్టెమ్ అప్లికేషన్‌లు ఉండేలా చూసుకోవాలి. అధిక జీతం వచ్చే ఉద్యోగాలను లక్ష్యంగా చేసుకోవాలి. అప్పుడే హెచ్-1 బీకు అవకాశం ఉంటుంది.

- దిలీప్ కుమార్ నూనె, రిజిస్టర్డ్ మైగ్రేషన్ ఏజెంట్, కాస్మిక్ ఓవర్‌సీస్ కన్సల్టెంట్స్



చంద్రకాంత రాయితో చేసిన గిన్నె


జపాన్ బుల్లెట్ రైలులో మోదీ

» టోక్యో నుంచి సెండాయ్ వరకు జపాన్ ప్రధాని షిగేరు ఇషిబాతో కలిసి ప్రయాణం

» షిగేరు దంపతులకు మోదీ కానుకలు

» ఆంధ్రప్రదేశ్‌లో అరుదుగా దొరికే చంద్రకాంత రాయితో చేసిన బౌల్స్ బహుమతి

టోక్యో, ఆగస్టు 30: జపాన్ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ శనివారం బుల్లెట్ రైలులో ప్రయాణించారు. సెండాయ్ నగరానికి టోక్యో నుంచి జపాన్ ప్రధాని షిగేరు ఇషిబాతో కలిసి బయలు వెళ్లారు. అంతకు ముందు ఆయన తూర్పు జపాన్ రైల్వే కంపెనీ(జేఆర్ ఈస్ట్)లో శిక్షణ పొందుతున్న భారతీయ లోకో పైలట్లతో ముచ్చటించారు. కొత్తగా రూపొందించిన ఆల్ఫా-ఎక్స్ రైలును ఇరువురు ప్రధానులు పరిశీలించారు. అందుకు సంబంధించిన చిత్రాలను ఎక్స్‌లో పోస్టు చేశారు. బుల్లెట్ రైలు ప్రయాణానికి ముందు మోదీ 16 మంది జపాన్ గవర్నర్లతో భేటీ అయ్యారు. మరోవైపు, జపాన్ పర్యటన సందర్భంగా మోదీ.. ఆ దేశ ప్రధాని షిగేరు ఇషిబాతో, ఆయన సతీమణికి ప్రత్యేక కానుకలు– రామెన్ బౌల్స్ వెండి చాప్‌స్టిక్స్, కశ్మీరీ శాలువాలను అందజేశారు. ఆంధ్రప్రదేశ్‌లో అరుదుగా లభించే చంద్రకాంత రాయితో రామెన్ బౌల్స్‌ను తయారు చేస్తారు. చంద్రకాంత రాయిని ప్రేమ, రక్షణ, సమతౌల్యానికి ప్రతీకగా భావిస్తారు. రామెన్ బౌల్ అడుగు భాగాన్ని రాజస్థాన్ పార్చిన్‌కారి శైలిలో.. అరుదైన రాళ్లతో పొదిగిన మక్రానా పాలరాతితో తయారు చేసినట్లు సమాచారం. దీంతోపాటు.. షిగేరు ఇషిబా సతీమణికి జమ్మూకశ్మీర్ హస్తకళల విశిష్టతను చాటేలా పష్మీనా శాలువాను బహూకరించారు.



మోదీ చైనా పర్యటన వేళ ఇండియాలో ఉన్న ఆ దేశ రాయబార కార్యాలయం ఎక్స్‌లో వినాయకుడి ఫొటోను షేర్ చేసింది. ఈ విగ్రహం చైనాలో క్రీ.శ 618-907 మధ్య పాలించిన టాంగ్ వంశం కాలం నాటిది కావడం విశేషం. చైనా, భారత్‌ల మధ్య 11వందల ఏళ్ల నాటి నుంచే కళలు, విశ్వాసాలు, సంస్కృతుల కలయిక ఉందని చెప్పడానికి ఈ వినాయకుడి విగ్రహమే గుర్తు అని ఎంబసీ అధికార ప్రతినిధి యూ జింగ్ అన్నారు.

ప్రపంచం దృష్టంతా

ఆ ముగ్గురు దేశాధినేతల మీదే!

ఎస్‌సీవో సదస్సు కోసం చైనాకు చేరుకున్న ప్రధాని మోదీ

» నేడు జిన్‌పింగ్‌తో ప్రత్యేక భేటీ

» రేపు మోదీతో పుతిన్ సమావేశం



గతేడాది కజాన్‌లో జరిగిన బ్రిక్స్ సదస్సులో జిన్‌పింగ్, పుతిన్, మోదీ

తియాంజిన్, ఆగస్టు 30: ప్రధాని మోదీ ఏడేళ్ల విరామం తర్వాత చైనా గడ్డపై కాలు పెట్టారు. జపాన్ పర్యటనను ముగించుకొని ఆయన శనివారం సాయంత్రం తియాన్‌జిన్‌కు చేరుకున్నారు. ఇక్కడ ఆయన షాంఘై సహకార సంస్థ(ఎస్‌సీవో) సదస్సులో పాల్గొంటారు. అమెరికాతో తీవ్రమైన వాణిజ్యపరమైన ఉద్రిక్తతల వేళ మోదీ చైనాలో పర్యటించడం, జిన్‌పింగ్‌తో సమావేశం కానుండటంతో పాటు వాణిజ్య ఉద్రిక్తతలకు కారణమైన రష్యా అధ్యక్షుడు పుతిన్ ఇదే సమయంలో చైనాలో పర్యటిస్తుండటం, మోదీతో ప్రత్యేకంగా సమావేశం అవుతారన్న వార్తల నేపథ్యంలో ఇప్పుడు ప్రపంచం దృష్టి అంతా ఈ ముగ్గురు నేతలపైనే ఉంది. జపాన్ పర్యటన సమయంలో ప్రధాని మోదీ ఓ ఇంటర్వ్యూలో.. "ప్రపంచ ఆర్థిక స్థిరత్వం కోసం చైనా, ఇండియా కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది" అని నొక్కి చెప్పారు. మరోవైపు, పుతిన్ చైనాను 'ప్రపంచ ఆర్థిక వ్యవస్థ స్థిరత్వానికి కీలకమైన దేశం'గా అభివర్ణించారు. ఈ నేపథ్యంలో ఈ ముగ్గురు దేశాధినేతలు తమ భేటీల్లో ఏ నిర్ణయాలు తీసుకుంటారన్నదానిపై ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వేత్తలు ఆసక్తిగా ఉన్నారు. జిన్‌పింగ్, మోదీ ఆదివారం భేటీ అవుతారు. పుతిన్, మోదీ సమావేశం సోమవారం ఉంటుందని రష్యా అధ్యక్ష కార్యాలయం ఇదివరకే ప్రకటించింది. మోదీ చివరిసారిగా 2018 జూన్‌లో చైనాలో పర్యటించారు. అప్పుడు ఎస్సీవో సదస్సులో పాల్గొన్నారు. 2019అక్టోబరులో జిన్‌పింగ్ భారత్‌లో పర్యటించారు. మరుసటి ఏడాది గల్వాన్ ఘర్షణతో రెండు దేశాల మధ్య సంబంధాలు బాగా దెబ్బతిన్నాయి. అయితే, ట్రంప్ టారిఫ్ యుద్ధం మొదలు పెట్టిన తర్వాత, రెండు దేశాలు మళ్లీ వాణిజ్య చర్చలను ప్రారంభించాయి. కాగా, ఎస్సీవో సదస్సు ఆదివారం, సోమవారం రెండు రోజుల పాటు జరగనుంది.

ప్రధాని మోదీకి జెలెన్‌స్కీ ఫోన్

ప్రధాని మోదీకి ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ శనివారం ఫోన్ చేశారు. యుద్ధం ముగింపునకు రష్యా అధినాయకత్వంతో చర్చలకు తాను సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ట్రంప్‌తో ఇటీవల జరిగిన చర్చల వివరాలను తెలిపారు. అయితే తక్షణమే కాల్పుల విరమణ జరగాలని పేర్కొన్నారు. శాంతిని నెలకొల్పేందుకు చేసే అన్ని రకాల ప్రయత్నాలకు భారత్ మద్దతు ఇస్తుందని మోదీ జెలెన్‌స్కీకి ఈ సందర్భంగా తెలిపారు.

హాయ్! నేను షియావో!

» ఎస్‌సీవో సదస్సులో అత్యాధునిక ఏఐ హ్యూమనాయిడ్ రోబో సేవలు



బీజింగ్, ఆగస్టు 30: చైనా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఎస్‌సీఓ శిఖరాగ్ర సదస్సులో హ్యూమనాయిడ్ రోబోలు అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నాయి. ముఖ్యంగా సర్వీస్‌డెస్క్, ప్రెస్ సెంటర్‌లో ఉన్న షియావో హీ అనే రోబో విలేకర్లకు సహాయకారిగా మసలుకుంటోంది. అచ్చం ఒక యువతిలా కనిపించే ఈ రోబో.. జర్నలిస్టులు ఎదురుపడగానే చిరునవ్వుతో పలకరించి, అభివాదం చేస్తుంది. సదస్సుకు స్వాగతం పలుకుతుంది. తెలివితేటలు, భావోద్వేగాలు కలిగి ఉండటం ఈ రోబో విశిష్టత. ఏఎన్ఐ అనే వార్తా సంస్థ షియావోను ఇంటర్వ్యూ కూడా చేయటం విశేషం. 'టియాన్‌జిన్ నగరంలో నిర్వహిస్తున్న ఎస్‌సీఓ సదస్సు కోసం అత్యాధునిక కృత్రిమమేధ పరిజ్ఞానంతో నన్ను తయారుచేశారు. అడిగిన వెంటనే సమాచారం ఇవ్వటం, చైనీస్, రష్యన్, ఇంగ్లిష్ భాషల్లో సేవలందించటం వంటి పనుల్ని నేను చేయగలను' అని షియావో తెలిపింది. తనలో భావోద్వేగాలను గుర్తించే అడ్వాన్స్ అల్గారిథమ్స్, అడాప్టివ్ లెర్నింగ్ మాడ్యూల్స్ ఉన్నాయని పేర్కొంది. అంతర్జాతీయ ప్రతినిధులు, విలేకర్లు, సదస్సు నిర్వాహకుల మధ్య నిరంతర సమన్వయానికి అవసరమైన సమగ్ర నాలెడ్జ్ డేటాబేస్‌లను తనలో నిక్షిప్తం చేశారని, వాటి సాయంతోనే తాను సేవలు అందించగలుగుతున్నానని వెల్లడించింది. ఎస్‌సీఓ సదస్సులో షియావో మాత్రమేగాక ఇతర రోబోలు కూడా సేవలందిస్తున్నాయి. సదస్సు ప్రతినిధులకు ఐస్‌క్రీం అందించటానికి కూడా ఓ రోబో ఉండటం విశేషం.

15రోజుల పాటు అసెంబ్లీ నిర్వహించాలి

» స్పీకర్‌కు మజ్లిస్ పక్ష నేత అక్బరుద్దీన్ వినతి



హైదరాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలపై చర్చించేందుకు కనీసం 15రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని మజ్లిస్ పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. భారీ వర్షాల నేపథ్యంలో పంట నష్టపోయిన రైతులకు పరిహారం, రైతు భరోసా, రైతు బీమా, యూరియా కొరత, ధాన్యం కొనుగోలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు సంక్షేమ పథకాలు, బడ్జెట్ కేటాయింపులు, ఓవర్సీస్ స్కాలర్‌షిప్పులు, ఇమామ్, మౌజన్లకు గౌరవ పారితోషికం చెల్లింపు తదితర సమస్యలపై చర్చించాల్సి ఉందని పేర్కొన్నారు.

కేసీఆర్ బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వం: ఏలేటి



రాష్ట్రంలోని ప్రధాన సమస్యలపై అసెంబ్లీలో చర్చలకు అవకాశమివ్వని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కేసీఆర్ సర్కారు బాటలోనే నడుస్తోందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. రాజకీయ ప్రయోజనాల కోసం శాసనసభ నిర్వహించడం అసమంజసం అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. వర్షాలు, వరదలు వల్ల కలిగిన నష్టం, యూరియా సమస్యతోపాటు, విద్యార్థులు, నిరుద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఆర్టీసీ సిబ్బంది, ఆటో డ్రైవర్ల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. అసెంబ్లీ సమావేశాలు 30 రోజులు నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరినట్లు మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఇందుకు అనుగుణంగా రోజుకో సమస్యపై చర్చించేందుకు 30 అంశాలతో జాబితాను అందజేశామని చెప్పారు. ఇక, కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలనే చిత్తశుద్ధి రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటే కాళేశ్వరం అనే జైలును ఏర్పాటు చేసి నిందితులను అందులో వేయాలని బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి మీడియా పాయింట్ వద్ద వ్యాఖ్యానించారు. వరద బాధితులకు ప్రభుత్వం మొండిచేయి చూపిందని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ విమర్శించారు.

తప్పు చేయకపోతే భయమెందుకు?: బల్మూరి

కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో ఎలాంటి తప్పు జరగలేదనప్పుడు.. మామాఅల్లుళ్లు(కేసీఆర్, హరీశ్‌రావు)కు ఎందుకు భయపడుతున్నారని కాంగ్రెస్ నేత, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ప్రశ్నించారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టవద్దని కోరుతూ కోర్టుకు ఎందుకు వెళ్లారని నిలదీశారు. ఆయన మీడియా పాయింట్‌లో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ గురించి వాస్తవాలను ప్రజలకు చెప్పేందుకే అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కాగా, ప్రధాన ప్రతిపక్ష నేతగా అసెంబ్లీలో తన గళం విప్పకుండా ఫాంహౌస్‌లో ఉండే కేసీఆర్‌కు ఎమ్మెల్యేగా కొనసాగే అర్హత లేదని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస రెడ్డి అన్నారు. కేసీఆర్‌కు ఆరోగ్యం బాగోకపోతే వీల్‌చైర్ మీద వచ్చి సభకు హాజరు కావల్సిందని అన్నారు. అది కూడా సాధ్యం కాకపోతే ఆ పార్టీ మరొకరిని ప్రతిపక్షనేతగా ఎన్నుకుని ప్రజల పక్షాన నిలవాలని సూచించారు. ఇక, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ.. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక బీఆర్ఎస్ నేతల వెన్నులో వణుకు పుట్టించిందని అన్నారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ.. కాళేశ్వరం అంశంలో తమ బండారం బయట పడుతుందనే బీఆర్ఎస్ నేతలు హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ వేశారని ఆరోపించారు.

పీపీటీకి అప్పుడు మాకు అవకాశం ఇచ్చారా?

» బీఆర్ఎస్ నేతలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రశ్న



హైదంరాబాద్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): గతంలో చాలా అంశాలపైన శాసనసభలో పవర్ పాయింట్ ప్రజంటేషన్(పీపీటీ) ఇవ్వడానికి అనుమతించాలంటూ అప్పటి స్పీకర్‌కు తాము లేఖలు రాశామని, అప్పుడు తమకు అవకాశం ఇచ్చారా ? అని బీఆర్ఎస్ నాయకత్వాన్ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నిలదీశారు. ప్రతిపక్షాలకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చే సంప్రదాయం లేదంటూ అప్పుడు వాదించిన బీఆర్ఎస్ నేతలు.. ఇప్పుడు ఎలా అడుగుతున్నారని ప్రశ్నించారు. ఈ మేరకు అసెంబ్లీలో శనివారం ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 6,500 కోట్ల మేరకు వడ్డీలు చెల్లించట్లేదంటూ బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారని, తమ ప్రభుత్వం కట్టకుంటే బీఆర్ఎస్ నేతలు కడుతున్నారా ? అని భట్టి ప్రశ్నించారు.

కేసీఆర్ అసెంబ్లీకి రాకుంటే..
కాళేశ్వరం విషయంలో తప్పు ఒప్పుకున్నట్టే

» మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అన్నీ తానేనని గొప్పలు చెప్పుకున్న కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై వివరణ ఇవ్వాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆయన తప్పు చేశానని ఒప్పుకున్నట్లేనని స్పష్టం చేశారు. కేసీఆర్ అసెంబ్లీ వరకు కారులో వస్తే అక్కడ నుంచి వీల్‌చైర్‌లో సభలోకి రావచ్చునని సూచించారు. అసెంబ్లీ లాబీలో ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. కేసీఆర్ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ఆయన హయాంలోనే కూలిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఈ సందర్భంగా విమర్శించారు. కాళేశ్వరంపై విచారణ చేపట్టిన కమిషన్ చైర్మన్ పీసీ ఘోష్‌కు న్యాయమూర్తిగా మంచి పేరుందని అన్నారు. ఆయన ఇచ్చిన నివేదికకు భయపడే కేసీఆర్, హరీశ్‌రావు కోర్టుకు వెళ్లారని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం కమిషన్ నివేదిక తప్పని కేసీఆర్ భావించిన పక్షంలో అసెంబ్లీకి వచ్చి వివరణ ఇవ్వాలన్నారు. కాళేశ్వరంపైన అసెంబ్లీలో చర్చ పెడితే బీఆర్ఎస్ సభ్యులు వాకౌట్ చేయకుండా తమపై పూలు జల్లుతారా? అంటూ ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టులో రూ.లక్ష కోట్లు తిన్న వాళ్లను తాము ఎలా వదిలేస్తామని ప్రశ్నించారు.

సభకు బీసీ బిల్లులు



(మొదటిపేజీ తరువాయి)

మరో కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన శాసనసభ కమిటీ హాలులో శనివారం మధ్యాహ్నం గంటకు పైగా జరిగిన సమావేశంలో ప్రధానంగా బీసీ రిజర్వేషన్లు, వరద నష్టం, ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికపై చర్చించారు. అనంతరం సచివాలయంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ సమావేశం వివరాలను విలేకరులకు వెల్లడించారు. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, స్థానిక సంస్థలు, విద్యా ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే రెండు ఆర్డినెన్స్‌లను రూపొందించి గవర్నర్ ఆమోదం కోసం ఇదివరకే పంపించామని తెలిపారు. అవి ఆమోదం పొందకపోవడంతో వాటి స్థానంలో రెండు చట్టాల సవరణ బిల్లులను శాసనసభలో ప్రవేశపెట్టాలని క్యాబినెట్ నిర్ణయించిందన్నారు. రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదన్న పంచాయతీరాజ్ చట్టం-2018, పురపాలక చట్టం-2019లోని నిబంధనలను తొలగించడం ఈ సవరణ చట్టాల లక్ష్యమని తెలిపారు. దానికితోడు గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల్లో బీసీలకు 42% రిజర్వేషన్ల కల్పనకు ప్రత్యేక జీఓను జారీ చేయాలని క్యాబినెట్ నిర్ణయించిందని చెప్పారు.

వర్షాలతో ప్రాణ, ఆస్తి నష్టం

ఇటీవల అతి భారీ వర్షాలతో వివిధ ప్రాంతాల్లో ప్రాణ, ఆస్తి నష్టం జరిగిందని మంత్రి పొంగులేటి తెలిపారు. పలు జాతీయ రహదారులు, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ రోడ్లు, రైల్వే లైన్లు, చెరువులు దెబ్బ తిన్నాయన్నారు. నష్టాన్ని పూర్తిగా అంచనా వేయాలంటూ కలెక్టర్లను ఆదేశించామని చెప్పారు. నష్ట వివరాలపై సోమవారం సాయంత్రం 4 గంటలకు ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు, జిల్లా ఇన్‌చార్జి మంత్రులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహిస్తారని తెలిపారు. మరమ్మతులు, ఇతర పనులకు అనుమతులు ఇవ్వాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకుందని చెప్పారు. నష్టాల వివరాలతో సిద్ధంగా ఉండాలని కలెక్టర్లను క్యాబినెట్ ఆదేశించిందన్నారు.

గోశాల సంక్షేమ బోర్డు ఏర్పాటుకు నిర్ణయం

తెలంగాణ రాష్ట్ర గోశాలల సంక్షేమ బోర్డు ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని మంత్రి చెప్పారు. పేరుకు గోశాలలు వందల్లో ఉన్నప్పటికీ నిర్వహణకు సరైన విధివిధానాలు లేవన్నారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులను ఉపయోగించుకోవడం, గోశాలల నిర్వహణలో మహిళలకు 50 శాతం భాగస్వామ్యాన్ని కల్పించడం, గ్రామ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో గోశాలల నిర్మాణంపై చర్చించి నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.

వాతావరణ కేంద్రాల నిర్మాణం

కేంద్ర ప్రభుత్వం 'నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్టు కింద ఇచ్చే గ్రాంటు గురించి చర్చించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్నిచోట్లా వర్షాలు కురియగానే మానవ ప్రమేయం లేకుండా వర్షపాతాన్ని లెక్కించడం కోసం వాతావరణ కేంద్రాలు, ప్రాజెక్టుల్లోకి వచ్చే వరదను కూడా లెక్కించడం కోసం వాటర్ గేజ్ స్టేషన్లు ఈ పథకం కింద ఏర్పాటు చేస్తామని చెప్పారు.

మిల్లర్ల నుంచి సొమ్ము రికవరీ

2022-23 సంవత్సరంలోని రబీ సీజన్‌కు సంబంధించి మిల్లింగ్ టెండర్లలో అవకతవకలు జరిగాయని మంత్రి చెప్పారు. రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి 7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం తాలూకు బియ్యంను ఇవ్వాల్సి ఉందన్నారు. గత ప్రభుత్వం టెండర్లు పిలిచి వాటి పురోగతిని పట్టించుకోలేదని చెప్పారు. తమ ప్రభుత్వం ఏర్పడ్డాక సొమ్ము రికవరీకి విధాన నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఈ సొమ్మును మూడు వారాల్లో చెల్లించాలని స్పష్టం చేశారు. టెండర్ల సందర్భంలో దొడ్డు రకం, సన్నరకాలకు వేసిన బిడ్ల రేట్ల ప్రకారం రికవరీ ఉంటుందని చెప్పారు. రికవరీ సొమ్మును చెల్లించని మిల్లర్లపై పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేస్తామని ప్రకటించారు. న్యాయపరమైన చర్యలపై క్యాబినెట్ సబ్ కమిటీ చర్చించి నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. మత్స్య సహకార సంఘాల ఎన్నికలు ఆలస్యం అవుతున్న నేపథ్యంలో సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జిలను నియమించాలని నిర్ణయించామని చెప్పారు. సభ్యుల్లో ఒకరిని నామినేట్ చేస్తామన్నారు.

బిల్లులకు అన్ని పార్టీలు సహకరించాలి: పొన్నం ప్రభాకర్

బీసీలకు 42% రిజర్వేషన్లను అమలు చేయడంపై తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. న్యాయ కోవిదులతో చర్చల అనంతరమే ఈ నిర్ణయానికి వచ్చామన్నారు. ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు యథాతథంగా ఉంటాయన్నారు. అసెంబ్లీలో పెడుతున్న బిల్లులపై అన్ని పార్టీల అభిప్రాయాలు తీసుకుంటామని చెప్పారు. దీనికి పార్టీలు, ప్రజలు సహకరించాలని కోరారు.

అజారుద్దీన్‌కు జాక్‌పాట్!

» అనూహ్యంగా వరించిన ఎమ్మెల్సీ పోస్టు
» కలిసి వచ్చిన సమీకరణాలు
» మంత్రి అయ్యే ఛాన్స్!!



హైదరాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా టీజేఎస్ అధినేత కోదండరాం, మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌లను ప్రతిపాదిస్తూ.. రాష్ట్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయంతో అజారుద్దీన్ జాక్‌పాట్ కొట్టినట్లయింది. హైదరాబాదీ.. ముస్లిం వర్గానికి చెందినవాడు కావడంతో సమీకరణాలు కలిసి.. రాష్ట్ర మంత్రివర్గంలో చోటు దక్కేందుకూ ఆస్కారం ఉంది. వాస్తవానికి కోదండరాం, అమెరలీఖాన్‌ల ఎమ్మెల్సీ సభ్యత్వాలను సుప్రీం కోర్టు రద్దు చేసిన తర్వాత.. వారిద్దరినీ తిరిగి ప్రతిపాదించాలా.. లేక వేరే ప్రాధాన్య పదవులు ఇవ్వాలా అన్న చర్చ కాంగ్రెస్ పార్టీలో, ప్రభుత్వంలో చోటు చేసుకుంది. అయితే ఇటీవల ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి సందర్శించినప్పుడు.. కోదండరాంను మరో 15 రోజుల్లో ఎమ్మెల్సీని చేస్తామంటూ ప్రకటించారు. తద్వారా ఆయన విషయంలో గందరగోళానికి తెర దించారు. మంత్రివర్గంలో చోటుతో ముడిపడి ఉండడంతో అమెరలీఖాన్ సీటు విషయంలో పెద్ద ఎత్తున తర్జన భర్జన నడిచింది. చివరికి పార్టీ అధిష్ఠానం అజారుద్దీన్‌కే ఓటు వేసింది. అమెరలీఖాన్‌ను ఏదైనా కార్పొరేషన్‌కు చైర్మన్‌గా నియమించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. వాస్తవానికి 2023 అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ సీటు నుంచి పోటీ చేసి ఓటమిపాలైన అజారుద్దీన్.. ఉప ఎన్నికల్లో అదే స్థానం నుంచి పోటీ చేసేందుకు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. అయితే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో అజారుద్దీన్‌తో పాటుగా డజను మంది నాయకులు అభ్యర్థిత్వం కోసం పోటీ పడుతున్నారు. ఇంత పోటీ వాతావరణంలో అజారుద్దీన్‌కు ఎమ్మెల్సీగా అవకాశం దక్కడం.. మంత్రివర్గంలో చోటు దక్కేందుకూ అవకాశాలుండడం.. నిజంగా జాక్‌పాటేనని కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

కాళేశ్వరం నివేదిక నేడు బహిర్గతం

» శాసనసభలో ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం
» బ్యారేజీల వైఫల్యానికి కారకులు, కారణాలను వివరించనున్న సర్కారు
» మాగంటి గోపీనాథ్ మృతికి సభ సంతాపం
» ఎన్టీఆర్‌కు భక్తుడు.. నాకు మిత్రుడు: రేవంత్
» ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా పార్టీ మారలేదు: కేటీఆర్
» శాసనమండలి రేపటికి వాయిదా
» నూతన సభ్యులను పరిచయం చేసిన చైర్మన్
» మాజీ సభ్యుల మృతికి మండలి సంతాపం


సీఎం రేవంత్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న సీఎస్ రామకృష్ణారావు

హైదరాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం బ్యారేజీల వైఫల్యంపై జస్టిస్ పినాకిచంద్ర ఘోష్ కమిషన్ ప్రభుత్వానికి సమర్పించిన నివేదిక ఆదివారం బహిర్గతం కానుంది. ఇంతకుముందు నివేదిక సారాంశాన్ని(జిస్ట్) మాత్రమే బయట పెట్టిన ప్రభుత్వం.. ఆదివారం నివేదికను శాసనసభలో ప్రవేశపెట్టనుంది. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల వైఫల్యానికి కారకులు/కారణాలను సభలో వెల్లడించనుంది. నివేదికపై చర్చించిన అనంతరం బాధ్యులపై ఏం చర్యలు తీసుకోవాలనే దానిపై విధాన ప్రకటన చేయనుంది. కాగా, ఈ నివేదికపై శాసనసభలో చర్చించినప్పటికీ.. తదుపరి చర్యలకు ఉపక్రమించరాదని కోరుతూ బీఆర్ఎస్ ఇప్పటికే న్యాయస్థానం తలుపు తట్టింది. అయితే నివేదిక ప్రకారం చర్యల కోసం ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్‌ను) ఏర్పాటు చేసే అవకాశాలు లేకపోలేదని తెలుస్తోంది. జస్టిస్ పీసీ ఘోష్ నివేదిక సారాంశంలో, "మేడిగడ్డ వద్ద బ్యారేజీ నిర్మాణం అన్నది ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ మదిలో మాత్రమే పుట్టిన ఆలోచన. తన ఆలోచనను గుడ్డిగా అమలు చేయడం, తానే ఇంజనీర్‌లా వ్యవహరించడం, అవకతవకలు, నిబంధనల ఉల్లంఘన వల్లే ఆ ప్రాజెక్టు కూలింది. నిపుణుల కమిటీ సిఫారసును కూడా పట్టించుకోలేదు. నీటి లభ్యత ఉందనే సాకుతో మేడిగడ్డ వద్ద నిర్మాణానికి ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న నిర్ణయం మొత్తం బ్యారేజీలను ప్రమాదంలో నెట్టేసింది. దీనికి పూర్తి బాధ్యత కేసీఆర్‌దే" అని పేర్కొన్న విషయం తెలిసిందే. కాగా, నివేదికలో పేర్కొన్న అంశాలన్నింటిపైనా శాసనసభలో చర్చించనున్నారు.

మాగంటి గోపీనాథ్ మృతికి సంతాపం..

శాసనసభ తొలిరోజు సమావేశం శనివారం ఉదయం ప్రారంభం కాగానే.. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభలో సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. గోపీనాథ్ ఎన్టీఆర్‌కు గొప్ప భక్తుడని అన్నారు. రాజకీయంగా పార్టీలు వేరైనా.. వ్యక్తిగతంగా తనకు మంచి మిత్రుడన్నారు. 1983లో తెలుగుదేశం పార్టీలో రాజకీయ ప్రస్థానం ప్రారంభించినప్పటి నుంచి గోపీనాథ్ చేపట్టిన పదవులను రేవంత్‌రెడ్డి గుర్తుచేసుకున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ప్రజల కోసం గోపీనాథ్ చివరిదాకా పాటుపడ్డారని అన్నారు. ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా తమ పార్టీపై నమ్మకంతో విధేయుడిగా ఉన్నారని చెప్పారు. సంతాప తీర్మానంపై మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, బీఆర్ఎస్ సభ్యులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, వేముల ప్రశాంత్ రెడ్డి, బీజేపీ సభ్యుడు వెంకటరమణారెడ్డి, ఎంఐఎం సభ్యుడు బలాలా, సీపీఐ సభ్యుడు కూనంనేని సాంబశివరావు మాట్లాడారు. అనంతరం సభ ఆదివారానికి వాయిదా పడింది.

శాసనమండలి రేపటికి వాయిదా..

శాసనమండలి సమావేశాలు శనివారం ప్రారంభం కాగానే చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఇటీవల నూతనంగా ఎన్నికైన సభ్యులు అద్దంకి దయాకర్, శంకర్‌నాయక్, విజయశాంతి, నెల్లికంటి సత్యం, శ్రీపాల్‌రెడ్డి, సి.అంజిరెడ్డి, మల్క కొమరయ్య, మీర్జా రియాజుల్ హసన్ అఫెండీలను సభకు పరిచయం చేశారు. అనంతరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శాసనసమండలి సభ్యులుగా పనిచేసి ఇటీవల మరణించిన టి.రత్నాకర్, ఎం.రంగారెడ్డిలకు సంతాపం తెలిపారు. అనంతరం మండలిని సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. సోమవారం కాళేశ్వరం కమిషన్ నివేదిక, బీసీ రిజర్వేషన్లపై మండలిలో చర్చించనున్నారు. శనివారం చైర్మన్ సుఖేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మండలి బీఏసీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు, డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, శాసన మండలి ప్రతిపక్షనేత మధుసూదనాచారి, చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్సీలు మహేశ్‌కుమార్‌గౌడ్, నెల్లికంటి సత్యం, అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు పాల్గొన్నారు

కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు తర్ఫీదు

శాసనసభలో ఆదివారం కాళేశ్వరం బ్యారేజీలపై నివేదికను బహిర్గతం చేయనుండటంతో.. దానిపై అధికార పార్టీ ఎమ్మెల్యేలకు శనివారం రాత్రి జలసౌధలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గన్‌మెన్లు, ఫోన్లు లేకుండా రావాలని వారికి సమాచారం ఇవ్వగా.. అందరూ అలాగే హాజరయ్యారు. కేసీఆర్, హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌ల పాత్రను కాళేశ్వరం కమిషన్ నివేదిక ఎలా ఎత్తిచూపిందనే విషయాన్ని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వారికి వివరించారు. విపక్ష బీఆర్ఎస్‌ను ఎలా ఎదుర్కోవాలి? విమర్శలకు ఎలా జవాబు చెప్పాలనే దానిపై తర్ఫీదునిచ్చారు. ఆదివారం నివేదికను సభలో ప్రవేశపెట్టనుండటంతో గోప్యంగా ఉండాలని ఆదేశాలిచ్చినట్లు సమాచారం.

అసెంబ్లీలో చర్చించినా మాపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దు

(మొదటిపేజీ తరువాయి)

వెలువడే వరకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకుండా స్టే ఇవ్వాలని కోరారు. కాళేశ్వరం అవకతవకలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక అక్రమమని, కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ యాక్ట్ సెక్షన్ 8-బీ, 8-సీ కింద తమకు నోటీసు ఇవ్వకుండా తమ ప్రతిష్ఠ దెబ్బతీసేలా కమిషన్ నిర్ధారణలు చేసిందని, సదరు కమిషన్ నివేదికను కొట్టేయాలని కోరుతూ ఇప్పటికే కేసీఆర్, హరీశ్‌లు హైకోర్టులో రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. కమిషన్ నివేదికను అసెంబ్లీ ఎదుట ఉంచి చర్చించే వరకు ఎలాంటి చర్యలు తీసుకోబోమని ప్రభుత్వం చెప్పడంతో వారిద్దరి పిటిషన్లపై హైకోర్టు ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేదు. కమిషన్ నివేదికపై అసెంబ్లీలో చర్చించిన తర్వాత ప్రభుత్వం తమపై చర్యలు తీసుకునే అవకాశం ఉందని, అసెంబ్లీలో చర్చించిన తర్వాత కూడా తమపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ తాజాగా శనివారం కేసీఆర్, హరీశ్‌లు మధ్యంతర దరఖాస్తులు దాఖలు చేశారు. శాసనసభలో చర్చించిన తర్వాతే చర్యలు తీసుకున్నామని ప్రభుత్వం చెప్పే ప్రమాదం ఉందని.. అసెంబ్లీలో చర్చించామనే కారణాన్ని అడ్డం పెట్టుకుని రాజకీయ కక్ష తీర్చుకోవాలని, పిటిషనర్ల కీర్తి ప్రతిష్ఠలను, పేరు ప్రఖ్యాతులను దెబ్బ తీయాలని చూస్తున్నారని ఆరోపించారు. సెక్షన్ 8-బీ, సెక్షన్ 8-సీ కింద నోటీసు ఇవ్వకుండా వెలువరించిన కమిషన్ నివేదికే అక్రమమని, సదరు అక్రమ నివేదిక ఆధారంగా ప్రభుత్వం దురుద్దేశంతో వ్యవహరిస్తోందని ఆరోపించారు. అసెంబ్లీలో చర్చించాం కాబట్టి చర్యలు తీసుకున్నామని ప్రభుత్వం సమర్థించుకునే అవకాశం ఉందని, అలా చేస్తే తిరిగి పూరించలేని విధంగా తమకు నష్టం జరుగుతుందని పిటిషనర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అత్యవసర పరిస్థితుల నేపథ్యంలో అసెంబ్లీలో చర్చించినప్పటికీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకుండా స్టే ఇవ్వడంతోపాటు ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న రిట్ పిటిషన్లలో హైకోర్టు తుది తీర్పు ప్రకటించే వరకు కమిషన్ నివేదికను సస్పెండ్ చేయాలని కోరారు. ఈ మధ్యంతర దరఖాస్తులు ప్రధాన పిటిషన్లతో కలిపి రెగ్యులర్ విధానంలో త్వరలో విచారణకురానున్నట్లు తెలిసింది.

ఉదయం బిల్లులు, సాయంత్రం నివేదికపై చర్చ

» పంచాయతీ, మునిసిపల్ చట్టాల సవరణ బిల్లులు సహా ఘోష్ నివేదికనూ ప్రవేశపెట్టనున్న సర్కారు
» శాసనసభ బీఏసీ సమావేశంలో నిర్ణయం
» వర్షాలు, యూరియాపై చర్చకు బీఆర్ఎస్ పట్టు
» నివేదిక వచ్చాక చర్చిద్దామన్న భట్టి, శ్రీధర్‌బాబు
» బీఏసీ నుంచి హరీశ్, ప్రశాంత్‌రెడ్డి వాకౌట్


బీఏసీ సమావేశంలో పాల్గొన్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం, తదితరులు

హైదరాబాద్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించేందుకు వీలుగా పంచాయతీరాజ్, మునిసిపల్ చట్టాల సవరణ బిల్లులతో పాటు కాళేశ్వరంపై పీసీ ఘోష్ కమిషన్‌ను నివేదికను ఒకే సారి అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని శాసనసభ బీఏసీ సమావేశంలో నిర్ణయించారు. ఉదయాన్నే బిల్లులపై చర్చ చేపట్టి ఆమోదించాక, సాయంత్రం నివేదికపై చర్చ చేపట్టనున్నారు. శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్ అధ్యక్షతన శనివారం జరిగిన అసెంబ్లీ బిజినెస్ అడ్వయిజరీ కమిటీ(బీఏసీ) సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, బీఆర్ఎస్ తరఫున హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్, మునిసిపల్ చట్టాల సవరణ బిల్లులు, పీసీ ఘోష్ కమిషన్ నివేదికను ప్రవేశపెట్టి చర్చిద్దామని మంత్రులు ప్రతిపాదించగా.. తొలుత పంట నష్టం, యూరియా కొరతపై చర్చ చేపట్టాల్సిందేనని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి పట్టు పట్టారు. పంట నష్టం వివరాలు పూర్తి స్థాయిలో రానందున.. ముందుగా చట్ట సవరణ బిల్లులు, పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై చర్చిద్దామని మంత్రులు అన్నారు. ఈ క్రమంలో హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి నిరసన వ్యక్తం చేస్తూ... సమావేశం నుంచి వాకౌట్ చేశారు. వర్షాలు, వరదలతో పంటనష్టం, ఫీజు రీయింబర్స్‌మెంట్ సహా 30 రకాల సమస్యలపై సభలో చర్చించాలని బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి ప్రతిపాదించారు. కాగా, సమస్యలపై చర్చించేందుకు సభను కనీసం 15 రోజులు నిర్వహించాలని బీఆర్ఎస్, బీజేపీ కోరగా.. వరద పరిస్థితులు, గణేష్ నిమజ్జనం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఆదివారం నిర్ణయం తీసుకుంటామని మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు. కాగా, పీసీఘోష్ నివేదికపై చర్చ ఆదివారం ముగియని పక్షంలో సోమవారమూ కొనసాగించే అవకాశం ఉంది. పీసీ ఘోష్ నివేదికపై చర్చ తర్వాత సభను వాయిదా వేయాలా? లేక విరామం ఇచ్చి గణేష్ నిమజ్జనం పూర్తయ్యాక చేపట్టాలా? అనే దానిపై తర్జనభర్జన నడుస్తోంది.

నేడు సీఎం రేవంత్ సుడిగాలి ప్రయాణం

సభలో కీలకమైన పంచాయతీ, మునిసిపల్ చట్టాల సవరణ బిల్లులు, ఘోష్ కమిషన్ నివేదికపై చర్చ జరగనున్న వేళ.. కేరళలో కేసీ వేణుగోపాల్‌కు సంబంధించిన కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లాల్సి రావడంతో ఆదివారం సీఎం రేవంత్ సుడిగాలి ప్రయాణం చేయనున్నారు. ఆదివారం ఉదయం పంచాయతీరాజ్, మునిసిపల్ చట్టాల సవరణ బిల్లులపై చర్చను సీఎం ప్రారంభిస్తారు. అనంతరం బేగంపేట నుంచి ప్రత్యేక విమానంలో కేరళలోని కొచ్చి చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో అలిప్పి చేరుకుని వేణుగోపాల్ కార్యక్రమంలో పాల్గొంటారు. తిరిగి హెలికాప్టర్‌లో కొచ్చికి చేరుకుని అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో బేగంపేట వస్తారు. 4గంటల కల్లా అసెంబ్లీకి చేరుకుని.. ఘోష్ కమిషన్ నివేదికపై చర్చలో పాల్గొంటారు. కాగా, ఘోష్ నివేదికపై చర్చ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీని స్తంభింపజేసే ప్రయత్నం చేసినా, వెల్‌లోకి వచ్చి గొడవ చేసే ప్రయత్నం చేసినా వారిపై స్పీకర్ తీవ్ర చర్యలు తీసుకునే అవకాశం ఉందని అసెంబ్లీ వర్గాలు చెబుతున్నాయి.

సెప్టెంబరు రెండో వారంలో స్థానిక నోటిఫికేషన్!

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ఇప్పటికే హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి చెప్పింది. కోర్టు సూచన నేపథ్యంలో రిజర్వేషన్ల ఖరారుకు ప్రత్యేక కమిషన్ ఇచ్చిన అంశాలను పరిగణనలోకి తీసుకుని దాని ప్రకారం ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులను విడుదల చేయనుంది. అనంతరం స్థానిక ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు సమాచారం ఇస్తుంది. అడ్వొకేట్ జనరల్‌తో చర్చించిన తరువాతే 2018 పంచాయతీరాజ్ చట్టానికి సవరణ చేసి, ఎన్నికలను నిర్వహించాలని నిర్ణయించినట్టు శనివారం మీడియా ముందు మంత్రులు చెప్పారు. ఎవరైనా కోర్టుకు వెళితే ఎన్నికల నిర్వహణ, రిజర్వేషన్ల ఖరారుపై కోర్టు తీర్పుకు లోబడి వ్యవహరించాల్సి ఉంటుంది. ఎన్నికలే ఆగే పరిస్థితి వస్తే పార్టీ పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను ఇచ్చి ఎన్నికలకు వెళ్లే అవకాశాలున్నాయి. మొదట ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించాలని, తర్వాత సర్పంచి ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం భావిస్తోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ అనుసరించిన ఆనవాయితీ ఇదేనని గుర్తు చేస్తున్నారు. రాష్ట్రంలో ఏడాదిన్నరగా పంచాయతీలకు పాలక మండళ్లు లేకపోవడంతో కేంద్రం నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయి.

తుది ఓటర్ల జాబితాకు నోటిఫికేషన్

గ్రామ పంచాయతీల ఓటరు జాబితాల ప్రకటనకు ఎన్నికల కమిషన్ ఇప్పటికే నోటిఫికేషన్ ఇచ్చింది. తాజాగా ఎంపీటీసీ, జడ్పీటీసీల పరిధిలోని ఓటరు జాబితాల సవరణ, తుది ఓటరు జాబితా ఖరారు, పోలింగ్ కేంద్రాల వివరాల ప్రకటనకు శనివారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని నోటిఫికేషన్ విడుదల చేశారు. సెప్టెంబరు 6న మండల, జిల్లా పరిషత్ కార్యాలయాల్లో ముసాయిదా ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల సమాచారాన్ని ప్రదర్శిస్తారు. 8న రాజకీయ పార్టీల ప్రతినిధులు, జిల్లా, మండల స్థాయి ఎన్నికల అధికారులతో సమావేశాలుంటాయి. వాటిలో తెలిపే అభ్యంతరాలను పరిశీలించి 10న తుది ఓటర్ల జాబితాను ఖరారు చేస్తారు.

మధ్యాహ్న భోజనంలో 3 రోజులు రాగిజావ

హైదరాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మరింత పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో మధ్యాహ్న భోజన పథకం మెనూలో రాగిజావను చేర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇక నుంచి వారంలో మూడురోజుల పాటు విద్యార్థులకు రాగిజావ అందించనుంది. అందుకవసరమైన రాగి పిండి, బెల్లం పొడిని సరఫరా చేసే బాధ్యతను శ్రీసత్యసాయి అన్నపూర్ణ ట్రస్టుకు అప్పగించింది. ప్రతి విద్యార్థికి 10 గ్రాముల రాగిపిండి, 10 గ్రాముల బెల్లం పొడి చొప్పున పాఠశాలలకు ట్రస్టు సరఫరా చేయనుంది. ట్రస్టు సహకారంతో రెండేళ్లుగా పాఠశాలలకు రాగిజావ పంపిణీ కొనసాగుతోంది. అయితే ఈ కార్యక్రమానికి అయ్యే వ్యయంలో 40 శాతం ప్రభుత్వం భరించాలని ట్రస్టు ప్రతిపాదించింది. తాజాగా ఆ ప్రతిపాదనలను ప్రభుత్వం అంగీకరించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖకు ఆదేశాలు జారీ చేసింది. రాగిజావను వండి, వడ్డించే బాధ్యతలను ఇప్పటికే మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్న మహిళా సంఘాలకు అప్పగించింది. అదనంగా రాగిజావ వండినందుకు గాను విద్యార్థికి రోజుకు 25 పైసల చొప్పున ప్రభుత్వం వారికి ప్రోత్సాహకం అందించనుంది.

పంచాయతీల్లో రద్దు.. మునిసిపాలిటీల్లో మంజూరు

- పట్టణ స్థానిక సంస్థల్లో కొత్తగా 165 పోస్టుల సృష్టి

హైదరాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కొత్తగా ఏర్పడిన మునిసిపాలిటీల్లో 165 పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసింది. అంతకు ముందు ఈ పోస్టులు మునిసిపాలిటీల్లో విలీనమైన పంచాయతీల్లో ఉండేవి. విలీనం నేపథ్యంలో వీటి అవసరం లేదని ప్రభుత్వం గుర్తించింది. రాష్ట్రంలో పంచాయతీ కార్యదర్శితోపాటు జూనియర్ అసిస్టెంట్ వంటి వి కలిపి 6,884 పోస్టులు ఉండగా వీటిలో 165 పోస్టులను తగ్గించి 6,719 పోస్టులు చేశారు. ఇక పట్టణ స్థానిక సంస్థల్లో (మునిసిపాలిటీ) 38 మేనేజర్/రెవెన్యూ ఆఫీసర్ కేటగిరీ-3తోపాటు 17 జూనియర్ అసిస్టెంట్, 37 జూనియర్ అసిస్టెంట్, 55 వరకు వార్డు ఆఫీసర్/బిల్ కలెక్టర్, 3 అటెండర్/ఆఫీస్ సబార్డినేట్, 4 కామాటి, 1 ఫిట్టర్, 8 స్వీపర్, ఒకటిచొప్పున పంప్ ఆపరేటర్, వాచ్‌మెన్ పోస్టులు కలిపి మొత్తం 165 పోస్టులను కొత్తగా సృష్టించారు. దీంతో మునిసిపాలిటీల్లో పోస్టుల సంఖ్య 2,119కు చేరింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా శనివారం జీవో జారీ చేశారు.

సైన్యం సాంకేతికావసరాల కోసం ఐఐటీహెచ్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్

కంది, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): భారత సైన్యం కోసం వర్చువల్ రియాలిటీ, ఏఐ, రోబోటిక్స్, డ్రోన్ టెక్నాలజీ తదితర అత్యాధునిక సాంకేతికలపై పరిశోధనలు, ఆవిష్కరణల కోసం.. ఆర్మీకి చెందిన సిమ్యులేటర్ డెవలప్‌మెంట్ డివిజన్(ఎస్‌డీడీ) ఐఐటీ హైదరాబాద్(ఐఐటీహెచ్)తో ఒప్పందం కుదుర్చుకొంది. పరిశోధనల కోసం ఐఐటీ హైదరాబాద్‌లో 'విగ్రహ' పేరుతో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు ఒప్పందంపై ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి, ఎస్‌డీడీ బ్రిగేడియర్ ఏకే చతుర్వేది సంతకాలు చేశారు.

'బీసీ బిల్లు'కు అన్ని పార్టీలు మద్దతు తెలపాలి

- అసెంబ్లీలో రాజకీయం చేస్తే ఊరుకోం: జాజుల

హైదరాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ల బిల్లుకు బేషరతుగా అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ప్రకటించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లపై చట్టం చేసిన తర్వాతనే ప్రత్యేక జీవోను తేవాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. సామాజిక రిజర్వేషన్లపై 50% పరిమితి ఎత్తివేస్తూ క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. బీసీ రిజర్వేషన్లు 42 శాతం పెంచడానికి పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించాలని క్యాబినెట్ నిర్ణయించడాన్ని అభినందిస్తున్నామన్నారు. బీసీ రిజర్వేషన్ అంశంపై అసెంబ్లీలో రాజకీయం చేస్తే ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

సెప్టెంబరు 7న సంపూర్ణ చంద్రగ్రహణం

యాదగిరిగుట్ట, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి దివ్యక్షేత్రంలో సెప్టెంబరు 7న(ఆదివారం) చంద్రగ్రహణం సందర్భంగా ఆలయ వేళల్లో మార్పులు చేశారు. రాత్రి 9.56 నుంచి 1.26 గంటల వరకు సంపూర్ణ చంద్రగ్రహణం ఏర్పడుతుంది. దీంతో ప్రధానాలయం, అనుబంధ, ఉప ఆలయాల్లో మధ్యాహ్నం 12 గంటలలోపు నిత్య కైంకర్యాలు, నివేదనలు జరగనున్నాయి. తదనంతరం ఆలయం ద్వార బంధనం చేస్తారు. తిరిగి 8న(సోమవారం) 3.30గంటలకు ఆలయం శుభ్రం చేసి సంప్రోక్షణ చేసి నిత్య కైంకర్యాలు నిర్వహించేందుకు ఆలయ వేళల్లో మార్పులు చేశారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో భక్తుల కోసం శ్రీగరుడ ట్రస్టు పేరుతో నూతన పథకం ప్రవేశపెట్టారు. భక్తులకు వసతి, దర్శన కూపన్లు ఇచ్చి సదుపాయాలతోపాటు బాండ్లు అందజేస్తారు.

సర్కారు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం: కృష్ణయ్య

రాంనగర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య చెప్పారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రత్యేక జీవో తేవాలని క్యాబినెట్ నిర్ణయించడం హర్షించదగ్గ విషయమన్నారు. శనివారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కృష్ణయ్య మాట్లాడారు. గవర్నర్ ద్వారా ఆర్డినెన్స్ ఆమోదింపచేసి జీవో జారీ చేయాలన్నారు.

'సంక్షేమం' ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సవ్యసాచి

హైదరాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ శాఖల పథకాల సమన్వయానికి, కేంద్రీకృత నిర్ణయాల కోసం 1994 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్, ప్రస్తుత పశు సంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సవ్యసాచి ఘోష్‌ను 'సంక్షేమ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి'గా ప్రభుత్వం నియమించింది. రాష్ట్ర షెడ్యూల్డు కులాల సంక్షేమం, వెనుకబడిన తరగతుల సంక్షేమం, అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖల పరిధిలోని పథకాలను సమన్వయం చేస్తూ కేంద్రీకృతంగా పర్యవేక్షించాలని సూచించింది.

కొడంగల్ డెవలప్‌మెంట్ అథారిటీకి 30 కోట్లు

కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(కాడా)కి ప్రభుత్వం 30కోట్లను మంజూరు చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకై ఈ నిధులను విడుదల చేస్తున్నట్లు వెల్లడించింది.

సచివాలయంలో చీఫ్ ఇంజనీర్‌గా కె.ప్రసాద్

నీటిపారుదలశాఖలో సూపరింటెండింగ్ ఇంజనీర్(ఎస్‌ఈ) నుంచి చీఫ్ ఇంజనీర్(సీఈ)లుగా పదోన్నతి పొందిన ఇద్దరు అధికారులకు పోస్టింగ్ ఇచ్చారు. గోదావరి బోర్డులో ఎస్‌ఈగా పనిచేసి పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న కె.ప్రసాద్‌కు సచివాలయంలో చీఫ్ ఇంజనీర్(ఎంక్వయిరీస్)గా పోస్టింగ్ ఇచ్చారు. జనగామ ఎస్‌ఈగా పనిచేస్తున్న ఆర్.సుధీర్‌ను వరంగల్ చీఫ్ ఇంజనీర్‌గా పోస్టింగ్ ఇచ్చారు.

పదవీ విరమణ చేసిన కొత్తకోట శ్రీనివాసరెడ్డి

విజిలెన్స్ డీజీగా పనిచేసిన కొత్తకోట శ్రీనివాస రెడ్డి పదవీ విరమణ చేశారు. 30ఏళ్లకుపైగా సాగిన తన పోలీసు జీవితంలో ఎదురైన స్వీయ అనుభవాలకు అక్షర రూపం ఇచ్చానని ఆయన వివరించారు. తాను రాసిన కవితలను పుంజుతోక(కాక్టయిల్)గా పుస్తక రూపంలో తీసుకుని వచ్చానని తెలిపారు. నిజాయితీ, ముక్కుసూటి అధికారిగా పేరున్న శ్రీనివాసరెడ్డి రాసిన 120కిపైగా కవితలను ఈ పుస్తకంలో పొందుపరిచారు.

మూసీ ఆధునికీకరణపై అధ్యయనం

మర్కుక్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మూసీ అభివృద్ధి కోసం అధ్యయనం చేస్తున్నట్లు మూసీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సివరేజీ బోర్డు ఎండీ అశోక్ రెడ్డి తెలిపారు. కొండపోచమ్మ కాలువలను శనివారం వారు పరిశీలించారు.

అవయవదానం చేసేవారు దేవుళ్లే!

- ఒకరు కన్నుమూస్తూ 8 మందికి ప్రాణం పోయొచ్చు
- స్టార్ లివర్ టాక్‌ఎక్స్ సదస్సులో సినీ నటుడు చిరంజీవి



'లైఫ్ ఆఫ్టర్ లివర్ ట్రాన్స్‌ప్లాంట్ హ్యాండ్‌బుక్ ఫర్ హెల్తీ లివింగ్' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న చిరంజీవి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): అవయవదానం చేసేవారు దేవుళ్లతో సమానం అని సినీ నటుడు చిరంజీవి అన్నారు. దేవుడు ఎక్కడో లేడని.. మంచి మనసులో, దానగుణంలో ఉంటాడని.. అవయవ దానంతో ఇతరులకు ప్రాణదానం చేసేవారిలోనూ ఉంటాడని పేర్కొన్నారు. అవయవదానానికి ముందుకు రావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మాదాపూర్‌లో స్టార్ హాస్పిటల్ నిర్వహించిన స్టార్ లివర్ టాక్‌ఎక్స్-2025 సదస్సుకు చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 'లైఫ్ ఆఫ్టర్ లివర్ ట్రాన్స్‌ప్లాంట్: హ్యాండ్‌బుక్ ఫర్ హెల్తీ లివింగ్' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడారు. ఒక మనిషి తుదిశ్వాస విడుస్తూ అవయవ దానం ద్వారా 8మందికి ప్రాణదానం చేయొచ్చన్నారు. అవయవదానం గురించి అవగాహన పెరగాల్సిన అవశ్యకత ఉందని అభిప్రాయపడ్డారు. స్టార్ హాస్పిటల్స్ గ్రూప్ ఎండీ డాక్టర్ గోపిచంద్ మన్నం మాట్లాడుతూ మన దేశంలో ఇటీవలి కాలంలో కాలేయ వ్యాధుల సంఖ్య పెరుగుతోందని వాటి పట్ల అవగాహన కల్పించేందుకు ఓ బుక్‌లెట్ తీసుకొస్తున్నామని చెప్పారు. డాక్టర్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ స్టార్ లివర్ టాక్ ఎక్స్ విశేషాలను వెల్లడించారు. కార్యక్రమంలో లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ అండ్ హెచ్‌పీబీ సర్జరీ డైరెక్టర్, సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ మెట్టు శ్రీనివాస్ రెడ్డి, రేలా ఇనిస్టిట్యూట్ అండ్ మెడికల్ సెంటర్ చైర్మన్ డాక్టర్ మొహమ్మద్ రేలా, స్టార్ హాస్పిటల్ గ్రూప్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమేశ్ గూడపాటి తదితరులు పాల్గొన్నారు.

ఈసీతో బీజేపీ పొత్తు!



సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణసభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 'వన్ నేషన్.. వన్ ఎలక్షన్' అన్నది పూర్తిగా 'వన్ పర్సన్.. వన్ పార్టీ' ప్రయోజనాల కోసమేనని విమర్శించారు. సిద్ధాంతం ముసుగులో అధికారాన్ని శాశ్వతంగా పదిలపరుచుకోడానికి చేస్తున్న ప్రయత్నమన్నారు. ఎన్నికల్లో గెలవడానికి కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు సాధారణంగా కలిసొచ్చే మిత్రులతో కూడి ప్రజల దగ్గరకు వెళతారని అన్నారు. అనుబంధ విద్యార్థి, యువజన సంఘాలను కూడా ముందు ఉంచుతారని తెలిపారు. కానీ, ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న పెద్దలు మాత్రం ఎన్నికలప్పుడు తొలుత తమ అనుబంధ విభాగాలైన ఈడీ, ఇన్‌కమ్ ట్యాక్స్, సీబీఐలను ప్రయోగిస్తారని ఆరోపించారు. నచ్చని వ్యక్తులను అన్నివిధాలా అష్ట దిగ్బంధనం చేసి మరీ వేధిస్తారని మండిపడ్డారు. ఆపై వ్యతిరేకుల ఓట్లు తొలగించడానికి ఎన్నికల కమిషన్‌నూ పంపిస్తారని అన్నారు. ఇది ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రమాదకరమని, రాజ్యాంగాన్ని మార్చాలనుకొనే శక్తుల నుంచి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. శనివారం రవీంద్ర భారతిలో జరిగిన సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభకు సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాహుల్‌గాంధీ చేపట్టిన 'ఓట్ చోర్.. గద్దీ చోడ్' పోరాటానికి కాంగ్రెస్, కమ్యూనిస్టులే కాకుండా.. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలనుకునే వారంతా మద్దతుగా నిలవాలని కోరారు. ఇలాంటి విపత్కర సమయంలో సురవరం సుధాకర్‌రెడ్డి లాంటి నేతలు జాతీయ స్థాయిలో ఉండి ఉంటే తప్పనిసరిగా ఇండియా కూటమి మరింత బలపడేదన్నారు.

నమ్మిన సిద్ధాంతాన్ని ఆచరించిన సురవరం

విద్యార్థి రాజకీయాల నుంచి జాతీయ స్థాయి వరకు సురవరం సుధాకర్‌రెడ్డి ఎంత ఎత్తుకు ఎదిగినా తుదివరకు నమ్మిన సిద్ధాంతాన్ని ఆచరించిన పాలమూరు బిడ్డ అని సీఎం రేవంత్ కొనియాడారు. సమాజంలో చాలామంది గొప్పగా సిద్ధాంతాలు చెబుతారని, కానీ.. వాటిని ఆచరించే వ్యక్తుల్లో సుధాకర్‌రెడ్డి లాంటి వారు చాలా అరుదుగా ఉంటారని అన్నారు. అంతకుముందు సురవరం సుధాకర్‌రెడ్డి జీవన సహచరి విజయలక్ష్మి మాట్లాడుతూ.. తమ స్వగ్రామం కంచుపాడులో ప్రాథమికోన్నత పాఠశాలను హైస్కూల్‌గా ఉన్నతీకరించడంతోపాటు రోడ్డు, బస్సు సౌకర్యాలు కల్పించాలని ముఖ్యమంత్రిని కోరారు. యువతకు జీవన నైపుణ్యాల శిక్షణ కేంద్రం ఏర్పాటుకు 4.5 ఎకరాల భూమిని విరాళంగా ఇవ్వడానికి తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఇందుకు సీఎం స్పందిస్తూ.. సుధాకర్‌రెడ్డి నమ్మిన సిద్ధాంతం ప్రజలకు అర్థమయ్యేలా ఈ నేల చరిత్రలో ఎప్పటికి గుర్తుండేలా తగిన నిర్ణయం తీసుకొని త్వరలోనే ప్రకటిస్తామని అన్నారు. "కమ్యూనిజం అంటే లైబ్రరీలో చదివే పుస్తకం కాదు. పేద ప్రజల గుండెల్లో కొలువుదీరే ప్రగాఢమైన విశ్వాసం. ఎర్రజెండా ఇచ్చినంతగా మిగతా జెండాలు ప్రజలకు ఆ నమ్మకాన్ని ఇవ్వలేవు. అందుకే కమ్యూనిస్టులు మాకు సహజమిత్రులు" అని రేవంత్ వ్యాఖ్యానించారు.

కమ్యూనిస్టు ఐక్య ఉద్యమాలు బలపడాలి

దేశంలో కమ్యూనిస్టు ఐక్య ఉద్యమాలు బలపడాలని సుప్రీంకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ ఆకాంక్షించారు. సురవరం సుధాకర్‌రెడ్డిది ఆదర్శప్రాయమైన జీవితమని కొనియాడారు. కాగా, ఏపీలోని కర్నూలులో సురవరం స్మారకాన్ని ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అంగీకరించారని ఆ రాష్ట్ర సీపీఐ కార్యదర్శి రామకృష్ణ తెలిపారు. సురవరం సుధాకర్‌రెడ్డిని గొప్ప పోరాట యోధుడిగా హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ కొనియాడారు. కాగా, సురవరంతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకొని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా భావోద్వేగానికి లోనయ్యారు. సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభకు బీజేపీ, బీఆర్‌ఎస్‌తోపాటు అన్ని వామ పక్ష పార్టీల ప్రతినిధులు, సామాజికవేత్తలు, మేధావులు, కవులు, రచయితలు హాజరయ్యారు. సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, ఆ పార్టీ నేత తమ్మినేని వీరభద్రం, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు, ప్రొఫెసర్ కోదండరాం తోపాటు పెద్దసంఖ్యలో ప్రముఖులు హాజరై సురవరం సుధాకర్‌రెడ్డికి నివాళులర్పించారు.

ఆరోగ్యశ్రీ సేవలకు బ్రేక్?

- నిలిపివేతకు ప్రైవేటు ఆస్పత్రులు సిద్ధం

హైదరాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆదివారం (31వ తేదీ) అర్ధరాత్రి నుంచి ఆరోగ్యశ్రీ, జర్నలిస్టు హెల్త్ స్కీమ్, ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ సేవలను నిలిపివేసేందుకు నెట్‌వర్క్ ఆస్పత్రులు సిద్ధమయ్యాయి. పెండింగ్ బకాయిలు చెల్లించాలన్న తమ డిమాండ్‌పై ప్రభుత్వం స్పందించకపోవడంతోనే ఈ నిర్ణయానికి వచ్చినట్టు ఆస్పత్రుల యాజమాన్యాలు తెలిపాయి. రూ.1,300 కోట్లకుపైగా బకాయిలు పేరుకుపోయాయని.. దీనితో చిన్న, మధ్యస్థాయి ఆస్పత్రులను మూసేసే పరిస్థితి ఉందని పేర్కొన్నాయి. బకాయిలు చెల్లించకుంటే ఆగస్టు 31 అర్ధరాత్రి నుంచి సేవలు నిలిపివేస్తామని ఈ నెల 21వ తేదీనే 'తెలంగాణ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ (టీఏఎన్‌హెచ్‌ఏ)' ఆరోగ్యశ్రీ సీఈవోకు లేఖ రాసిందని గుర్తు చేశాయి. కానీ ఎటువంటి స్పందన రాలేదని, చర్చలకైనా ఆహ్వానించలేదని పేర్కొన్నాయి. దీనితో తప్పనిసరి పరిస్థితుల్లో డయాలసిస్, ఎమర్జెన్సీ వైద్య సేవలు మినహా మిగతా ఆరోగ్యశ్రీ సేవలన్నీ నిలిపివేస్తున్నట్టు తెలిపాయి.

ఆర్టీసీ డ్రైవర్లకు విధుల్లో సెల్‌ఫోన్ల నిషేధం!

- 1 నుంచి పైలెట్ ప్రాజెక్టుగా అమలు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్ డ్రైవర్లు బస్సు నడిపే సమయంలో సెల్‌ఫోన్లు వినియోగించకుండా నిషేధించాలని ఆర్టీసీ నిర్ణయించింది. ఈ మేరకు సెప్టెంబరు 1 నుంచి 30 వరకు 11 డిపోల పరిధిలో పైలెట్ ప్రాజెక్టుగా నిషేధం అమలు చేయనున్నారు. రోడ్డు భద్రతలో భాగంగా ఆర్టీసీ ఈ కీలక నిర్ణయం తీసుకుంది. డ్రైవర్లు విధుల్లో ఉన్నప్పుడు ఫోన్లు వినియోగిస్తున్నట్లు విజిలెన్స్ విభాగం తనిఖీల్లో గుర్తించారు. ఈ నేపథ్యంలో డ్రైవర్లు విధుల్లో ఉన్నప్పుడు ఫోన్లు వాడకుండా నెల రోజుల పాటు పైలెట్ ప్రాజెక్టు అమలు చేయనుంది. 11 డిపోల పరిధిలో దీన్ని అమలు చేయనుండగా గ్రేటర్ జోన్‌లోని ఫరూఖ్‌నగర్, కూకట్‌పల్లి డిపోల్లో అమలు చేయనున్నారు. డ్రైవర్లు డిపోలకు వచ్చి విధుల్లో చేరిన సమయంలో ఫోన్లను అక్కడి లాకర్లలో భద్రపరచాల్సి ఉంటుంది. సంబంధిత డ్రైవర్లకు అత్యవసర సమాచారం ఇవ్వాల్సి వస్తే ఆయా బస్సుల్లోని కండక్టర్లను సంప్రదించి ఆ సమాచారం అందించేలా చర్యలు చేపడుతున్నారు.

యూరియా ఆందోళనలు కపట నాటకం

- కాళేశ్వరంపై చర్చను పక్కదారి పట్టించాలని బీఆర్‌ఎస్ ఎత్తు
- వరి వేస్తే ఉరి అన్నవారే నీతులు చెబుతున్నారు: మంత్రి తుమ్మల



హైదరాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు చేసిన ఆందోళన ఓ కపట నాటకమంటూ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. శనివారం వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద బీఆర్‌ఎస్ నిర్వహించిన నిరసనపై మంత్రి తీవ్రంగా స్పందించారు. "యూరియా కొరతకు కారణం రాష్ట్ర ప్రభుత్వమా? కేంద్ర ప్రభుత్వమా? అనేది మీకు తెలియదా?" అని బీఆర్‌ఎస్ నేతలను ప్రశ్నించారు. అసెంబ్లీలో కాళేశ్వరం ప్రాజెక్టుపై చర్చను పక్కదారి పట్టించేందుకే నిరసన కార్యక్రమం పేరుతో బీఆర్‌ఎస్ దిగజారుడు రాజకీయం చేస్తోందని మండిపడ్డారు. "జియో పాలిటిక్స్ ఒకవైపు.. డిమాండ్‌కు తగ్గట్లు దేశీయ ఉత్పత్తి లేకపోవడం మరోవైపు యూరియా కొరతను సృష్టిస్తుంటే.. రైతులను రెచ్చగొట్టే ప్రయత్నాలు ఎందుకు చేస్తున్నారు? రేవంత్ పాలనలో మూడు పంటకాలాల్లో యూరియా కొరత లేని విషయం మీకు తెలియదా? కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ప్రశ్నించకుండా.. రాష్ట్ర ప్రభుత్వంపై ఎందుకు ఆరోపణలు చేస్తున్నారు?" అని అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. వరి వేస్తే ఉరి అన్నవారు ఇప్పుడు తమకు నీతులు చెబుతున్నారని మండిపడ్డారు. "బీఆర్‌ఎస్ హయాంలో.. ఏ ఒక్క ఏడాదీ రైతుల కోసం రూ.20 వేల కోట్లకు మించి ఖర్చు చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలోనే రూ.32,408 కోట్లను రైతుల ఖాతాల్లో జమచేసింది. గతంలో ఏకకాలంలో రుణ మాఫీ చేయకపోవడంతో.. రైతులపై రూ.8,515 కోట్ల అదిక వడ్డీ భారం పడింది. కాంగ్రెస్ పాలనలో ఏకకాలంలో రూ.2 లక్షలలోపు రుణాలను పరిగణనలోకి తీసుకుని, నెలలోపే రూ.20,616.89 కోట్లను మాఫీ చేశాం. ఈ ఏడాది ఏప్రిల్ 1 నాటికి 1.90 లక్షల మెట్రిక్ టన్నుల బఫర్ స్టాక్‌ని పరిగణలోకి తీసుకున్న కేంద్ర ప్రభుత్వం.. 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించింది. ఆ యూరియా సరఫరాలో జాప్యంపై నేను స్వయంగా కేంద్ర మంత్రులను కలిసి, పలుమార్లు విజ్ఞప్తి చేశాను" అని వ్యాఖ్యానించారు. బీఆర్‌ఎస్ పాలనలో ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో యూరియా సరఫరాలో ఇబ్బందులు తలెత్తిన విషయాన్ని గుర్తుచేశారు. "రామగుండం ఎరువుల కర్మాగారం 85 రోజుల పాటు పనిచేయకపోవడం బీఆర్‌ఎస్ నేతలు చూడలేదా? బీఆర్‌ఎస్ కపట నాటకాలను నమ్మే స్థితిలో రైతులు లేరు. రైతుల ముసుగులో బీఆర్‌ఎస్ చేస్తున్న నాటకాలను ప్రజలు చీత్కరించుకుంటున్నారు" అంటూ తుమ్మల దుయ్యబట్టారు.

యూరియా కోసం నువ్వానేనా!

నారాయణపేట జిల్లా తీలేరులో పోలీసులు, రైతుల మధ్య తోపులాట.. ఓ రైతును చెంపమీద కొట్టిన ఎస్సై

- మహబూబాబాద్ జిల్లాలో రైతుల రాస్తారోకో
- వాహనాల్లోంచి గాలి తీసేందుకు యత్నం

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)



నారాయణపేట జిల్లా తీలేరులో యూరియా పంపిణీ సమయంలో తోపులాటలో రైతుపై చేయి చేసుకుంటున్న ఎస్సై

రైతులకు యూరియా కష్టాలు తీరేదెన్నడో గానీ తెల్లవారగానే క్యూలైన్లలో నిల్చోవడం వారికి తప్పడం లేదు. గంటల తరబడి నిరీక్షించినా సరిపడా బస్తాలు దొరక్కపోవడంతో నిరాశా తప్పడం లేదు. రైతుల్లో ఓపిక నశిస్తోంది. ఇప్పుడు యూరియా కేంద్రాల వద్ద తోపులాటలు, గొడవలూ జరుగుతున్నాయి. నారాయణపేట జిల్లా మరికల్ మండలం తీలేరు సింగిల్‌విండో కార్యాలయం దగ్గర శనివారం యూరియా పంపిణీ సందర్భంగా రభస జరిగింది. 600 బస్తాల యూరియా కోసం1200 మంది రైతులొచ్చారు. గుంపులు గుంపులుగా ఉన్న రైతులను పోలీసులు వరుసగా నిల్చోబెట్టే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా పోలీసులు, రైతుల మధ్య వాగ్వాదం జరిగింది. ఇది తోపులాటకు దారితీసింది. రైతులను అదుపుచేసే క్రమంలో ఎస్సై రాము సహనం కోల్పోయి మండలంలోని రాకొండకు చెందిన రైతు సత్యనారాయణరెడ్డి చెంపమీద కొట్టారు. ఈ ఘటన స్వల్ప ఉద్రిక్తతకు దారితీసింది. తనను ఎస్సై ఉద్దేశపూర్వకంగా కొట్టారని ఆ రైతు ఆరోపిస్తే.. తన చేయి అనుకోకుండా ఆ రైతుకు తగిలిందని ఎస్సై పేర్కొన్నారు. కాగా రైతు పట్ల దురుసుగా ప్రవర్తించిన ఎస్సై రాముపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఎస్పీ యోగేశ్ గౌతమ్ తెలిపారు. మహబూబాబాద్ జిల్లా మహబూబాబాద్, నర్సింహులపేట, గూడూరు మండలాల్లో రైతులు రాస్తారోకో చేశారు. ఆపై ఎమ్మెల్యే భూక్యా మురళినాయక్ క్యాంపు ఆఫీసు వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఆ తర్వాత గూడూరు మెయిన్‌రోడ్డుపై ధర్నా నిర్వహించడంతో 40 నిమిషాల పాటు వాహనాలు నిలిచిపోయాయి. ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాల టైర్ల నుంచి గాలి తీసేందుకు రైతుల్లో కొందరు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. నర్సింహులపేటలో మహిళా రైతు కళమ్మ, యూరియా ఇప్పించాలంటూ ఏవో వినయ్ కుమార్ కాళ్లు పట్టుకొని వేడుకుంది.

సర్కారు వైఫల్యం వల్లే యూరియా కొరత

- పండుగ రోజూ రైతుల పడిగాపులు
- పదేళ్ల కేసీఆర్ పాలనలో ఇలాంటి పరిస్థితే రాలేదు
- అసెంబ్లీని 15 రోజులు నిర్వహించాలి
- కాళేశ్వరం ప్రాజెక్టుపై జవాబిస్తాం
- అది పీసీ ఘోష్ కమిషన్ కాదు.. పీసీసీ కమిషన్: కేటీఆర్
- వ్యవసాయ కమిషనరేట్, గన్‌పార్క్ వద్ద బీఆర్‌ఎస్ ధర్నాలు
- కేటీఆర్, హరీశ్ సహా ఎమ్మెల్యేల అరెస్టు



హరీశ్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు; ధర్నా చేస్తున్న కేటీఆర్‌ను తరలిస్తున్న పోలీసులు

హైదరాబాద్/బర్కత్‌పుర, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగ రోజు కూడా రైతులు వర్షంలో తడుస్తూ ఎరువుల కోసం పడిగాపులు కాయాల్సి రావడం దురదృష్టకరమని, ఇలాంటి దుస్థితి ఎందుకు దాపురించిందో కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో ఏ ఒక్క రోజూ ఎరువుల కొరత రాలేదని, రైతులు లైన్లలో నిల్చున్న సందర్భమే లేదని తెలిపారు. కాంగ్రెస్ సర్కారు వైఫల్యం వల్లే యూరియా కోసం చెప్పులు, ఆధార్ కార్డులను లైన్లలో పెట్టాల్సిన దౌర్భాగ్య పరిస్థితి వచ్చిందని ధ్వజమెత్తారు. అసెంబ్లీ సమావేశాలు శనివారం ప్రారంభమైన నేపథ్యంలో కేటీఆర్ నాయకత్వంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గన్‌పార్క్ వద్ద ఉన్న అమరవీరుల స్థూపం వద్దకు చేరుకుని ఖాళీ యూరియా బస్తాలను ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం వ్యవసాయశాఖ కమిషనరేట్‌కు చేరుకుని.. కమిషనర్ గోపీకి వినతి పత్రం ఇచ్చారు. రైతులకు ఎరువులు సరఫరా చేసే వరకూ కదిలేది లేదంటూ అక్కడే బైఠాయించారు. ఆ తర్వాత సచివాలయం వద్ద మరో సారి ఆందోళనకు దిగారు. ఆయా నిరసన కార్యక్రమాల్లో కేటీఆర్ మాట్లాడుతూ యూరియా సంక్షోభం, రైతుల కష్టాలపై చర్చించకుండా తమకు అనుకూలమైన ఒకటీ రెండు అంశాలపైనే మాట్లాడి సభను ముగించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నిసున్నారని ఆరోపించారు. ప్రజల కష్టాలపై చర్చించడానికి కనీసం 15 రోజులైనా అసెంబ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ కోసం వేసింది పీసీ ఘోష్ కమిషన్ కాదని, అది కాంగ్రెస్ పార్టీ వేసుకున్న పీసీసీ ఘోష్ కమిషన్ అని ఎద్దేవా చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడే అవకాశం ఇస్తే కాళేశ్వరం ప్రాజెక్టుపై స్పష్టమైన సమాధానం చెబుతామన్నారు. యూరియా అడిగినందుకు రైతు చెంప చెళ్లుమనిపించడమేనా ప్రజా పాలన? ఇందిరమ్మ రాజ్యమంటే ఇదేనా? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. దమ్ముంటే యూరియా కొరత, వరద బీభత్సంపై అసెంబ్లీలో చర్చ పెట్టాలని సవాల్ విసిరారు. నిరసన తెలుపుతున్న కేటీఆర్, హరీశ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అదుపులోకి తీసుకొని, బీఆర్‌ఎస్ భవన్‌కు తరలించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: N. Rahul Kumar. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.